V3 NEWS

www.vishvambhara.com
తెలుగు దినపత్రిక
# విశ్వంభర
అక్షరం సాక్షిగా..
శనివారం
31-08-2024
సంపుటి : 01 । సంచిక : 119 । పేజీలు : 12 । వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్



డా॥ కాచం సత్యనారాయణ
CMD

# నా తలవంచి క్షమాపణలు చెబుతున్నా

శివాజీ విగ్రహం కూలిన ఘటనతో తీవ్ర వేదనకు గురయ్యా

మనకు ఈ దైవం కంటే గొప్పది ఏమీ లేదు

మహారాష్ట్ర పర్యటనలో ప్రధాని మోడీ వ్యాఖ్యలు



**ముంబయి:** మహారాష్ట్రలో ఛత్రపతి శివాజీ భారీ విగ్రహం కూలిన ఘటనపై విపక్షాలు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నాయి. ఈ ఘటనపై తాజాగా ప్రధాని మోదీ క్షమాపణలు తెలియజేశారు. "నేను ఇక్కడ దిగిన వెంటనే.. విగ్రహం కూలడంపై శివాజీకి క్షమాపణలు చెప్పాను. ఈ ఘటన వల్ల బాధకు గురైన వారికి నా క్షమాపణలు తెలియజేస్తున్నాను" అని వెల్లడించారు. "ఛత్రపతి శివాజీ మహారాజ్ ను తమ దైవంగా భావించేవారు ఈ ఘటనతో తీవ్ర వేదనకు గురయ్యారు. నా తలవంచి వారికి క్షమాపణలు చెబుతున్నా. మనకు ఈ దైవం కంటే గొప్పది ఏమీ లేదు" అని మోదీ మాట్లాడారు. ఈ రోజు మహారాష్ట్రలోని పాల్ఘర్లో పర్యటించిన సందర్భంగా ఆయన ఈ విధంగా స్పందించారు. ఛత్రపతి శివాజీ భారీ విగ్రహం కొద్దిరోజుల క్రితం కుప్పకూలిపోయింది. 35 అడుగుల ఎత్తున్న ఈ విగ్రహాన్ని గతేడాది డిసెంబరు 4న నౌకాదళ దినోత్సవం సందర్భంగా మిగతా2లో...



# పర్యాటకులను ఆకట్టుకునేందుకు కొత్త పాలసీలు

## హైదరాబాద్‌లో మరో జూ పార్క్

- అనంతగిరిలో నేచర్ వెల్ నెస్ సెంటర్
- పోర్ట్ సిటీలో వెయ్యి ఎకరాల హెల్త్ హబ్
- టీటీడీ తరహాలోయాదగిరిగుట్ట ఆలయ బోర్డు
- రామప్ప గుడి ఆకృతిలో కీసరగుట్ట ఆలయ పునర్నిర్మాణం
- హెల్త్, ఎకో, టెంపుల్ టూరిజంపై ప్రత్యేక ఫోకస్
- స్పీడ్ ప్రాజెక్టుల సమీక్షలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి

**విశ్వంభర, హైదరాబాద్:** రాష్ట్రంలో పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి కొత్త విధానాన్ని రూపొందించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. టూరిజంలో ముందంజలో ఉన్న ఇతర రాష్ట్రాలు అనుసరిస్తున్న విధానాలను తెలుసుకోవాలని, వాటిలో మెరుగైనవి, మన రాష్ట్రానికి అనువుగా ఉన్న వాటిని అనుసరించాలని సూచించారు. స్పీడ్ (స్మార్ట్ ప్రోయాక్టివ్ ఎఫిషియెంట్ అండ్ ఎఫెక్టివ్ డెలివరీ) సమీక్షలో భాగంగా శుక్రవారం సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి టూరిజం అభివృద్ధి ప్రాజెక్టులపై అధికారులతో సమావేశమయ్యారు. పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, టూరిజం ముఖ్య కార్యదర్శి వాణి ప్రసాద్,

భారత న్యాయవ్యవస్థపై నాకు అత్యంత విశ్వాసం ఉంది: సీఎం రేవంత్ రెడ్డి 10

## 2026 మార్చికల్లా పూర్తి చేస్తాం

- ఈ ప్రాజెక్టు వరంగల్ జిల్లాకు జలప్రదాయినిగా మారనుంది
- దేవాదుల ఎత్తిపోతల పథకాన్ని పరిశీలించిన మంత్రులు
- కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేంత వరకు
- సీతారామకు నీటి కేటాయింపులు జరగలేదు
- సమీక్షా సమావేశంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



2

## కేసీఆర్ కుటుంబాన్ని వదిలే ప్రసక్తే లేదు

- బీఆర్ఎస్ కాంగ్రెస్‌లో విలీనం కావడం ఖాయం
- హైడ్రా కూల్చివేతలు కక్షసాధింపు చర్యల్లా కనిపిస్తున్నాయి
- ఒవైసీ కాలేజీకి ఏడాది సమయం ఎందుకిచ్చారు?
- కేంద్ర మంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు



2

# పేదల ఇళ్లపైకి కాంగ్రెస్ ప్రభుత్వం బుల్డోజర్లు పంపుతోంది




- ఒకరి ఇంటిని కూల్చివేసి, వారి కుటుంబాన్ని నిరాశ్రయులుగా మార్చడం అమానవీయం
- ఎక్స్ వేదికగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విజ్ఞప్తి

**విశ్వంభర ,తెలంగాణ బ్యూరో:** రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పట్ల అత్యుత్సాహం ప్రదర్శిస్తున్న తీరుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. పేదల ఇళ్లపైకి కాంగ్రెస్ ప్రభుత్వం బుల్డోజర్లు పంపుతుందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేకు శుక్రవారం X వేదికగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. మీరు చెప్పినట్లుగా, ఒకరి ఇంటిని కూల్చివేసి, వారి కుటుంబాన్ని మిగతా2లో...

## నిండుకుండలా నాగార్జున సాగర్


- ప్రాజెక్టుకు కొనసాగుతున్న భారీ ఇన్ ఫ్లో ..
- 26 క్రస్ట్ గేట్లు పైకి ఎత్తి దిగువకు నీటి విడుదల..
- లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారుల హెచ్చరికలు



2

## జన్వాడ్ వైపు హైడ్రా బుల్డోజర్లు

- కూల్చివేతలకు రంగం సిద్ధం
- జన్వాడ ఫామ్ హౌజ్‌కు అనుమతుల్లేవు
- ప్రాథమిక సమాచారం సేకరించిన రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు
- పిరంగి నాలాను ఆక్రమించినట్లు నిర్ధారణ
- హైడ్రాను స్ట్రాంగ్ చేసేందుకు సర్కారు యాక్షన్ ప్లాన్
- రేపో, మాపో అధికారిక ఆదేశాలు వెలువడే అవకాశం



2



2

టీజీపీఎస్సీకి హైకోర్టు

## నోటీసులు


తెలంగాణ గ్రూప్ 1 పోస్టుల్లో రిజర్వేషన్ అమలుపై

వివరణ కోరుతూ ఉత్తర్వులు జారీ

## పాక్ ఉగ్ర చర్యలకు తగిన పరిణామాలు తప్పవు

**పాక్ ఎలా వ్యవహరిస్తే..**

- భారత్ కూడా అందుకు తగినవిధంగా బదులిస్తుంది
- ఇరుదేశాల మధ్య సంబంధం అస్థిరంగా ఉంది
- దేశంలోని మైనారిటీలు, హిందువుల భద్రతకు యూనస్ మోదీకి హామీ ఇచ్చారు
- విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్



2

## నిమజ్జనంపై నజర్

- సిబ్బందికి అవగాహన కల్పించాలి
- పార్కింగ్ సమస్య లేకుండా చూడాలి
- బేబీ పాండ్లను పరిశీలించిన మేయర్ విజయలక్ష్మి



2

మరిన్ని తాజా వార్తల కోసం **స్కాన్** చేయండి



## నేటి చికెన్ ధరలు

| ఫామ్ ధర | రిటైల్ |
|---|---|
| ₹ 99 | ₹ 121 |
| **స్కిన్** | **స్కిన్ లెస్** |
| ₹ 175 | ₹ 200 |

**ప్రతిపక్షంపై కక్షతో**

# రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకునే కుట్రలు

- అభివృద్ధి నిరోధక అజెండా అమలుచేస్తున్న రేవంత్ సర్కార్..
- మంజూరైన అనేక పనులను, బిల్లుల చెల్లింపులు నిలిపివేశారు
- రాజకీయాలు పక్కనపెట్టి రాష్ట్ర అభివృద్ధికి పాటు పడాలి: మాజీ మంత్రి హరీశ్‌రావు



2

# అయ్యో పాపం.. అమ్మ



ఆ తల్లికి ఎంత కష్టమొచ్చింది..!

ఆస్తులు పంచుకుని వదిలేశారు

అందరూ ఉండి అనాథను చేశారు

నిజాంపేటలో అమానవీయ ఘటన

**విశ్వంభర, మెదక్:** అడ్డాల నాడు బిడ్డలు కానీ. గడ్డాల నాడు బిడ్డలు కాదని అంటారు.. అదే నిజం అనిపిస్తుంది.కన్నతల్లిని కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన కుమారుడు కనికరం లేకుండా నిర్ధాక్షిణ్యంగా ఇంట్లో నుంచి గెంటేశాడు. నవ మాసాలు మోసి, కని, పెంచిన మాతృమూర్తి పట్ల దయ లేకుండా వ్యవహరించాడు. ఉన్న ఆస్తి లాక్కొని, కన్నతల్లికి అన్నం పెట్టకుండా రోడ్డుపై వదిలేసిన అమానవీయ ఘటన మెదక్ జిల్లా నిజాంపేట మండల కేంద్రంలో చోటుచేసుకుంది. మెదక్ జిల్లా నిజాంపేట మండల మిగతా2లో...

# నిమజ్జనంపై నజర్

**విశ్వంభర, హైదరాబాద్:** వినాయక నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కాకముందే జీహెచ్ఎంసీ నిమజ్జనంపై పూర్తి స్థాయిలో దృష్టి సారించింది. ఈ మేరకు శుక్రవారం మేయర్ గద్వాల్ విజయలక్ష్మి వినాయక నిమజ్జనం కోసం ఏర్పాటు చేస్తున్న బేబీ పాండ్లను పలు ప్రాంతాల్లో పరిశీలించారు. కూకట్ పల్లి జోన్ లోని హస్మత్ పేట్ లేక్ వద్ద బేబీ పాండ్ లను జోనల్ కమిషనర్, కార్పొరేటర్ లతో కలిసి వినాయక నిమజ్జనం ఏర్పాట్లను మేయర్ పరిశీలించారు. ప్రగతి నగర్, ఐ డి ఎల్ , లింగం చేరువు కొత్త చెరువులు బేబీ పాండ్స్ వద్ద నిమజ్జన ఏర్పాట్లు ను పరిశీలించి పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. భక్తులకు ఎలాంటి సౌకర్యం కలగ కుండా అన్ని సౌకర్యాలు, ఏర్పాటును వారం లోగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. చెరువులు, బేబీ పాండ్స్ వద్ద అవాంచనీయ సంఘటనలు జరగకుండా భద్రత చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రతి బేబీ పాండ్ వద్ద వేలల్లో జనాలు వచ్చే అవకాశమున్నందున వాహనాల పార్కింగ్ ఇబ్బంది లేకుండా చూడాలని, బేబీ పాండ్స్ చుట్టూ భారీ కెట్స్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. నిమజ్జన ప్రక్రియ ప్రారంభం కాకముందే సిబ్బందికి నిమజ్జనంపై అవగాహన కల్పించాలని మేయర్ ఆదేశించారు. నిమజ్జనం చేసిన విగ్రహాలను సంప్రదాయ పద్ధతి లో తొలగించే విదంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా లైటింగ్,మొబైల్ టాయిలెట్స్, త్రాగు నీరు , హెల్త్ క్యాంపు, హెల్ప్ డెస్క్, అవసరమైన క్రెన్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని మేయర్ ఆదేశించారు.

# నిండుకుండలా నాగార్జున సాగర్

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:** నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు వరద కొనసాగుతోంది. దీంతో అధికారులు 26 క్రస్ట్ గేట్లను ఎత్తి 2.10 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. శ్రీశైలం ప్రాజెక్టు నుంచి సాగర్‌కు 2.50 లక్షల క్యూసెక్కుల నీరు వస్తుండగా, రిజర్వాయర్ నుంచి అదే స్థాయిలో విడుదల కొనసాగుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు... కాగా.. ప్రస్తుత నీటి మట్టం 589.50 అడుగులకు చేరింది. దీంతో 26 క్రస్ట్ గేట్లను ఎత్తివేసి అధికారులు నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ కు పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం..312.50 టీఎంసీలు కాగా.. ప్రస్తుత నీటి నిల్వ సామర్థ్యం 311.14.టీఎంసీలు.. ఇక ఇన్ ఫ్లో:3,45,795..క్యూసెక్కులు కాగా.. ఔట్ ఫ్లో : 3,45,795.క్యూసెకులుగా కొనసాగుతుంది. మరోవైపు కృష్ణా దిగువ ప్రాంతంలో వరద ఉధృతి ఎక్కువగా ఉన్నందున లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. మరోవైపు నిర్మల్ జిల్లా కడెం ప్రాజెక్టు కు కొనసాగుతున్న భారీ వరద కొనసాగుతుంది. మూడు గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల చేస్తున్నారు అధికారులు. ప్రాజెక్టుకు పూర్తి స్థాయి నీటి మట్టం :700 అడుగులు కాగా.. ప్రస్తుత నీటి మట్టం:699.350 అడుగులకు చేరింది. పూర్తి స్థాయి నీటి సామర్థ్యం :7.603 టీఎంసీలు.. ఇక ప్రస్తుత నీటి నిలువ: 7.432 టీఎంసీ.. అయితే.. ఇన్ ఫ్లో: 25403 క్యూసెక్కులు కాగా.. అవుట్ ఫ్లో: 21749 క్యూసెక్కులుగా కొనసాగుతుంది

# టీజీపీఎస్సీకి హైకోర్టు నోటీసులు

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:** తెలంగాణ గ్రూప్ 1 పోస్టుల భర్తీ వ్యవహారంలో రిజర్వేషన్ల అమలుపై హైకోర్టు టీజీపీఎస్సీకి, ప్రభుత్వానికి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. రిజర్వేషన్ల అమలు చేస్తున్న విధానంపై వివరణ ఇవ్వాలంటూ తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కు, రాష్ట్ర ప్రభుత్వానికి ఈ మేరకు హైకోర్టు ఉత్తర్వుల్లో పేర్కొంది. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించింది. అనంతరం తదుపరి విచారణను సెప్టెంబరు 27వ తేదీకి వాయిదా వేసింది. టీజీపీఎస్సీ గ్రూప్-1 పోస్టుల భర్తీకి సంబంధించి జీవో 55కు సవరణ తీసుకువస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో 29ను సవాలు చేస్తూ.. ఎం హనుమాన్‌తోపాటు మరో ముగ్గురు అభ్యర్థులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

దీనిని విచారించిన జస్టిస్ కె శరత్ ఇరువర్గాల వాదనలు విన్నారు. పిటిషనర్ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. గ్రూప్-1 మెయిన్స్‌కు 1:50 నిష్పత్తిలో అభ్యర్థుల ఎంపికకు సంబంధించి రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించలేదని అన్నారు. మొత్తం 563 పోస్టులకు జనరల్ కేటగిరీలో 209, ఈడబ్ల్యూఎస్ 49, బీసీ(ఏ) 44, బీసీ (బీ)37, బీసీ(సీ) 13, బీసీ(డీ) 22, బీసీ(ఈ) 16, ఎస్సీ 93, ఎస్టీ 52, క్రీడాకారులు 4, దివ్యాంగులు 24 పోస్టులు చొప్పున ఉన్నాయని పేర్కొన్నారు. ప్రతి కేటగిరీలో 1:50 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపిక చేయడంలో టీజీపీఎస్సీ నిబంధనలు పాటించలేదని వ్యాఖ్యానించారు. తద్వారా రిజర్వుడు కేటగిరీ అభ్యర్థులకు అన్యాయం జరుగుతోందని కోర్టుకు వివరించారు. కొన్ని విభాగాల్లో 1:50 నిష్పత్తి దాటిందని పేర్కొన్నారు. ఇది సుప్రీంకోర్టు తీర్పులకు విరుద్ధమని న్యాయమూర్తికి వాదనలు వినిపించారు. పిటిషనర్ తరపు న్యాయవాది వాదనలను విన్న న్యాయమూర్తి వివరణ కోరుతూ ప్రభుత్వానికి, పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కు నోటీసులు జారీ చేశారు.

# పేదల ఇళ్లపైకి కాంగ్రెస్ ప్రభుత్వం బుల్డోజర్లు పంపుతోంది

(మొదటి పేజీ తరువాయి)

నిరాశ్రయులుగా మార్చడం అమానవీయం, అన్యాయం అని మల్లికార్జున్ ఖర్గేను ఉద్దేశించి కేటీఆర్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు. పేదల ఇళ్లపైకి కాంగ్రెస్ ప్రభుత్వం బుల్డోజర్‌లు పంపుతుంది. రాష్ట్రం బుల్డోజర్ రాజ్యంగా మారకుండా సీఎంకు ఖర్గే సలహా ఇవ్వాలి. నోటీసులు ఇవ్వకుండా మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో 75 ఇండ్లను కూల్చేశారు. ఈ 75 కుటుంబాల్లో దాదాపు 25 కుటుంబాలు వికలాంగులకు చెందినవి. రాష్ట్రంలో చట్టం, న్యాయ వ్యవస్థ పట్ల ధిక్కారం జరుగుతుంది అని కేటీఆర్ పేర్కొన్నారు.


# జన్వాడ్ వైపు హైడ్రా బుల్డోజర్లు

**విశ్వంబర హైదరాబాద్:**

శంకర్ పల్లి మండలంలోని జన్వాడ గ్రామంలో మాజీ మంత్రి కేటీఆర్ కు చెందిన ఫామ్ హౌజ్ నిర్మాణానికి ఎలాంటి అనుమతుల్లేనట్లు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు ప్రాథమిక సమాచారం సేకరించినట్లు తెలుస్తోంది. గతంలో 66 ఫీట్ల వెడల్పుతో ఉన్న పిరంగి నాలాను ఆక్రమించి ఈ ఫామ్ హౌజ్ ను నిర్మించటంతో పాటు జీవో 111 కూడా వర్తిస్తుందన్న ఆరోపణల నేపథ్యంలో ఇటీవలే రెండు రోజుల పాటు ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు కేటీఆర్ కు చెందిన ఫామ్ హౌజ్ లో సర్వే నిర్వహించి, నాలా ఎంత మేరకు ఆక్రమణకు గురైందన్న విషయాన్ని గుర్తించారు. అంతేగాక, ఈ పామ్ హౌజ్ కు స్థానిక విలేజ్ సర్పంచ్ అనుమతులిచ్చిన విషయం కూడా తెరపైకి రావటంతో సర్పంచ్ ఎలా అనుమతినిస్తారు? ఆయన ఇచ్చిన అనుమతులు చెల్లవంటూ కూడా అధికారులు నిర్థారించినట్లు తెలిసింది. ఈ క్రమంలో రేపో మాపో జన్వాడ ఫామ్ హౌజ్ ను కూల్చేందుకు హైడ్రా రంగం సిద్దం చేస్తున్నట్లు తెలిసింది.

**ఔటర్ వరకు హైడ్రా పరిధి పెంపు...**

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ట్రై సిటీల్లోని సర్కారుకు చెందిన చెరువులు, కుంటలు, నాలాలతో పాటు ఇతర ఆస్తులను కాపాడేందుకు సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో ఏర్పాటు చేసిన హైడ్రా ఆక్రమణలపై ఉక్కుపాదం మోపుతున్న తీరు కేవలం సిటీలోనే గాక, రాష్ట్ర వ్యాప్తంగా కూడా చర్చనీయాంశమైన నేపథ్యంలో హైడ్రా పరిధిని మరింత పెంచాలని సర్కారు భావిస్తుంది. ఇందులో భాగంగా ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ శాంతి కుమారి రెండు రోజుల క్రితం వివిధ విభాగాల ఉన్నతాధికారులు,



నాలుగు జిల్లాల కలెక్టర్లతో కూడా ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించిన సంగతి తెల్సిందే. హైడ్రా పరిధిని పెంచటంతో పాటు హైడ్రాకు మరిన్ని అధికారులిచ్చే దిశగా కార్యచరణను సిద్దం చేయాలని సీఎస్ ఆదేశించిన విషయం తెల్సిందే. ముఖ్యంగా ఔటర్ రింగ్ రోడ్డు దాటిన నాలుగైదు కిలోమీటర్ల దూరంలో ఉన్న గండిపేట బఫర్ జోన్ పరిధిలోకి వచ్చే ఖానాపూర్ లో విలాసవంతమైన విల్లాలను హైడ్రా కూల్చివేసిన తర్వాత అక్రమ నిర్మాణాలను అడ్డదారిలో పెంచి పోషించిన ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు తమ ఉనికిని చాటుకునేందుకే మరి కొన్ని అక్రమ నిర్మాణాలకు నోటీసులు జారీ చేసిన విషయాన్ని సర్కారు గుర్తించిన తర్వాతే సీఎస్ ఉన్నత స్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించినట్లు సమాచారం. హైడ్రా యాక్షన్ లోకి వచ్చిన తర్వాత రెవెన్యూ, ఇరిగేషన్ ఇతరత్ర శాఖలకు చెరువు లు, కుంటల్లో నిర్మితమైన అక్రమ నిర్మాణాలకు ఎవరికి వారే వేర్వేరుగా నోటీసులు జారీ చేస్తున్న విషయాన్ని గుర్తించిన సర్కారు ఫిర్యాదులు వస్తున్న నిర్మాణాలు ఎంత వరకు అక్రమ నిర్మాణాలు అన్న విషయాన్ని గుర్తించేందుకు రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలు హైడ్రాకు సహకరించాలే తప్పా, తదుపరి చర్యలు తీసుకోరాదన్న విషయాన్ని సిఎస్ స్పష్టం చేసినట్లు సమాచారం. ఇకపై ఔటర్ రింగ్ రోడ్డు వరకు కూడా అక్రమ నిర్మాణాలపై కూల్చివేత నిర్ణయం హైడ్రా మాత్రమే తీసుకునేలా సర్కారు రేపోమాపో ఆదేశిలివ్వనున్నట్లు సమాచారం.

**అడ్డదారుల్లో అనుమతులిచ్చిన అధికారుల జాబితా సిద్దం...**

మాదాపూర్ లోని తమ్మిడి కుంట చెరువులో ఎన్ కన్వేన్షన్ నిర్మాణానికి పరోక్షంగా సహకరించిన ప్లానింగ్ అధికారులతో పాటు గండిపేట బఫర్ జోన్ లో విలాసవంతమైన విల్లాల నిర్మాణాలకు అడ్డదారిలో అనుమతులిచ్చి ప్రోత్సహించిన రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలకు చెందిన ఆఫీసర్ల జాబితాను ఇప్పటికే హైడ్రా సిద్దం చేసినట్లు సమాచరరం. ఫస్ట్ అక్రమ నిర్మాణాలను తొలగించి కబ్జాకు గురైన చెరువులు, కుంటలు, నాలాల స్థలాలకు విముక్తి కల్గించిన తర్వాత నిబంధనలకు విరుద్దంగా నిర్మాణాలను ప్రోత్సహించిన అధికారులను బాధ్యులను చేసి, క్రిమినల్ చర్యలు తీసుకునేందుకు రంగం సిద్దమైనట్లు సమాచారం.

**రామ్ నగర్ లో అక్రమ నిర్మాణాల కూల్చివేత...**

ముషీరాబాద్ నియోజకవర్గం పరిధిలోని రామ్ నగర్ లో నాలాపై నిర్మించిన నిర్మాణాలను హైడ్రా శుక్రవారం కూల్చివేసింది. గురువారమే హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఈ ఏరియాలో పర్యటించిన 24 గంటల్లోనే అక్రమ నిర్మాణాలను కూల్చేవేయటం పట్ల స్థానికుల్లో హర్షం వ్యక్తమవుతుంది. హైదరాబాద్ రామ్ నగర్ లోని మల్లెమ్మ గల్లీలోని ఇంటి నెంబర్ 01-9-189 నెంబర్ గల స్థలం తమదని విక్రం యాదవ్ అనే వ్యక్త పేర్కొన్నారు. కానీ ఈ స్థలంలో అక్రమంగా కల్లు కాంపౌండ్ కొనసాగుతుందని స్థానికులు రెండు రోజుల క్రితం హైడ్రా కమిషనర్కు స్థానికుల ఫిర్యాదు చేయటంతో శుక్రవారం అక్కడి నిర్మాణాన్ని హైడ్రా కూల్చివేసింది.

# పాక్ ఉగ్ర చర్యలకు తగిన పరిణామాలు తప్పవు

**ఢిల్లీ:** పాకిస్థాన్తో నిరంతరం చర్చలు జరిపే కాలం ముగిసిందని విదేశాంగ మంత్రి జైశంకర్ పేర్కొన్నారు. శుక్రవారం ఢిల్లీలో నిర్వహించిన పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. పాకిస్థాన్ పై భారతదేశ వైఖరి గురించి మాట్లాడుతూ పాక్ ఎలా వ్యవహరిస్తే.. భారత్ కూడా అందుకు తగినవిధంగా బదులిస్తుందని వ్యాఖ్యానించారు. పరిస్థితులకు అనుగుణంగా భారత్ ముందడుగు వేస్తుందని తెలిపారు. పాకిస్థాన్ చేపడుతున్న ఉగ్రవాద చర్యలకు తగిన పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. ఇటీవల జమ్మూలో తరచూ జరుగుతున్న ఉగ్రదాడులతో ఇరుదేశాల మధ్య సంబంధం అస్థిరంగా ఉందని పేర్కొన్నారు. ప్రధాని మోదీ ఈ విషయంలో వెనక్కి తగ్గరన్నారు. జమ్మూకశ్మీర్లో ఆర్టికల్ 370 రద్దు ఓ ముగిసిన కథ అని జైశంకర్ పేర్కొన్నారు. బంగ్లాదేశ్లో నెలకొన్న రాజకీయ అనిశ్చితి గురించి జైశంకర్ ప్రస్తావించారు. బంగ్లా మాజీ ప్రధాని షేక్ హసీనా దేశాన్ని విడిచిపెట్టినప్పటి నుంచి దేశం తీవ్ర పరిస్థితిని ఎదుర్కొంటోందన్నారు. అక్కడి హిందువులపై జరుగుతున్న దాడుల నేపథ్యంలో వారి భద్రత విషయంలో ఆందోళన వ్యక్తంచేశారు. పొరుగుదేశాలతో సమస్యలు ఉండని దేశమంటూ ఏదీ లేదని వ్యాఖ్యానించారు. దేశాల మధ్య పరస్పర సహాయ, సహకారాలు అందించుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ ప్రధాన సలహాదారు మహమ్మద్. యూనస్తో మాట్లాడారు. కాగా దేశంలోని మైనారిటీలు, హిందువుల భద్రతకు యూనస్ మోదీకి హామీ ఇచ్చారు. మైనారిటీలపై దాడుల గురించి అసత్య ప్రచారాలు జరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. మార్చిలో సింగపూర్ పర్యటనలో భాగంగా జైశంకర్ మాట్లాడుతూ పాక్పై మండిపడ్డారు. "ఒక పరిశ్రమ స్థాయిలో పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తోంది. అయితే ప్రస్తుతం ఉగ్రవాదాన్ని ఉపేక్షించే పరిస్థితిలో భారత్ లేదు. ఈ సమస్యకు పరిష్కార మార్గాలు కనుగొనాలి. ప్రతి దేశమూ ఒక సుస్థిరమైన పొరుగుదేశాన్ని కోరుకుంటుంది. అదీ కాకపోతే, కనీసం ఎలాంటి గొడవలకు దిగని దేశమైనా ఉండాలని ఆశిస్తుంది. పాక్తో సంబంధాలు మెరుగుపర్చుకునేందుకు ఉగ్రవాదాన్ని చూసీచూడనట్టు వదిలేయలేం" అని జైశంకర్ స్పష్టంచేశారు.

# నా తలవంచి క్షమాపణలు చెబుతున్నా

(మొదటి పేజీ తరువాయి)

ప్రధానమంత్రి మోదీ ఆవిష్కరించారు. రాష్ట్రంలో కురిసిన వర్షాల కారణంగానే విగ్రహం కూలినట్లు భావిస్తున్నామని, అసలు కారణాన్ని నిపుణులు త్వరలోనే వెల్లడిస్తారని అధికారులు తెలిపారు. కాగా, తొమ్మిది నెలలు కూడా పూర్తికాకుండానే విగ్రహం కూలిపోవడం పట్ల ప్రతిపక్షాలు మండిపడ్డాయి.రాష్ట్రప్రభుత్వానికి ప్రచారం మీద ఉన్న దృష్టి, నాణ్యత మీద లేదని దుయ్యబట్టాయి.

# అయ్యో పాపం.. అమ్మ

(మొదటి పేజీ తరువాయి)

కేంద్రానికి చెందిన కుంట సత్తవ్వ వయసు 70 సంవత్సరాలు. ఆమెకి ముగ్గురు సంతానం ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె . ఆమె భర్త కుంట ఎల్లయ్య అనారోగ్యంతో మరణించగా అమె చిన్న కుమారుడు కుంట కృష్ణ గుండెపోటుతో మరణించాడు. పెద్ద కుమారుడు రమేష్ మెదక్ లో కూరగాయల వ్యాపారం చేస్తున్నాడు. సత్తవ్వ పేరిట మూడెకరాల భూమి ఉండగా.. రెండేండ్ల కింద పెద్ద కొడుకు రమేశ్ ఒక్కడే అమ్ముకున్నాడు. మూడు రోజుల కింద సత్తవ్వ వద్ద ఉన్న15 తులాల బంగారాన్ని రమేశ్ లాక్కొని బయటకు గెంటేశారు.సత్తవ్వ గురువారం సొంతూరు నిజాంపేటకు వచ్చి.. నడిచే ఓపిక లేక, ఇంటికి వెళ్లలేక రోడ్డు పక్కన కూర్చుంది.చివరికి ఆమెకు ఒక పూట భోజనం పెట్టకుండా ఇంటిలో నుంచి గెంటి వేయడంతో ఆమె రోడ్డుమీద బతికే పరిస్థితి ఏర్పడింది. ఇంట్లో నుంచి అనాథగా రోడ్డుపై కనిపించింది. గ్రామస్తులు చూసి అడగగా..తనకు ఇద్దరు కొడుకులు, ఒక కుమార్తె ఉందని, వారి పెళ్లిల్లు చేశానని, తన పేరు మీద ఉన్న భూములను ఇద్దరు కొడుకులు సమంగా పంచుకున్నారని, చిన్న కుమారుడు చనిపోయాడని, ఉన్న కుమారుడైనా తన బాగోగులు చూసుకుంటాడనుకుంటే, కనీసం కనికరమైనా చూపకుండా ఇంటి నుంచి తరిమేశాడని ఆ తల్లి భార హృదయంతో బోరున విలపించింది. రమేశ్ రోజూ తాగొచ్చి పింఛన్ డబ్బులు ఇవ్వాలని గొడవ పడుతుండని, ఇవ్వకుంటే చంపేస్తానని బెదిరించేవాడని వాపోయింది. తన వద్ద ఉన్న బంగారం లాక్కొని ఇంట్లోంచి వెళ్లగొట్టాడని వృద్ధురాలు రోదిస్తూ తెలిపింది.తన పెద్ద కుమారుడు అన్నంపెట్టి పోషించాల్సి వస్తుందని రాక్షసుడిలా మారాడని ఆ తల్లి ఆవేదన చెందింది. ఇంటి నుంచి గెంటి వేయడంతో తాను రోడ్డు మీద బతికే పరిస్థితి ఏర్పడిందని విలపించింది. చిన్నప్పటినుండి వారిని కనిపెంచి పెద్దవారిని చేశాను.. ఇదేనా నేను చేసిన పాపం అంటూ తల్లి సత్తవ్వ ఆవేదన గుర్తెంది. ఇకనైనా ప్రభుత్వం స్పందించి తగిన న్యాయం చేయాలని బాధితురాలు వేడుకుంటుంది.

# కేసీఆర్ కుటుంబాన్ని వదిలే ప్రసక్తే లేదు



**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:** తనను 2 సార్లు జైలుకు పంపించిన కేసీఆర్ కుటుంబాన్ని వదిలే ప్రసక్తి లేదని కేంద్రమంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తనపై 109 కేసులు పెట్టి వేధించిందని చెప్పుకొచ్చారు సంజయ్. నాగోల్‌లో శుక్రవారం నిర్వహించిన బీజేపీ వర్క్‌షాప్‌కు బండి సంజయ్ చీఫ్ గెస్టుగా హాజరయ్యారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒకటేనన్న సంజయ్... బీఆర్ఎస్ కాంగ్రెస్ లో విలీనం కావడం ఖాయమని చెప్పుకొచ్చారు. ఎమ్మెల్సీ కవితకు బీజేపీ వల్లే బెయిల్ వచ్చిందని కాంగ్రెస్ ఆరోపిస్తోందని... వ్యక్తులు, ప్రభుత్వాలు ఇచ్చే సూచనలతో కోర్టులు తీర్పులు, బెయిల్ ఇవ్వవన్న విషయాలను ఆ పార్టీ నేతలు గుర్తించుకోవాలని చెప్పారు. హైడ్రా కూల్చివేతలపై కేంద్రమంత్రి బండి సంజయ్ సెటైర్లు వేశారు. హైడ్రా కూల్చివేతలు కక్షసాధింపు చర్యల్లా కనిపిస్తున్నాయని అన్నారు. అన్ని ఆక్రమణల విషయంలో హైడ్రా ఒకేలా వ్యవహరించడం లేదని సంజయ్ మండిపడ్డారు. నాగోల్ శుభమ్ కన్వెన్షన్‌లో బీజేపీ సభ్యత్వ నమోదుపై వర్క్ షాప్ జరిగింది. దీనికి బండి సంజయ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. సల్కం చెరువులో ఆక్రమణలను ఎందుకు కూల్చడంలేదని ప్రశ్నించారు. ఒవైసీ కాలేజీకి మాత్రం ఏడాది సమయం ఎందుకిచ్చారని సంజయ్ నిలదీశారు. అందరికీ ఒకే న్యాయమైతే.. ఒవైసీ కాలేజీని కూల్చాలంటూ సంజయ్ కీలక వ్యాఖ్యలు చేశారు.

# ప్రతిపక్షంపై కక్షతో రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకునే కుట్రలు

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్షంపై కక్షతో రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకునే కుట్రలకు పాల్పడటం దుర్మార్గమని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. గత అసెంబ్లీ సమావేశాల్లో బీఆర్ఎస్ పార్టీ అడిగిన ప్రశ్నకు ప్రభుత్వం ఈ వివరాలను బయటపెట్టిందంటూ శుక్రవారం ఎక్స్ వేదికగా వెల్లడించారు. అభివృద్ధి కాంక్షను పక్కనబెట్టి, రాజకీయ కక్షతో ముందుకు వెల్లడం గర్హనీయమని విమర్శించారు. రేవంత్ రెడ్డి దివాళాకోరు రాజకీయాలకు ఇది పరాకాష్ట అని ఆగ్రహం వ్యక్తంచేశారు. స్పెషల్ డెవలప్మెంట్ ఫండ్ ( ఎస్ డి ఎఫ్ ) కింద 33 జిల్లాల్లో మంజూరైన సుమారు రూ.10 వేల కోట్ల విలువ చేసే 34,511 పనులను రద్దు చేయడమే దీనికి నిదర్శనమన్నారు. 'రాష్ట్ర ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా మంజూరైన అనేక పనులను నిలిపివేయడంతో పాటు, ఇప్పటికే ప్రారంభమైన అనేక పనులను తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు కొనసాగించొద్దని మధ్యంతరంగా నిలిపివేస్తూ ఆదేశాలు ఇచ్చింది. దాదాపు పూర్తి కావొస్తున్న ప్రాజెక్టులకు సైతం బిల్లుల చెల్లింపులు నిలిపివేసింది. దీంతో రాష్ట్రంలోని దాదాపు ప్రతి గ్రామంలో పంచాయతీరాజ్, మున్సిపల్, రోడ్లు-భవనాలు, నీటిపారుదల తదితర శాఖలపరిధిలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు నిలిచిపోయాయి. ఫలితంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన ప్రక్రియకు ఆటంకం కలిగింది. దీంతో ఎంతో మంది ఉపాధి కూడా కోల్పోతున్నారు. 9 నెలల కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి నిరోధక అజెండాతో రాష్ట్రాన్ని అధోగతిపాలు చేస్తున్నది. ఈ ప్రభుత్వానికి కొత్త పనులను చేపట్టే శక్తిసామర్థ్యాలు లేవని ఇప్పటికే తేలిపోగా, మంజూరైన పనులను పూర్తి చేసే కనీస నైతిక బాధ్యత కూడా లేదని పనుల రద్దుతో స్పష్టమైంది. కాంగ్రెస్ పాలన ప్రజలకు శాపంగా మారింది. అభివృద్ధి నిరోధకులుగా ముఖ్యమంత్రి వ్యవరిస్తున్నారు. కేసీఆర్ ప్రభుత్వం గత ఆర్థిక సంవత్సరంలో నియోజకవర్గాలకు కేటాయించిన ఎస్డీఎఫ్ నిధులను ఈ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రద్దు చేసింది. అయితే ఈ నిధుల నుండే మార్చి నెలలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉన్న నియోజకవర్గాలకు 10 కోట్ల చొప్పున మంజూరు చేసింది. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలకు మాత్రమే నిధులు ఇచ్చి తన కురచ బుద్ధిని, పక్షపాత ధోరణిని చూపింది. కాంగ్రెస్ పార్టీ గెలవని నియోజకవర్గాలపై కక్షతో ఒక్క రూపాయి నిధులను కూడా కేటాయించకపోవడం దుర్మార్గం. నిధులు కేటాయించకపోగా పురోగతిలో ఉన్న పపనులకు సైతం నిధులు నిలిపివేయడం మరో దుర్మార్గమన్నారు.

ఇప్పటివరకు రద్దు చేసిన ఎస్డీఎఫ్ పనులకు సంబంధించి ముఖ్యమంత్రి రాష్ట్రస్థాయిలో ఒక సమీక్ష సమావేశం కూడా నిర్వహించలేదు. జిల్లా కలెక్టర్లు, అధికారులు సైతం రద్దు చేసిన పనులకు సంబంధించి ఎలాంటి సమీక్షా జరపలేదు. కనీసం పురోగతిలో ఉన్న పనుల నివేదికను ప్రభుత్వానికి ఇవ్వడంలో విఫలమయ్యారు. ప్రభుత్వం అనేది నిరంతర ప్రక్రియ. ఈ ప్రక్రియలో ప్రజల అవసరాలు మారవు. మారేది కేవలం ప్రభుత్వాలు మాత్రమే. గత ప్రభుత్వ ఆనవాలు లేకుండా చేస్తానని కంకణం కట్టుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి తన అనాలోచిత చర్యలతో తన ఆనవాలునే ప్రజల్లో లేకుండా చేసుకుంటున్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం స్వార్థ పూరిత రాజకీయాలు చేయడం పక్కనపెట్టి, రాష్ట్ర అభివృద్ధికి పాటు పడాలి. గత ప్రభుత్వం మంజూరు చేసినప్పటికీ అవి ప్రజల అవసరాల కోసమే కాబట్టి ఆ పనులను పూర్తి చేసేలా తక్షణమే చర్యలు తీసుకోవాలని, నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నాం.' అంటూ హరీశ్‌రావు ట్వీట్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్షంపై కక్షతో రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకునే కుట్రలకు పాల్పడటం దుర్మార్గం. అభివృద్ధి కాంక్షను పక్కనబెట్టి, రాజకీయ కక్షతో ముందుకు వెల్లడం గర్హనీయం. రేవంత్ రెడ్డి దివాళాకోరు రాజకీయాలకు ఇది పరాకాష్ట అని పేర్కొన్నారు.

# 2026 మార్చికల్లా పూర్తి చేస్తాం

**విశ్వంభర ,తెలంగాణ బ్యూరో:** దేవాదుల ఎత్తిపోతల పథకాన్ని మార్చి 2026 నాటికి పూర్తి చేస్తామని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖామంత్రి ఎన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. నాడు ఏఐసీసీ అధ్యక్షురాలి హోదాలో సోనియాగాంధీ శంకుస్థాపన చేసిన ఈ ప్రాజెక్టును ఆమెతోనే ప్రారంభింపజేస్తామని తెలిపారు. దేవాదుల ఎత్తిపోతల పథకాన్ని శుక్రవారం మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్కతో కలిసి పరిశీలించారు.దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ పురోగతిపై ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, నీటిపారుదల శాఖ అధికారులతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లాకు జలప్రదాయినిగా మారనున్న దేవాదుల పూర్తయితే 60 టీఎంసీల నీటితో 300 రోజులు పారి ఇక్కడి పంటపొలాలు సస్యశ్యామలంగా మారుతాయన్నారు. నిర్దిష్ట కాలపరిమితులను పెట్టుకుని పాలమూరు-రంగారెడ్డి, సీతారామ సాగర్, దేవాదుల ప్రాజెక్టులను పూర్తిచేస్తామని మంత్రి తెలిపారు. ప్రాజెక్టుల నిర్మాణాలకు భూసేకరణ ఆటంకంగా మారిందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. బీఆరెస్ ప్రభుత్వం ప్రాజెక్ట్ డిజైన్లు చేసింది కానీ భూసేకరణ జరపలేదన్నారు. ప్రాజెక్టులు ఇసుక, మట్టితో పూడిపోతున్నాయని, వాటి తొలగింపురకు ఆధునిక పరిజ్ఞానాన్ని వినియోగించబోతున్నామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేంత వరకు కూడా ఖమ్మం జిల్లాలోని సీతారామ ప్రాజెక్టుకు నీటి కేటాయింపులు జరగలేదన్నారు. తాము అధికారంలోకి వచ్చిన మీదటనే సీడబ్ల్యూసీతో మాట్లాడి, 67 టీఎంసీల ప్రతిపాదనలు పంపామన్నారు. సమ్మక్క-సారక్క ప్రాజెక్టుకు




అవసరమైన ఎన్వోసీ కోసం ఛత్తీస్‌గఢ్‌తో సంప్రదింపులు జరుగుతున్నాయని తెలిపారు. సహచర మంత్రి సీతక్క ప్రతిపాదించిన లిఫ్టుల మంజూరుకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆమోదం తెలిపారు. డీ సిల్టింగ్, జంగిల్ కటింగ్ లకు 1100 కోట్లు విడుదల చేస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. నీటిపారుదల శాఖలో 700 మంది ఏఈఈలను నియమించనున్నట్టు తెలిపారు. త్వరలోనే ఔట్ సోర్సింగ్ పద్ధతిలో 1800 మంది లష్కర్ లను నియమించనున్నట్లు ఉత్తమ్ ప్రకటించారు.

హైడ్రా, జీహెచ్ఎంసీ అధికారుల

# అక్రమ నిర్మాణాలను కూల్చివేత

**విశ్వంభర, ముషీరాబాద్ :** ముషీరాబాద్ నియోజకవర్గంలోనీ రామ్ నగర్ డివిజన్ మణెమ్మ గల్లిలో రోడ్లను ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపట్టారని స్థానికుల ఫిర్యాదు మేరకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ రెండు రోజుల క్రితం రామ్ నగర్ మణెమ్మ గల్లీలో జిహెచ్ఎంసి అధికారులతో కలిసి పరిశీలించారు. దీనిపై నివేదిక సమర్పించాలని జీహెచ్ఎంసీ, రెవెన్యూ ఆఫీసర్లను ఆయన ఆదేశించారు.ఈ మేరకు పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి అక్రమ నిర్మాణాలని నిర్ధారించి నివేదిక సమర్పించగా 24 గంటల వ్యవధిలోనే జిహెచ్ఎంసి టౌన్ ప్లానింగ్ అధికారులు భారీ పోలీసు బందోబస్తు నడుమ శుక్రవారం రోడ్లను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిన నిర్మాణాలను జెసిబిల సహాయంతో కూల్చివేతలు చేపట్టారు. ఈ కూల్చివేతలతో గత కొన్ని సంవత్సరాలుగా ఇబ్బంది పడుతున్న స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్లుగా ఈ సమస్యపై పలుమార్లు జిహెచ్ఎంసి, టౌన్ ప్లానింగ్ సిబ్బందికి వివరించిన కేవలం సందర్శనలకే పరిమితం అవడం తప్ప ఎటువంటి కూల్చివేతలు చేపట్టకపోవడంతో స్థానికులు హైడ్రాకు ఫిర్యాదు చేసిన 24 గంటల్లోనే



కూల్చివేతలు చేపట్టడంతో సంతోషం వ్యక్తం చేశారు. అదేవిధంగా నియోజకవర్గంలో నాళాలను ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపట్టారని పూర్తిస్థాయిలో నియోజకవర్గ వ్యాప్తంగా పరిశీలించి అక్రమ నిర్మాణాలను తొలగించాల్సిందిగా ప్రజలు కోరారు. నాలాలను కబ్జా చేయడం వలన తేలికపాటి వర్షం వస్తేనే మోకాళ్ల లోతు వరద నీరు బస్తీల్లో ప్రవేశించి ఇండల్లోకి ప్రవేశిస్తుందని తెలిపారు. ఇటీవల పడిన భారీ వర్షాలతో రామ్ నగర్ లో ఒక వ్యక్తి వరద నీటిలో కొట్టుకుపోయి మృతి చెందిన సంఘటన గుర్తు చేస్తూ పూర్తిస్థాయిలో అక్రమ నిర్మాణాలను నాలా ఆక్రమణలను తొలగించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

# మహంకాళి ఆలయ ప్రథమ వార్షికోత్సవం

**విశ్వంభర, చేగుంట :** చేగుంట మండల కేంద్రంలోని మహంకాళి దేవాలయ ప్రథమ వార్షికోత్సవం నిర్వహిస్తున్నట్టు ఆలయ పూజారి వాసుదేవ శర్మ, రాఘవేంద్ర శర్మ, ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మొదటి రోజున బజా బజంత్రిలతో గణపతి హోమం, 30వ తేదీన అమ్మవారి పంచామృత అభిషేకం, అలంకరణ చండీ హోమం, 108 కలశములచే హనుమన్ మందిరము నుంచి శ్రీ మహంకాళి దేవాలయము వరకు ఊరేగింపుగా వచ్చి అమ్మవారి ఉత్సవ మూర్తికి అభిషేకం చేశారు. తర్వాత యజ్ఞహోమాలు సామూహిక కుంకుమార్చన సహస్రదీపార్చన, అమ్మవారికి ఓడి బియ్యం నిర్వహించారు. ఆదివారం పేద్ద ఏత్తున బోనాలు జాతర, సోమవారం అన్నదాన కార్యక్రమం, పలహారం బండి ఊరేగింపుతో ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.



# తెలంగాణ నర్సింగ్ రిజిస్ట్రార్‌ను బర్తరఫ్ చేయాలి

వంశీ ప్రసాద్

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ నర్సింగ్ రిజిస్టర్ అండ్ ఇంచార్జీగా కొనసాగుతున్న విద్యావతి 3 సంవత్సరాల సర్వీస్ కాలం ముగిసిన గత ఎనిమిది సంవత్సరాలుగా తెలంగాణ నర్సింగ్ రిజిస్ట్రార్ గా కొనసాగుతున్నరని అల్లైడ్ హెల్త్ కేర్ ప్రొఫెషనల్ & అసోసియేషన్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి వంశీ ప్రసాద్ ఆరోపించారు. తెలంగాణ నర్సింగ్ కౌన్సిల్ ఇన్చార్జి, జగిత్యాల స్కూల్ ఆఫ్ నర్సింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ గా ఉన్నారు. ఆమెను వెంటనే బర్త్ రఫ్ చేసి అర్హులైన వారిని నియమించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.




# ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపిన ప్రభుత్వ విప్

**విశ్వంభర, హైదరాబాద్:** వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ అర్చకులు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డికి ఆశీర్వచనం అందించారు. ఆలయ అభివృద్ధి పనుల కోసం రూ. 50 కోట్లు కేటాయించినందుకు విప్ ఆది శ్రీనివాస్ , ఆలయ అర్చకులు, అధికారులు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా రాజన్న ఆలయ విస్తరణ ప్రణాళికలు, నమూనాపై శృంగేరి పీఠం అనుమతి తీసుకోవలసి ఉందని వివరించగా..వెంటనే అనుమతి తీసుకుని అందుకు సంబంధించిన పనులను చేపట్టాల్సిందిగా ముఖ్యమంత్రి గారు చెప్పారు. సీఎంను కలిసినవారిలో వేములవాడ రాజన్న ఆలయ ఈవో వినోద్, స్థపతి వల్లినాయగం, ఈఈ రాజేష్ , డీఈఈ రఘునందన్, ఆలయ ప్రధాన అర్చకులు ఉమేష్ శర్మ , ఇతర ముఖ్యులు ఉన్నారు.



# ఇండ్లు కూల్చిన స్థలంలోనే పునర్నిర్మించి ఇవ్వాలి

**పాలమూరు అధ్యయన వేదిక, టీఎఫ్‌టీయూ నాయకుల డిమాండ్**

**విశ్వంభర, మహబూబ్‌నగర్ :** నిరు పేదల ఇండ్లు కూల్చిన స్థలంలోనే పునర్నిర్మించి బాధితులకు ఇవ్వాలని పాలమూరు అధ్యయన వేదిక, టీఎఫ్‌టీయూ నాయకుల డిమాండ్ చేశారు. శుక్రవారం మహబూబ్‌నగర్ క్రిస్టియన్ పల్లి సమీపంలోని సర్వే నంబర్ 523 లో రెవెన్యూ అధికారులు నిన్న రాత్రి అక్రమంగా ఇల్లు కూల్చడంతో పేదలు, వికలాంగులు నిరాశ్రయులు అయ్యారని పాలమూరు అధ్యయన వేదిక, టీఎఫ్‌టీయూ నాయకులు మండిపడ్డారు. పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ ఎం. రాఘవచారి, వామన్ కుమార్, టీ ఎఫ్ టి యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖలీల్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పి. విజయకుమార్, పి.యాదగిరి, టిఎస్టియు జిల్లా నాయకులు జి గట్టన్న, జలాల్ పాషా, బాలకృష్ణ, కుర్సీద్ తదితరులు 523 సర్వే నంబర్ లోని ఆదర్శనగర్ లో పర్యటించి బాధితులతో కలిసి వారికి సంఘీభావం తెలిపారు. వారి పోరాటానికి పూర్తి మద్దతునిస్తున్నట్టు తెలిపారు.

ఇల్లు కూలిపోయిన నిరుపేదలు అనేక కష్టాలకు ఓర్చి ఇల్లు కట్టుకున్నారని వారు తెలిపారు. కనీసం ముందస్తు సమాచారం ఇవ్వకుండా, నోటీసులు ఇవ్వకుండా, రెవెన్యూ అధికారులు ఇల్లు కూల్చారని, కనీసం వాళ్ళ ఇండ్ల నుంచి నిత్యవసర వస్తువుల్ని సరుకుల్ని కూడా బయటికి తీసుకుపోకుండా ఉన్నఫలంగా ఇళ్లను కూల్చడం హేయమైనా చర్యగా వారు అభివర్ణించారు. వందలాది పోలీసులచే అర్ధరాత్రి నివాస స్థలాల పై పడి పడుకున్నోళ్ళని పడుకున్నట్టే బయట చిలుకలు పెట్టి ఎవరు బయటికి రాకుండా భయానకమైన వాతావరణాన్ని సృష్టించి ఇండ్లు కూల్చడం ఎంతవరకు సంబబని వారు ప్రశ్నించారు. కేవలం రాజకీయ కక్షలతోటే ఇటువంటి చర్యలకు పూనుకుంటున్నట్లు అర్థం



అవుతుందని వారు అన్నారు. గత పది ఏళ్లు అధికారంలో ఉన్న టీఆర్ఎస్ ప్రభుత్వం 523 సర్వే నంబర్లు అనేకసార్లు కూల్చివేతలకు పాల్పడిందని ఇప్పుడు బీఆర్ఎస్ పార్టీ నేతలు మొసలి కన్నీరు కారుస్తున్నారని వారు విమర్శించారు.

నిజంగానే బీఆర్ఎస్ పార్టీ నాయకులకు చిత్తశుద్ధి ఉంటే వారు అధికారంలో ఉన్నప్పుడు అర్హులను గుర్తించి పట్టా సర్టిఫికెట్ ఇవ్వాల్సి ఉండెనని ఆ విధంగా ఎందుకు పట్టా సర్టిఫికెట్లు ఇవ్వలేదని ప్రశ్నించారు. అన్ని తెలిసి కూడా రెవెన్యూ అధికారుల భాగస్వామ్యంతోటే అక్కడి ఇళ్ల స్థలాలు అమ్మబడడం కానీ, ఇల్లు నిర్మించడం కానీ జరిగిందన్నారు. ఈ విషయమై స్థానిక శాసనసభ్యులు ఎన్ ఎం శ్రీనివాస్ రెడ్డి గారితో ఫోన్లో సంప్రదించగా దళారులపై చర్య తీసుకోకుండా పేదల ఇల్లు కూల్చడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నిస్తే సమాధానం చెప్పకుండా దాటవేసినట్టు వారు తెలిపారు.

మహబూబ్నగర్ జిల్లాలో పట్టణంలో అనేక చెరువులు, కుంటలు ప్రభుత్వ స్థలాలు రాజకీయ పలుకుబడి కలిగిన వ బడాబాబులు ఆక్రమించుకున్నారని వాళ్ల మీద ఎందుకు చర్య తీసుకోవడం లేదని వారు ప్రశ్నించారు. ఈ జిల్లాలో ప్రకృతి వనరులను, గుట్టల్ని ధ్వంసం చేస్తున్న ఎందుకు వాళ్ళ పై చర్యలు తీసుకోవడం లేదని వారు ప్రశ్నించారు. పలుకుబడి కలిగిన వాళ్లను వదిలేసి పేదలపై తమ ప్రతాపాన్ని చూపడం మానుకోవాలని వాళ్లు ప్రభుత్వానికి హితవు పలికారు. లేనిచో గత ప్రభుత్వానికి పట్టిన గతే ఈ ప్రభుత్వాన్ని కూడా పడుతుందని వారు హెచ్చరించారు.

ఎమ్మెల్యే వీరేశంకు

# అవమానం

**విశ్వంభర, హైదరాబాద్ :** నకిరేకల్ దళిత ఎమ్మెల్యే వేముల వీరేశంకు అవమానం జరిగింది. మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పర్యటనలో ఎమ్మెల్యేను పోలీసులు గుర్తుపట్టలేదు. స్వాగతం పలికేందుకు లోపలికి అనుమతి ఇవ్వలేదు. దీంతో ఎమ్మెల్యే విరేశం అలిగి వెళ్లిపోయారు.

# గ్రూప్-1 మెయిన్స్ వాయిదా వేయండి..

**టీజీపీఎస్సీని ఆశ్రయించిన అభ్యర్థులు**

**విశ్వంభర, హైదరాబాద్ :** గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షలను అక్టోబర్ 21వ తేదీ నుంచి నిర్వహించేందుకు టీజీపీఎస్సీ ఏర్పాట్లలో నిమగ్నమైంది. ఈ నేపథ్యంలో గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షలను వాయిదా వేయాలంటూ టీజీపీఎస్సీని గ్రూప్స్ అభ్యర్థులు ఆశ్రయించారు. ఈ మేరకు టీజీపీఎస్సీ అధికారులకు అభ్యర్థులు లేఖ అందజేశారు. పలు అంశాల మీద అభ్యర్థులు హైకోర్టుకు వెళ్లిన నేపథ్యంలో స్పష్టత వచ్చే వరకు వేచి చూడాలని కోరారు.గ్రూప్ 1 పిలిమినరీ పరీక్ష కీలో దొర్లిన తప్పులపై పలువురు అభ్యర్థులు న్యాయస్థానాలను




ఆశ్రయించారని లేఖలో గుర్తచేశారు. ప్రస్తుతం విచారణలో ఉన్న ఆ కేసులన్నింటినీ మెయిన్స్ పరీక్ష నాటికి పరిష్కరించాలని, లేనిపక్షంలో గ్రూప్ 1 మెయిన్ పరీక్షను వాయిదా వేయాలని విజ్ఞప్తిచేశారు. టీజీపీఎస్సీ చైర్మన్‌కు వినతిపత్రం సమర్పించినవారిలో గ్రూప్ 1 అభ్యర్థులు చంద్రమౌళి, వినోద్‌కుమార్, కిరణ్, సంపత్ తదితరులు ఉన్నారు.






# చెరగని గీతలు.. బాపు బొమ్మలు



**కొంటెబొమ్మల బాపు**
**కొన్ని తరముల సేపు**
**గుండె ఊయలలూపు**
**ఓ కూనలమ్మా!**

> **ఇలా ఆరుద్ర బాపుకు ఎప్పుడో చేసిన పద్యాభిషేకం బాపు అభిమానుల హృదయాలలో చిరస్థాయిగా నిలిచి ఉంటుంది ముగ్ద మనోహర రూపాల సౌందర్యాన్ని నయనానంద కరంగా చూపే కుంచె పేరే బాపు. బాపు గీసే బొమ్మలు మాట్లాడతాయి, సిగ్గు పడతాయి, నవ్విస్తాయి, వెక్కిరిస్తాయి, సకల చేష్టలూ ప్రదర్శిస్తాయి. బాపు రేఖాచిత్రాలు ఎలా గీసినా అవన్నీ కార్టూన్లు అయి సమ్మోహన పరుస్తాయి. అందమైన అమ్మాయికి మారుపేరు 'బాపు బొమ్మ'. బాపు రమణతో కలిసి సృష్టించిన బుడుగు, సీగాన పెసూనాంబ, రెండుజెళ్ళ సీత, అప్పుల అప్పారావు, గిరీశం, లావుపాటి పెళ్ళాం-బొచ్చుకుక్క లాంటి బుజ్జి మొగుడూ... వీరంతా గుర్తుకు వస్తే నవ్వు కాకుండా ఉండడం అసాధ్యం. బాపు గీత, బాపు వ్రాతలను తెలుగువారి సంస్కృతిలో భాగం చేసుకున్న బహుముఖ ప్రజ్ఞాశాలి బాపు. అయన చిత్రం ప్రచురించని తెలుగు పత్రికలు బహు అరుదు.**

బాపు అసలు పేరు సత్తిరాజు వెంకట లక్ష్మీనారాయణ. బాపు డిసెంబరు 15, 1933 వ సంవత్సరంలో పశ్చిమ గోదావరి జిల్లా, ఇరగవరం మండలం కంతేరులో వేణు గోపాల రావు, సూర్యకాంతమ్మ దంపతులకు జన్మించాడు. 1955 వ సంవత్సరంలో మద్రాసు విశ్వవిద్యాలయం నుండి లాయర్ పట్టా పుచ్చుకున్నాడు. అదే సంవత్సరం ఆంధ్ర పత్రిక దినపత్రికలో వ్యంగ్య చిత్రకారునిగా చేరారు.

బాపు చిత్రకళ ఒక విషయానికి పరిమితం కాలేదు. 1945 నుండి బాపు చిత్రాలనూ, వ్యంగ్య చిత్రాలనూ, పుస్తకాల, పత్రికల ముఖ చిత్రాలనూ, కథలకు బొమ్మలనూ, విషయానుగుణ చిత్రాలనూ పుంఖాను పుంఖాలుగా వేశాడు. కొత్త రచయితలూ, ప్రసిద్ధ రచయితలూ, పురాణాలూ, జీవితమూ, సంస్కృతీ, రాజకీయాలూ, భక్తీ, సినిమాలూ - అన్ని రంగాలలో ఆయన గీతలు వాసికెక్కాయి.

దర్శకుడిగా బాపు మొదటి చిత్రం సాక్షి. తరువాత ఆయన ఎన్నో వైవిధ్యమైన దృశ్య కావ్యాలను వెండి తెరపై సృష్టించారు. అందులో 'ముత్యాల ముగ్గు' సినిమాను తెలుగు సినిమా ప్రేక్షకులు ఎప్పటికీ మరచిపోలేరు. బాపు దర్శకత్వంలో వచ్చిన తెలుగు, హిందీ సినిమాలు అవార్డులు, రివార్డులు పొందటముతో పాటు అచ్చ తెలుగు సినిమాకి ఉదాహరణలుగా చరిత్రలో నిలిచిపోయాయి.

బాపు-రమణలవి అవిభాజ్య శరీరాలు. ఒకరిది లేఖా చిత్రమైతే, మరొకరిది రేఖా చిత్రం. రెండూ కలిస్తే మనోహర చిత్రం... అదే చలనచిత్రం. అందుకే బాపు, రమణ లను వేరు చేసి చూడలేం. 1942లో అప్పటి మద్రాసులోని పీఎస్ హైస్కూల్లో ఐదు, ఆరు తరగతులు కలిసి చదువు కున్నప్పటి నుంచి బాపు, రమణల మధ్య స్నేహం పరిమళించింది. అది చివరి వరకూ కొనసాగింది. పాఠశాల రోజుల్లోనే 'బాల' అనే చిన్నపిల్లల మ్యాగజైన్‌కు 'అమ్మమాట వినకపోతే' అనే కథను రమణ రాస్తే, దానికి బాపు బొమ్మలు వేశారు. అలా వారి ప్రయాణం మొదలైంది. . రమణ రాత, బాపు గీతలో వెలువడ్డ 'కోతికొమ్మచ్చి' 'బుడుగు'లు తెలుగు సాహితీవనంలో ఎన్నటికీ వాడిపోని అక్షర సుమాలు. దర్శకుడిగా బాపు మొదటి చిత్రం సాక్షి. తరువాత ఆయన ఎన్నో వైవిధ్యమైన దృశ్య కావ్యాలను వెండితెరపై సృష్టించారు. అందులో 'ముత్యాలముగ్గు' సినిమాను తెలుగు సినిమా ప్రేక్షకులు ఎప్పటికీ మరచి పోలేరు.

1967లో సాక్షి (సినిమా) చిత్రదర్శకునిగా సినిమా రంగంలో అడుగు పెట్టిన బాపు మొదటి చిత్రంతోనే ప్రసంసలు అందుకొని, మొత్తం 41 చిత్రాలకు దర్శకత్వం వహించాడు. బాపుకు స్వదేశీ, విదేశీ పురస్కారాలు ఎన్నో లభించాయి. సీతాకల్యాణం సినిమా లండన్‌లో జరిగిన ఫిలిం ఫెస్టివల్, షికాగో అంతర్జాతీయ ఫిలిం ఫెస్టివల్‌లో ప్రదర్శించారు. బాపు దర్శకత్వం వహించిన ముత్యాల ముగ్గు చిత్రానికి ఉత్తమ ప్రాంతీయ చిత్రంగా (1975 వ సంవత్సరం) భారత ప్రభుత్వ బహుమతి, 1986 వ సంవత్సరంలో ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం వారి ఎ.పి కళా వేదిక ద్వారా రఘుపతి వెంకయ్య స్మారక బహుమతి మదర్ థెరిస్సా బహూకరించగా తన స్నేహితుడు ముళ్ళపూడి వెంకట రమణతో కలిసి స్వీకరించారు.


చెన్నై (తమిళనాడు) శ్రీ రాజలక్ష్మి ఫౌండేషన్ వారి రాజ్యలక్ష్మి బహుమతి 1982లో, 1991లో ఆంధ్ర విశ్వవిద్యాలయం వారి గౌరవ డాక్టరేట్ కళాప్రపూర్ణ, 1992లో అమెరికా తెలుగు అసోసియేషన్ (ATA) వారిచే శిరోమణి బహుమతి అమెరికాలో స్వీకరణ,1993లో మిస్టర్ పెళ్ళాం సినిమాకు ఉత్తమ ప్రాంతీయ చిత్రంగా భారత ప్రభుత్వ బహుమతి, 1995లో తెలుగు అసోసియేషన్ అఫ్ నార్త్ అమెరికా (తానా) వారిచే తెలుగు చిత్ర కళా, సాహిత్య, సాంస్కృతిక, సినిమా రంగాలకు తన ఏభై సంవత్సరాల (గోల్డెన్ జూబ్లీ సెలెబ్రేషన్) సేవకు గాను ఘన సన్మానం, బాపు మీద ప్రముఖ తెలుగు సినిమా దర్శకుడు వంశీ తీసిన డాక్యుమెంటరీ చిత్రానికి 1996 వ సంవత్సరంలో ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ నంది అవార్డు, 2001 జూన్ 9 వ సంవత్సరంలో ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ కార్టూనిస్ట్స్ (IIC) వారిచే జీవిత సాఫల్య బహుమతి, 2002లో తెలుగు విశ్వవిద్యాలయం నుండి సాంస్కృతిక రంగంలో విశిష్ట బహుమతి, అకాడమీ అఫ్ ఫైన్ ఆర్ట్స్, తిరుపతి వారిచే ప్రెసిడెంట్ అఫ్ ఇండియా అవార్డు,

బాలరాజు కథ (1970), అందాల రాముడు (1973), ముత్యాల ముగ్గు (1975), పెళ్లి పుస్తకం (1991), మిస్టర్ పెళ్ళాం (1993), శ్రీరామరాజ్యం (2011) సినిమాలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారి నంది పురస్కారాలు, 2013 కు ప్రకటించిన పద్మ పురస్కారాలలో కళల విభాగంలో తమిళనాడు రాష్ట్ర విభాగంలో పద్మశ్రీ బహుమతి లభించాయి.

2014 ఆగస్టు 31న చెన్నైలోని ఒక ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బాపు తిరిగి రాని లోకాలకు వెళ్లి పోయారు.

# తెలుగు సాహిత్యంలో చెరగని ముద్ర వేసిన ఆరుద్ర

## నేడు ఆయన జయంతి



తెలుగు సాహిత్యంలో ఆరుద్రది ప్రత్యేక స్థానం. అపరాధ పరిశోధక నవలల నుంచి సమగ్ర ఆంధ్ర సాహిత్యం సంపుటాల వరకు ఆరుద్ర స్పృశించని సాహితీ శాఖ లేదంటే అతిశయోక్తి కాదేమో. కవిగా, రచయితగా, కథకునిగా, పరిశోధకునిగా, నాటక కర్తగా, విమర్శకునిగా ఆరుద్ర సాహితీ సేవనం అనితరసాధ్యం. నిరంతరం నవ్యత కోసం పరితపించిన నిత్య శోధనా సక్తులు ఆరుద్ర. శ్రీశ్రీ తర్వాత యువతరంపై ఎక్కువ ముద్ర పడిన కవిగా పేరు పొందిన ఆరుద్ర 'అభ్యుదయ రచయితల సంఘం' వ్యవస్థాపకుల్లో ఒకరు. తెలుగు సినిమా పాటకు ఓ కొత్త ఒరవడి సృష్టించిన ఆరుద్ర సంగీత దర్శకులిచ్చిన బాణీలకు అనుకూలంగా, సునాయాసంగా, సరళంగా పాటలు రాయగలిగారు.

ఆరుద్ర అసలు పేరు భాగవతుల సదాశివ శంకర శాస్త్రి. 1925 ఆగస్టు 31న విశాఖ పట్టణంలో ఆరుద్రా నక్షత్రాన జన్మించిన ఆరుద్ర పండిత వంశంలో పుట్టడం భూమికగా బాల్యం నుంచీ సాహిత్యంపై మక్కువ కలిగి, పట్టు చిక్కించుకున్నారు. తెలుగుతో పాటు అనేక భాషల్లోనూ పాండిత్యం సంపాదించారు. విశాఖపట్నం ఎ.వి.యన్. కాలేజీ ఉన్నత పాఠశాలలో, విజయ నగరంలో యం.ఆర్.కళాశాలలో ఆరుద్ర విద్యాభ్యాసం చేశారు. క్విట్ ఇండియా ఉద్యమ కాలంలో చదువుకు స్వస్తి పలికి 1943-47 మధ్యకాలంలో రాయల్ ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌లో గుమ్మస్తాగా పని చేశారు. మద్రాస్‌కు మకాం మార్చి, ఆనందవాణి అనే పత్రికకు రెండేళ్ళు సంపాదకునిగా పనిచేసారు.1949 లో సినీరంగ ప్రవేశం చేసి, అనేక సినిమాలకు మాటలు, పాటలు వ్రాసారు.1954 లో ప్రఖ్యాత రచయిత్రి అయిన రామలక్ష్మిని వివాహమాడారు. చిత్తూరు నాగయ్య నటించిన 'బీదలపాట్లు' చిత్రంలో తొలిసారి ఆరుద్రకు సినీ పాటల రచనకు అవకాశం వచ్చింది. అందులో ఆయన రాసిన "ఓ చిలుకరాజా నీ పెళ్ళెపుడయ్యా..." పాట అలరించింది. ఆరుద్ర గురించి తెలిసిన ప్రఖ్యాత హిందీ నటులు రాజ్ కపూర్ తన 'ఆహ్' చిత్రాన్ని తెలుగులో డబ్బింగ్ చేస్తూ, ఆయననే రచయితగా ఎంచుకోగా, రాజ్ కపూర్ 'ప్రేమ లేఖలు' తెలుగులోనూ మంచి ఆదరణ పొందింది. అందులో ఆరుద్ర పలికించిన పాటలన్నీ జనాన్ని మురిపించాయి. "పందిట్లో పెళ్ళవుతున్నాదీ... కనువింద వుతున్నాదీ..." పాట విశేషాదరణ పొందింది. నాటి రోజుల్లో పెళ్లి పందిళ్ళలో బాజా భజంత్రీల ద్వారా బాగా వినిపించేది.

ఆరుద్ర వందలాదిగా గేయాలు, గేయ నాటికలు, కథలు, నవలలు, సాహిత్య పరిశోధక వ్యాసాలు, వ్యంగ వ్యాసాలు, పుస్తకాలకు పీఠికలు, పుస్తకాలపై విమర్శలు... ప్రధానంగా సినీ గీతాలు ఒక్కటేమిటి, సకల సాహితీ ప్రక్రియల్లో వైవిధ్య రచనల్లో సాటిలేని మేటి అనిపించు కున్నారు.

త్వమేవాహం, సినీవాలి, కూనలమ్మ పదాలు, ఇంటింటి పద్యాలతో పాటు వెన్నెల - వేసవి, దక్షిణ వేదం, జైలు గీతాలు వంటి అనువాద రచనలు రాదారి బంగళా, శ్రీకృష్ణదేవరాయ, కాటమరాజు కథ వంటి అనేక రూపకాలుతో పాటు కథలనూ, నవలలనూ కూడా రాశారు. మేధస్సునే కాక, ఆరోగ్యాన్ని కూడా ఫణంగా పెట్టి రచించిన సమగ్ర ఆంధ్ర సాహిత్యం ( 14 సంపు టాలు) ఆరుద్ర పరిశోధనా దృష్టికి పరాకాష్ఠ. వేమన వేదం, మన వేమన, వ్యాస పీఠం, గురజాడ గురుపీఠం, ప్రజాకళలో ప్రగతి వాదులు వంటివి ఆరుద్ర సాహిత్య విమర్శనా గ్రంథాలు. రాముడికి సీత ఏమౌతుంది?, గుడిలో సెక్స్ వంటి రచనలు ఆరుద్ర పరిశీలనా దృష్టికి నిదర్శనాలు. సంగీతం పైనా, నాట్యం, ఇతర కళలపై సాధికా రికంగా రచించిన వ్యాసాలు, చదరంగం అంశాన్ని దశాబ్ధాలకు పూర్వమే ఒక గ్రంథస్థం చేయడం ఆరుద్రలోని ప్రత్యేకతకు నిదర్శనం. అంతేకాదు, ఆరుద్ర క్లబ్ పాటలు కూడా విశేష సినీ ప్రేక్షకుల ఆదరణకు పాత్రాలు అయినాయి....మ్ము మ్ము మ్ము ముద్దంటే చేదా ఇపుడా ఉద్దేశం లేదా?, తీస్కో కోకాకోలా ఏస్కో రమ్ము సారా; మసక మసక చీకటిలో మల్లెతోట వెనకాల; మొదటి పెగ్గులో మజా - వేడి ముద్దులో నిషా లాంటి పాటలెన్నో ఆరుద్రనే రాశారా అన్న అనుమానం కలిగేలా చేశాయి. తెలంగాణ పోరాట ఇతివృత్తం నేపథ్యంలో రాసిన త్వమేవాహం క చదివి ఇక నేను పద్యాలు రాయక పోయినా పరవాలేదు అని మహాకవి శ్రీశ్రీ ప్రశంస పొందిన ఆరుద్ర... ఇతను 'ఆరుద్ర' కాదు, 'ఆరో రుద్రుడు' అని శ్రీశ్రీ చేత శ్లాఘించ బడిన గొప్ప వ్యక్తి ఆయన. తెలుగు సాహితీ పుస్తకంలో చెరగని సంతకం చేసిన ఆరుద్ర... మహాకవి శ్రీశ్రీకి మేనల్లుడు, ప్రఖ్యాత తెలుగు రచయిత్రి కె.రామలక్ష్మికి పతి దేవుడు.1998 జూన్ 4న ఆరుద్ర ఈ లోకాన్ని వదిలి వెళ్లారు.



-రామ కిష్టయ్య సంగన భట్ల...
9440595494

# నిరంతర పర్యవేక్షణతోనే ప్రజా సమస్యల పరిష్కారం

> **కుటుంబ నియంత్రణ ఉద్యమం 1975 సంవత్సర ప్రాంతంలో మన దేశంలోని అన్ని ప్రాంతాల్లో ఉవ్వెత్తున సాగింది. దాని వల్ల "జనాభా నియంత్రణ" బాగానే జరిగిందనే చెప్పవచ్చు. ఆనాడు ప్రతి చోట ప్రతి నోట ఒక మాట విన వచ్చేది. 'పిల్లలు కనడం గొప్ప కాదు పెంచి పోషించడం గొప్ప', 'చిన్న కుటుంబం - చింతలులేని కుటుంబం' అనే నినాదం ప్రచారం ప్రజల్లోకి వెళ్ళింది. చాలా వరకు ప్రజలు దాన్ని అమలు చేసారని చెప్పవచ్చు.జనాభా నియంత్రణలో ప్రభుత్వాలు చూపిన చొరవ, ప్రజా సమస్యల పరిష్కారం చూపడం లేదు.**

ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీలు, పిల్లల వసతి గృహాలు, హాస్పిటల్స్, బస్ స్టాండ్లు, బస్ స్టేషన్ లు వీటన్నింటిలో మరుగుదొడ్లు స్నానాల గదులు చూడండి మీకు విషయం అర్ధమవుతుంది.పిల్లలు భావి భారత పౌరులంటారు. అవి పరిశుభ్రంగా వుంటేనే కదా పిల్లల శారీరక ఆరోగ్యం, మానసిక ఆరోగ్యం బాగుండేది. హాస్పిటల్స్ లోని మరుగుదొడ్లు చెప్పనలవి కాదు. బస్ స్టేషన్, బస్ స్టాండ్ లు సరేసరి!

హాస్పిటల్స్ లో వాడేసిన సూదులు, గుడ్డలు వాటిని ఎప్పటికప్పుడు తీసే వ్యవస్థ కానరాదు. ఆరోగ్యాన్ని కాపాడే దవాఖానాలే అనారోగ్యం పాలైతే ప్రజల ఆరోగ్యం ఎలా ఉంటుంది. ఇక బడుగు - బలహీన వర్గాలకు ఇండ్ల నిర్మాణం చేసి కోట్లు ఖర్చులు చేశామని పత్రికల్లో ఘనంగా ప్రకటనలనిస్తారు. 'ప్రారంభోత్సవ' ఆర్భాటాలు అయిపోగానే వాటికి కావాల్సిన వసతుల కల్పన మారుస్తారు. ప్రారంభోత్సవాలై ఏండ్లు గడుస్తున్నా విద్యుత్, నీటి సరఫరా, మరుగుదొడ్ల నిర్మాణ, నిర్వహణ, రోడ్లు, ట్రాన్స్ పోర్ట్ వగైరాలు ఎలా వున్నాయో చూసే వారుండరు. పాలకులు మళ్ళీ ఒకసారి వాటి స్థితిగతులు చూడాలి. అటువైపు చూడకుంటే ఎలా తెలుస్తుంది నివాస యోగ్యమా? కాదా? అని.

ఇక జల వనరుల విషయానికి వస్తే ప్రాజెక్టులు నిర్మాణం చేసి వాటి గేట్లు వ్యవహారం చూడకపోతే పంట పొలాల గతేంకాను?. వేలకోట్లతో ప్రాజెక్టులు కట్టింది సాగు నీరందటానికే కదా! దాని నిర్వహణ సరిగాలేకపోతే ప్రాజెక్టుల ప్రయోజనం ఎలా నెరవేరుతుంది.ఇక కాల్వల విషయానికి వస్తే పూడికలు, చెట్లు పెరిగి నీటి పారుదలకు అడ్డంకిగా మారి కాలవలు తెగే ప్రమాదముంటుంది. కాల్వల చివరి వరకు నీరందదు. ప్రభుత్వ అధికారులకు, ఉద్యోగులకు తెలియక కాదు. బాధ్యతారాహిత్యం, నిర్లక్ష్యం, పాలకులు ప్రభుత్వ ఉద్యోగులతో పని చేయించుకోవాలి. వారిపై అజమాయిషీ వుండాలి. ఒక రోజు, ఒక నెల చూస్తే సరిపోతుందా? నిరంతరంగా తనిఖీలు జరగాలి.

పెద్ద పెద్ద బ్రిడ్జీలు నిర్మాణాలు జరిగి, ప్రారంభోత్సవాలకు నోచుకోకముందే కూలుతున్నట్టుగా వార్తలొస్తున్నాయి. వాటిపై చర్యలు తీసుకున్న వార్తలు రావు. విద్యుత్ శాఖ వారు లోగడ వేసిన స్థంభాలు కొన్ని కాలం చెల్లిపోయి, కూలిపోయే స్థితిలో వుంటాయి. సకాలంలో గుర్తించి వాటి స్థానంలో కొత్తవి పాతించాలి. తీగలు గాలికి ఉయ్యాల లాగా ఊగుతుంటాయి. వాటిని గుర్తించి సరి చేయించాలి. విషయాలు చిన్నవే అయినా సకాలంలో చర్యలు చేపడితే ప్రమాదాలు తగ్గించవచ్చును.

కేంద్ర ప్రభుత్వంలోని రైల్వేల విషయానికి వస్తే ఎన్ని ప్రమాదాలు జరిగినా వారి పద్ధతులు మార్చుకోవడానికి సిద్ధంగాలేరు. పదే పదే ప్రమాదాలు జరుగుతున్నాయి. 'చనిపోయిన వారికి పరిహారం, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం, ప్రగాఢ సానుభూతి' తెలపడం తప్ప తిరిగి అవి జరగకుండా చర్యలు కానరావు. రైలు భోగీలలో మరుగుదొడ్లలో అపరిశుభ్రతకు చర్యలు కానరావు.

నిర్మాణాలకు ఇంజనీరింగ్ విభాగం ఎలాగో నిర్వహణకు కూడా ఒక వ్యవస్థ ఉండాలి. అది అప్పుడప్పుడు కాదు ప్రతి రోజు చూడవలసిందే. అప్పుడే తగిన ఫలితాలను ఆశించవచ్చు. మరుగుదొడ్లు, స్నానాల గదులకు 'సులభ్' లాంటి సంస్థలకు అప్పగించాలి. లబ్దిదారుల నుండి మెయింటెనెన్స్ వసూలు తప్పుకాదు. అపార్ట్ మెంట్ లోని నివాసితులు మెయింటెనెన్స్ ఇవ్వడం లేదా? రోడ్ల పై వాహనాలు టోల్ గేట్స్ వద్ద టాక్స్ లు చెల్లించడం లేదా? పారిశుధ్యం కొరకు ప్రజల ఆరోగ్యం కొరకు ఆ వ్యవస్థ ఏర్పాటు చేయాలి. నేషనల్ హైవేస్ రోడ్లు, టోల్ గేట్లు వసూళ్లతో రోడ్ల నిర్వహణ చక్కగానే చేస్తున్నారు.

మిగతా రోడ్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వాలు పంచాయితీ రోడ్లు కానీ, రోడ్ల భవనాల శాఖ రోడ్లు కానీ, గుంటలు లేకుండా నిర్వహణ చేబడితే వాహనాలు బాగా నడవగలవు. ప్రయాణీకులు సుఖంగా ప్రయాణం చేయగలరు. పాలకులు - "బాధ్యతలనెన్నడు మరిచిపోరాదు .."ప్రజా క్షేమం - ప్రభుత్వ ధ్యేయం"..నిరంత పర్యవేక్షణతోనే ప్రజా సమస్యల పరిష్కారం సాధ్యమవుతుంది.



**- జిన్నం అంజయ్య**
రచయిత, కవి,
సీనియర్ రాజకీయ నాయకుడు
9849310392

## వ్యాసాలు, కవితలకు ఆహ్వానం

**విశ్వంభర ఎడిటోరియల్ పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను, కవితలను ఆహ్వానిస్తున్నాం. ఈ కింది చిరునామాకు పోస్టులో లేదా ఈ-మెయిల్ ద్వారా పంపించగలరు. మీ వ్యాసం 1000 పదాలకు మించకుండా ఉండాలి. తెలుగు యునీకోడ్‌లో టైప్ చేసి పంపిన వాటికి ప్రాధాన్యం ఉంటుంది. రచయితలు విశ్వంభరకు మాత్రమే పంపుతున్నామని హామీపత్రం జత చేయాలి.**

**చిరునామా:**
V3 న్యూస్, విశ్వంభర తెలుగు దినప్రతిక కార్యాలయం, ప్లాట్ నంబర్ 204, రెండో అంతస్తు, బాదం కాంప్లెక్స్, మెట్రో పిల్లర్ నంబర్ 1560 ఎదురుగా, చైతన్యపురి ఎక్స్ రోడ్డు, హైదరాబాద్-500060

ఈ-మెయిల్: editpagevishwambhara@gmail.com
ఇతర వివరాలకు సెల్ నం: 9441222429 సంప్రదించగలరు.

# ఇటిక్యాల గ్రామంలో కుల బహిష్కరణ.!

## న్యాయంకోసం బాధితుల పోరాటం..



**విశ్వంభర, జగిత్యాల:** జగిత్యాల జిల్లా రాయికల్ మండలంలోని ఇటిక్యాల గ్రామానికి చెందిన బోయిని గంగారాం కుటుంబాన్ని కుల బహిష్కరణ చేయడమే కాకుండా తన కుటుంబ సభ్యులతో ఎవరు మాట్లాడిన వారికి వార్నింగ్ ఇస్తూ జరిమానా విధిస్తామని బెదిరిస్తున్నట్లు బాధితుడు బోయిన గంగారాం తెలిపారు. బాధితుడి వివరాల ప్రకారం.. ఇటిక్యాల గ్రామానికి చెందిన బోయిని గంగారాం బంధువైన మారంపల్లి శ్రీనివాస్ మేడిపల్లి మండలంలో టెక్నికల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. కాగా విధులను అడ్డంగా పెట్టుకుని బోయిని వంశపారంపర్యంగా వస్తున్న గంగారం భూమి(సర్వే నెంబర్ 779/ఆ)ను మారంపల్లి శ్రీనివాస్ కావాలని రికార్డులో కొట్టేసి తన ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ భూమిని కాజేయడానికి యత్నిస్తున్నాడని, గతంలో కూడా ఓ ల్యాండ్ విషయంలో అక్రమాలకు పాల్పడితే ఆ బాధితుడు కోర్టును ఆశ్రయించారని గంగారాం వాపోయాడు. మారంపల్లి శ్రీనివాస్ తన అధికారాన్ని అడ్డం పెట్టుకొని అధికార యంత్రాంగానికి చెడ్డ పేరు తెస్తున్నాడని అన్నాడు. ఇందులో మారంపల్లి శ్రీనివాస్ తో పాటు ఉన్నతాధికారులకు లంచాలు అందుతున్నాయని గంగారం అనుమానం వ్యక్తం చేశాడు. ఏడాది క్రితం బాధితులు పోలీసులను ఆశ్రయించడంతో అప్పటి రాయికల్ ఎస్సై కిరణ్ కుమార్ బాధితుల దగ్గర నుంచి ఆధారాలు స్వీకరించి భూకబ్జా దారులపై కేసు నమోదు చేశారు. సాధారణ ట్రాన్స్ఫర్లో భాగంగా రాయికల్ ఎస్సైగా అజయ్ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి మళ్లీ కష్టాలు మొదలయ్యాయి మా భూమిని వారు కావాలనే కబ్జా చేశారని అప్పటి రాయికల్ ఎస్సై అజయ్‌కు తెలిపారు. బాధితుడు బోయిని గంగారాం మీడియాకు సమాచారం ఇవ్వడంతో ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కాగా బాధితులు మీడియాతో మాట్లాడుతూ, స్థానిక జిల్లా ఎస్పీకి తమ గోడును విన్నవించుకున్నానని అప్పటికే ఇట్టి విషయం ఎస్పీ అశోక్ కుమార్‌కు తెలుసునని అశోక్ కుమార్ చెప్పడం గమనార్హం. ఉన్నత అధికారులు స్పందించి భూములను కబ్జా చేస్తున్న వారిపై తగిన చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని బాధితులు వెడుకుం టున్నారు. అండగా ఉండవలసిన కుల పెద్దలు తమని కుల బహిష్కరణ చేశారని, తమతో ఎవరై నా మాట్లాడితే జరిమానా విధిస్తామని చెప్పడం దారుణమని కన్నీటి పర్యంతం అయ్యారు. అధి కారులు, పోలీసు యంత్రాంగం స్పందించి తమ భూమినీ అక్రమించాలనీ చూస్తున్న వారిపై, కుల బహిష్కరణ చేసిన వారిపై కఠినమైన చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

## దైవభక్తితో మానసిక ప్రశాంతత

### మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి



**విశ్వంభర, పరిగి:** మండల పరిధిలోని రాఘవపూర్ గ్రామంలో శుక్రవారం హనుమాన్ దేవాల యంలో విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి హాజరయ్యారు. అనంతరం స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వ హించారు. ప్రతి ఒక్కరూ దైవభక్తిని పెంపొంది ంచుకో వాలని, దైవ భక్తితో మానసిక ప్రశాంతత ఏర్పడు తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అరవింద్ రావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ప్రవీణ్ కుమార్ రెడ్డి, మాజీ సర్పంచ్ జగన్, పీఏసీఎస్ డైరెక్టర్ హనుమంత్ రెడ్డి, నాయకులు రవి, లక్ష్మీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లను ఈవీఎంల గిడ్డంగికి తరలించాలి: కలెక్టర్ ప్రతీక్ జైన్



**విశ్వంభర, వికారాబాద్:** బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లను ఈవీఎంల గిడ్డంగికి తరలించాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు సూచించారు. శుక్రవారం మార్కెట్ యార్డులో చేవెళ్ల పార్లమెంటరీకి సంబంధించిన బ్యాలెట్,కంట్రోల్ యూనిట్లను భద్రపరిచిన స్ట్రాంగ్ రూంల సీళ్లను వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారుల సమక్షంలో తెరిచారు. వికారాబాద్, తాండూర్, పరిగి శాసనసభ నియోజకవర్గాల బ్యాలెట్, కంట్రోల్ యూనిట్‌లను జాగ్రత్తగా పట్టణ కేంద్రంలోని ఈవీ ఎంల జిల్లా గిడ్డంగికి తరలించి భద్రపరచాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. కలెక్టర్‌తో పాటుఅదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, ఆర్డీవోలు వాసుచంద్ర, శ్రీనివాసరావు, తహసిలా ద్రలు లక్ష్మీనారాయణ, తారాసింగ్, ఆనంద్ కుమార్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ నయామత్ అలీలు ఉన్నారు.

## ఆర్చ్ ప్రారంభించిన కార్పొరేటర్



**విశ్వంభర ,చైతన్యపురి:** చైతన్యపురి సాయినగర్ మెయిన్ రోడ్ ఐసిఐసిఐ బ్యాంకు పక్కన ఆంజనేయ సహిత శివాలయం యొక్క ముఖద్వారం( ఆర్చ్) ను చైతన్యపురి కార్పొరేటర్ రంగా నర్సింహా గుప్తా ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆలయ ముఖద్వారం ఏర్పాటు చాలా బృహత్తు కార్యక్రమం అని , ఆలయ అభివృద్ధి ఇలాగే కొనసాగాలని అని అన్నారు. భక్తులకు అన్ని మంచి జరగాలని , కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి ముఖద్వార ప్రారంభో త్సవ శుభాకాంక్షలు తెలిపినారు. ఈ కార్యక్రమంలో శివాలయం అధ్యక్షులు గోవర్ధన్ రెడ్డి , సెక్రట రీ సిద్దేశ్వర్ , కోశాధికారి అంజయ్య , రాంగోపాల్ , వినోద్ యాదవ్ , రుద్రారపు శంకర్ , భాగ్యశ్రీ రాంమోహన్ రవీందర్ రెడ్డి , వేణు చారీ , రమణ , శ్రీను , సాయిబాబా పాల్గొన్నారు.

## ఘనంగా పోచమ్మ బోనాలు



**విశ్వంభర, ఆమనగల్లు:** ప్రజలు రైతులు సుఖ సంతోషాలతో చల్లగా ఉండాలని డీసీసీబీ డైరెక్టర్ ఆమనగల్, కడ్తాల్ సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా కోరుకున్నారు. బోనాల ఉత్సవాల్లో భాగంగా ఆమనగల్ మున్సిపాలిటీ పరిధిలోని వివిధ కుల సంఘాలు గ్రామస్తులతో కలిసి పోచమ్మ బోనాల నిర్వహింయారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు యనమల రమేష్, మల్లయ్య, దేవేందర్, నరసింహ, దేవేష్, చెన్నకేశవులు, రాజు పాల్గొన్నారు.

## అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తాం



**విశ్వంభర, దోమ:** దోమ మండల కేంద్రంలో శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు స్థానిక ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లా డుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి నిరుపేద కుటుంబానికి 6 గ్యారంటీ పథకాలను పక్కాగా అమలు చేసి నెరవేరుస్తామన్నారు. త్వరలో కళ్యాణ లక్ష్మి చెక్కుతోపాటు తులం బంగారం ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధమవుతుందని తెలిపారు. కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ డబ్బులను వృథా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడల అధికారి హనుమంతరావు, తహసిల్దార్ పురుషోత్తం, ఎంపీడీవో మహేష్ బాబు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విజయ్ కుమార్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ డైరెక్టర్ యాదయ్య గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాఘవేందర్ రెడ్డి, రమేష్, రాములు నాయక్, ఆశన్న గౌడ్, మొగులయ్య, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## సీఐగా నవీన్ కుమార్ బాధ్యతలు



**విశ్వంభర, వికారాబాద్:** ఐజీపీ కార్యాలయం నుంచి బదిలీపై వచ్చి వికారాబాద్ జిల్లా పరిధిలోని మోమిన్పేట్ సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా కే నవీన్ కుమార్ బాధ్యతలు తీసుకున్నారు. శుక్రవారం మోమిన్ పెట్ సీఐగా బాధ్యతలు తీసుకున్న నవీన్ కుమార్ జిల్లా ఎస్పీ కే నారాయణరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్పీకి సీఐ పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం సీఐ మాట్లాడుతూ శాంతి భద్రతలను కాపాడడానికి శాయశక్తుల కృషి చేస్తానని అన్నారు.

## పేకాట స్థావరాలపై దాడి

**విశ్వంభర, భూపాలపల్లి:** భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం సూరారం గ్రామంలో కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నారని మండల పోలీసులకు సమాచారం వచ్చింది. మహా దేవపూర్ ఎస్ఐ సూరారం గ్రామం ఎస్సీ కాలనీలో కలపుల్యాల మల్లయ్య ఇంట్లో తనిఖీ చేయగా 9 మంది పేకాట ఆడుతూ కనిపించారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని 1610/- రూపాయలు, పేక ముక్కలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.

## పదవి విరమణ వయస్సుకే కానీ సేవకు కాదు



**విశ్వంభర, మలక్ పేట:** ప్రభుత్వ ఉద్యోగికి పదవి విరమణ అనేది వయస్సు కే కానీ వారు చేసే పనికి కాదని డిప్యూటీ డిఇఓ రాధాకృష్ణ, నెహ్రూ బాబులు అన్నారు. కాలా డేరా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో హృదయమేరి పదవి విరమణ కార్యక్రమంకు వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ తన 23 సంవత్సరాల సర్వీస్ లో పేద విద్యార్థులకు ఎంతో విద్యను బుద్ధిని నేర్పించిందని పిల్లల అభివృద్ధికి ఎంతో తోడ్పడిందని తెలియజేశారు. విద్యార్థు లు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. డిప్యూటీ ఐఓఎస్ వరప్రసాద్ రెడ్డి, స్థానిక ప్రధానోపాధ్యాయులు ఆంజనేశ్వర్, ప్రధానో పాధ్యాయులు మందడి వెంకటరెడ్డి, వివిధ పాఠశాల లోని ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## దుష్ప్రచారాలు చేస్తే ఊరుకోం



**విశ్వంభర, హైద్రాబాద్:** తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు మహాసభ ఆధ్వర్యంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసారు. తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు మహాసభను కొందరు వ్యక్తులు సోషల్ మీడియా వేదికగా చేస్తున్న కొన్ని బోగస్ ప్రచారాలను ఖండించారు. ఈ సందర్భంగా ప్రెసిడెంట్ మనికొండ వేంకటేశ్వర రావు మాట్లాడుతూ గతంలో మున్నూరు కాపు మహాసభ కు ప్రెసిడెంట్ గా పని చేసిన పిల్లి శ్రీనివాసా రావు అనే వ్యక్తి ప్రస్తుత మున్నూరుకాపు మహాసభ కమిటీపై సోషల్ మీడియా వేదికగా మహాసభ ఎన్నికలపై బురద చల్లడం , దుష్ప్రచారాలు చేయడం , మహాసభను తప్పుదోవ పట్టించే విధంగా కుట్రలు పన్నుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేసారు. ఇలాంటి వ్యాఖ్యల పట్ల ప్రస్తుత మహాసభ సభ్యులు మండి పడ్డారు. చివరగా సత్యమే గెలిచిందని అన్నారు. గతంలో మహాసభ పై కేసులు వేయడం తో ఎట్టకేలకు మహాసభనే గెలిచిందని ప్రెసిడెంట్ మనికొండ వేంకటేశ్వర రావు తెలిపారు. ఇలాంటి మాటలు మరోసారి పిల్లి శ్రీనివాసా రావు మాట్లాడితే చట్ట పరమైన చర్యలకు బాధ్యులు అవుతారని హెచ్చరించారు. అవాస్తవాలను ప్రచారం చేస్తే ఊరుకునే ప్రసక్తే లేదని, దమ్ముంటే ఎదురుగ వచ్చి తేల్చుకోవాలని ప్రెసిడెంట్ మనికొండ వేంకటేశ్వర రావు సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ మనికొండ రమేష్, ట్రెజరర్ హనుమంత్ రావు, జితేందర్, కొంతం సురేష్ , జొన్నవాడ శ్రీకా ంత్, కొరివి వేణుగోపాల్, మాడి గల వెంకటేశ్వర్లు, గట్టిరి సత్యనారాయణ, మహాసభ మహిళా ఆర్గనైజింగ్ సెక్రటరీ కొత్త కల్పన తదితరులు పాల్గొన్నారు.

## వినియోగదారుల ఆదరణ చూరగొనాలి:

### ఎమ్మెల్యే సబిత ఇంద్రారెడ్డి




**విశ్వంభర, ఎల్బీనగర్:** నాణ్యమైన వస్తువులను అతి తక్కువ ధరలకే వినియోగదారులకు అందిస్తే మంచి ఆదరణ పొందవచ్చు అని మహేశ్వరం శాసన సభ్యురాలు పటోళ్ల సబితా ఇంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం కొత్తపేటలోని ఎస్ ఎస్ వి ఐ పి ఫర్నిచర్ షాపును ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ తీవ్రమైన పోటీ ఉన్న వ్యాపారంలో ఎల్లకాలం నిలదుకోవాలంటే వినియోగదారుల కు సమయానికి నాణ్యంగా అతి తక్కువ ధరలకే ఇంటి వద్దకే చేరిస్తే మంచి ఫలితాలు ఉంటాయని అన్నారు. అనంతరం నిర్వాహకులు షేక్ అహత్ అండ్ బ్రదర్స్ మాట్లాడుతూ తమ ఫర్నిచర్ షాపులో అన్ని రకాల సోఫా సెట్లు, దివాన్ లు, కార్యాలయాలకు కావలసిన అన్ని రకాల వస్తువులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్తా, మహేశ్వరం నియోజకవర్గం బి అర్ ఎస్ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ , నియోజకవర్గ మాజీ యూత్ వింగ్ ప్రెసిడెంట్ కొండల్ రెడ్డి, మాజీ గడ్డి అన్నారం చైర్మన్ రామ్ నర్సింహ గౌడ్, సాజిద్, శ్యాం గుప్తా, శ్రీమన్నారాయణ, జగిని రమేష్ , పెంబర్తి శ్రీనివాస్, రుషి ,రమేష్ కురుమ, వాజిద్ పటేల్, బాలరాజు గుప్తా, దీపక్ తదితరులు పాల్గొన్నారు.



**విశ్వంభర, ఎల్బీనగర్:** శ్రావణమాసం నాలుగో శుక్రవారం సందర్భంగా ఆర్కే పురం డివిజన్ అష్టలక్ష్మి దేవాలయంలో అమ్మవారికి తామర పుష్పాలతో అర్చన, సాయంత్రం అష్టలక్ష్మి వ్రత ములు నిర్వహించబడ్డాయి. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

## కోటగుళ్ళ ఆలయంలో శ్రావణ మాస పూజలు



**విశ్వంభర, భూపాలపల్లి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండల కేంద్రంలోని కాకతీయుల కళాక్షేత్రం శ్రీ భవాని సహిత కోటగుళ్ల ఆలయంలో శ్రావణమాసం చివరి శుక్రవారం సందర్భంగా అర్ధనారీశ్వరి రూపంలో స్వామి వారిని వివిధ రకాల పూలు పండ్లతో అలంకరించి ఆలయ ప్రాంగణంలో గోమాతలకు పూజలు నిర్వహించి భక్తులు ఆశీస్సులు పొందారు.

## జోనల్ లెవెల్ కబడ్డీ టోర్నమెంట్

**విశ్వంభర, నాగోల్**: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మేడ్చల్- మల్కాజిగిరి జిల్లాలోనీ ఉప్పల్ జోనల్ లెవల్ అండర్ 14, అండర్ 17 స్థాయి కబడ్డీ టోర్నమెంట్ శనివారం ఆగస్టు 31 న నాగోల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో నిర్వహిస్తున్నట్లు పాఠశాల హెడ్మాస్టర్ లక్ష్మీదేవి, ఫిజికల్ డైరెక్టర్ శంకర్ నాయక్ తెలిపారు. శనివారం ఉదయం జరిగే కబడ్డీ టోర్నమెంట్ ప్రారంభోత్సవంలో  అతిథులుగా మేడ్చల్ డీఈఓ విజయ కుమారి , హయ త్ నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ తిప్పర్తి యాదయ్య, ఉప్పల్ ఎంఈఓ రామా రావు, నాగోల్ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్,తెలంగాణ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ మాజీ ఛైర్మెన్ ఉప్పల శ్రీనివాస్ గుప్త, నాగోల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం  అధ్యక్షుడు కందికంటి కన్నా గౌడ్, జనరల్ సెక్రటరీ మేకల సత్యనారాయణ హాజరవుతున్నట్లు తెలిపారు.

## రుణమాఫీపై అపోహలు వద్దు
### అధికారులు రైతుల సమస్యలు పరిష్కరించాలి



**విశ్వంభర, నాగర్ కర్నూల్:** నాగర్ కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండల కేంద్రంలో రుణమాఫీపై రైతులు అపోహలు పెట్టుకోవద్దని, అధికారులు రైతుల సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని తిమ్మాజీపేట మండలం ఇప్పలపల్లి గ్రామంలో రైతు వేదికను ఎమ్మెల్యే సందర్శించి ఏఈఓతో రుణమాఫీపై చర్చించారు.  అర్హులై రుణమాఫీ కానీ వారి లిస్టును అందించాలని చిన్న చిన్న పొరపాట్లు ఉంటే వెంటనే వాటిని సరిచేసి రైతులకు న్యాయం జరిగే విధంగా చూడాలని అధికారులను ఆదేశించారు. రాజకీయ లబ్ధి కోసమే విపక్షాలు రైతు రుణమాఫీపై విమర్శలు చేస్తున్నారని, ప్రభుత్వం ఇచ్చిన గ్యారెంటీలను ప్రణాళికా బద్ధంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. లబ్ధిదారులు ఎవరు ఆందోళన చెందవలసిన అవసరం లేదన్నారు. ప్రతి రైతుకు న్యాయం చేయడమే తన లక్ష్యమని అన్నారు.

## పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత



**విశ్వంభర, జగదేవపూర్:** సీజనల్ వ్యాధులను దృష్టిలో పెట్టుకొని శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా మండలపరిధిలోని అలిరాజపేట్ గ్రామ పంచాయతిలో ప్రజలకు వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతపై, దోమల వల్ల వచ్చే వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని, ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, మురుగునీటి గుంటలు లేకుండా జాగ్రత్త తీసుకోవాలని దోమల వల్ల సీజనల్ వ్యాధులు ప్రాణహాని సంభవించునని తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎలాంటి ఆరోగ్య సమస్యలు వచ్చినా.. వెంటనే గుర్తించి  డాక్టర్లను సంప్రదించాలని సూచించారు. పీహెచ్‌సీ హెల్త్ అసిస్టెంట్ సురేష్ కుమార్, గ్రామ పంచాయతి ఈ ఓ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

## మెటీరియల్ అందజేత



**విశ్వంభర, కల్వకుర్తి:** కల్వకుర్తి మండలం తర్నికల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ చెన్ రెడ్డి, పవన్ కుమార్ రెడ్డి 1,50,000 రూపాయలను పాఠశాలలో స్పోర్ట్స్, సైన్స్ విభాగాలకు సంబంధించిన మెటీరియల్ శుక్రవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ధర్మేందర్ రావు, ఉపాధ్యాయులకు అందజేశారు. పవన్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి  కృషి చేశానని అన్నారు. ఉపాధ్యాయులు శ్రీనివాసులు, హరిత, బాలరాజు, ప్రదీప్, బాలరాజు, జీ.శ్రీనివాసులు, రంజిత్ రెడ్డి, యూసుఫ్, మహేష్  పాల్గొన్నారు.

# పటిష్ఠ రక్షణ చర్యలు చేపట్టాలి: కలెక్టర్ రాహుల్ శర్మ



**విశ్వంభర, భూపాలపల్లి:** శుక్రవారం భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలంలో కలెక్టర్ రాహుల్ శర్మ విస్తృతంగా పర్యటించారు. మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, ప్రభుత్వ పాఠశాలల సముదాయాన్ని పరిశీలించారు. తహసిల్దార్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించి అటవీ, రెవెన్యూ, భూముల వివరాల నివేదిక అందించాలని ఆదేశించారు. పెండింగ్  ఉన్న అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను పూర్తి చేయాలని, పూర్తి అయిన పనులకు నిధులు మంజూరు చేయాలని అన్నారు. మండల కేంద్రంలో నూతన తహసిల్దార్ కార్యాలయ భవన నిర్మాణంలో తీవ్ర జాప్యం జరుగుతోందని, తక్షణమే కాంట్రాక్టర్‌ను తొలగించి మరొక కాంట్రాక్టర్‌కు నిర్మాణ బాధ్యతలు అప్పగించి త్వరగా అందుబాటులోకి తేవాలని పీఆర్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. నిరుపయోగంగా ఉన్న మాడా భవన మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తేవాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి సేవల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని విష జ్వరాల బారిన పడిన వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ప్రతి మంగళ, శుక్రవారాల్లో ప్రతి కుటుంబం తప్పక డ్రై డే పాటించి దోమలు వ్యాప్తి జరుగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆసుపత్రి వెనుక వైపు ప్రహరీ గోడ లేకపోవడంతో  జంతువులు ఆసుపత్రిలో సంచరిస్తున్నాయని తెలుపగా.. ప్రహరీ గోడ నిర్మాణాన్ని వెంటనే ప్రతిపాదనలు అందచేయాలని పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలల సముదాయాన్ని పరిశీలించి నూతన మరుగుదొడ్లు నిర్మించి, గదులకు మరమ్మతులు చేయాలని అధికారులను ఆదేశించారు. బాలికల పాఠశాలలో ముఖ కదలికల ద్వారా మాటాడగలిగే విద్యార్థుల నైపుణ్యతను పరీక్షించి విద్యార్థులను, ఉపాధ్యాయులను అభినందించారు. పంచాయతి రాజ్ ఈ ఈ దిలీప్, ఎంపీడీఓ వెంకటేశ్వర రావు, తహసీల్దార్‌పాల్గొన్నారు.

## రుణమాఫీ కాని రైతుల వివరాల సేకరణ
### మండల వ్యవసాయ అధికారి కృష్ణ

**విశ్వంభర, పెద్ద శంకరంపేట:** పెద్ద శంకరంపేట మండలంలో రుణమాఫీ కానీ రైతుల కుటుంబ వివరాల నిర్ధారణ సేకరణ శుక్రవారం నిర్వహించినట్లు మండల వ్యవసాయ అధికారి నాగం కృష్ణ తెలిపారు. రుణమాఫీ కానీ రైతుల ఇంటికి వెళ్లి రైతు కుటుంబ సభ్యుల వివరాలు, సంబంధించిన ధ్రువీకరణ పత్రం పూర్తి చేసినట్లు తెలిపారు. రైతులతో పాటు అధికారులతో కూడిన ఫోటోను వ్యవసాయ శాఖకు సంబంధించిన యాప్‌లో పొందుపరచడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ విస్తీర్ణ అధికారి వినీత్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి
### పేట మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్



**విశ్వంభర, పెద్ద శంకరంపేట:** పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతీఒక్కరు కృషి చేయాలని పెద్ద శంకరంపేట మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ప్రకృతి వందన్ కార్యక్రమంలో భాగంగా పెద్ద శంకరంపేటలోని సరస్వతి శిశు మందిర్లో 100 సంవత్సరాలకు పైబడిన రావి చెట్టుకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పర్యావరణాన్ని రక్షించుకుంటేనే రాబోయే రోజుల్లో మనుగఢ సాధ్యమ వుతుందన్నారు. నీటిని పొదుపుగా వాడాలని. మొక్కలను నాటడంతో పాటు సంరక్షించుకోవాలని, వీలైనంతవరకు వాడకంలో ప్లాస్టిక్‌ను నియంత్రించుకోవాలని పేర్కొన్నారు. ప్రకృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అనంతరం సంస్కార్ విద్యాలయంలో విద్యార్థులు, ఉపాధ్యాయ సిబ్బంది మొక్కలు నాటి వృక్షాలకు రాఖీలు కట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ సర్పంచ్ అలుగుల సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ సుభాష్ గౌడ్, జిల్లా పర్యావరణ ప్రముఖ రవివర్మ, ప్రధానా చార్యులు వీరప్ప, ఆర్ఎస్ఎస్ బాధ్యులు జైహింద్ రెడ్డి, సీతారామారావు, సతీష్ గౌడ్, శైలేష్, శ్రావణ్ కుమార్, శ్రీనివాస్, ఆచార్య బృందం, సంస్కార్ విద్యాలయం, శిశు మందిర్ విద్యార్థులు పాల్గొన్నారు.

## పీర్జాదిగూడ మేయర్‌గా అమర్ సింగ్



**విశ్వంభర, మేడిపల్లి:** పిర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్లో అవిశ్వాస తీర్మానం నెగ్గింది. పిర్జాదిగూడ అవిశ్వాసంలో నూతన మేయర్‌గా 21మంది కార్పొరేటర్లు అమర్ సింగ్‌కు మద్దతు పలుకుతూ మేయర్‌గా  ఎన్నుకోన్నారు. శుక్రవారం మేయర్‌గా పిజ్జాదిగూడ మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్, టీపీసీసీ ఉపాధ్యక్షులు వజ్రేష్ యాదవ్, రాష్ట్ర నాయకులు హరి వర్ధన్ రెడ్డి, మలిపెద్ది సుధీర్ రెడ్డిల ఆధ్వర్యంలో ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ అజయ్ యాదవ్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు దానగల్ల యాదగిరి కార్పొరేటర్స్ పాల్గొని నూతన మేయర్‌ను, డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్‌ను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిర్జాదిగూడ కార్పోరేటర్లు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## సింహ గర్జన కరపత్రం ఆవిష్కరణ



**విశ్వంభర చివ్వేంల:** సేవాలాల్ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు భూక్య సంజీవ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న సేవాలాల్ సేన పదవ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గిరిజనుల రిజర్వేషన్లు రక్షించాలని సెప్టెంబర్ తొమ్మిదో తారీఖున హైదరాబాద్, ఇందిరా పార్కు వద్ద నిర్వహించనున్న గిరిజన సింహ గర్జన కరపత్రాన్ని సేవలాల్ సేన రాష్ట్రకో కన్వీనర్ ధరావత్ రాజేష్ నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్య నాగు నాయక్ ఆధ్వర్యంలో చివ్వెంల మండల కేంద్రంలో ఆవిష్కరించారు.  గిరిజనులకు 12 శాతం రిజర్వేషన్ పెంచాలని కాంగ్రెస్ తన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సేవాలాల్ సేన సీనియర్ నాయకులుమాజీ సర్పంచ్ బద్రు నాయక్, ధరావత్ శివరాం నాయక్, భూక్య వెంకన్న నాయక్, సేవ్య నాయక్, రాజశేఖర్ నాయక్, హరీష్ నాయక్, రవి నాయక్, రాజేష్ నాయక్, దేవేందర్ నాయక్, పవన్ నాయక్, మహేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన బస్సు సర్వీసులు ప్రారంభం



**విశ్వంభర, సంగారెడ్డి:** సంగారెడ్డి జిల్లా అమీన్పూర్ మండలం పటేల్ గూడ బీఎచ్ఈఎల్ మెట్రో కాలనీ నుంచి మెహిదీపట్నం వరకు 216%వీ/ాి% రెండు నూతన బస్సు సర్వీసులను శుక్రవారం పటాన్ చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి కాట శ్రీనివాస్ గౌడ్ ప్రారంభించారు. పటేల్ గూడ బీఎచ్ఈఎల్ మెట్రో కాలనీ-మెహిదీపట్నంకు ఏర్పాటు చేసిన రెండు బస్సులో ప్రయాణించి తొలి టికెట్ తీసుకున్నారు. ఈ బస్సు పటేల్ గుడా బీహెచ్ఈఎల్ మెట్రో కాలనీ నుంచి బయలుదేరి బీరంగూడ, లింగంపల్లి, అల్విన్ క్రాస్ రోడ్స్, కొండాపూర్, హైటెక్ సిటీ, రాయదుర్గం మెట్రో స్టేషన్, టోలిచౌకి మీదుగా మెహిదీపట్నం వెళ్తుందని నియోజకవర్గ ప్రజలకు ఉపయోగపడుతుందని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, పలు గ్రామాల  సర్పంచులు, పెద్దలు పాల్గొన్నారు.

## జ్యోతిర్లింగాల దేవాలయంలో ప్రత్యేక పూజలు



**విశ్వంభర, పెద్ద శంకరంపేట:** పెద్ద శంకరంపేట పట్టణ శివారులోని జ్యోతిర్లింగాల దేవాలయంలో శ్రావణమాసం చివరి శుక్రవారం పురస్కరించుకొని గ్రామానికి చెందిన దాదిగారి గంగాధర్ కుటుంబ సభ్యులు లక్ష బిల్వార్చన, నవధాన్యాలతో  ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి రాజ్ కుమార్, మాజీ  వైస్ ఎంపీపీ లక్ష్మి రమేష్, నాయకులు వేణుగోపాల్ గౌడ్, సుభాష్ గౌడ్, దాదిగారి గంగాధర్, నరేష్, కొత్త ప్రభలు పాల్గొన్నారు.

## గణేష్ నవరాత్రులను ప్రశాంతంగా జరుపుకోవాలి



**విశ్వంభర, చంద్రాయన్‌గుట్ట:** నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాసరెడ్డి ఆదేశాల మేరకు చంద్రాయన్‌గుట్ట నియోజకవర్గంలోని చత్రినాకలో సౌత్ జోన్ డీసీపీ స్నేహ మెహ్రా ఆధ్వర్యంలో ప్రభుత్వ అన్ని శాఖల అధికారులతో పాటు సౌత్ జోన్ వినాయక మండపాల నిర్వాహకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సౌత్ జోన్ డిసిపి స్నేహమెహ్రా మాట్లాడుతూ గణేష్ నవ రాత్రులను ప్రశాంతంగా జరుపుకోవాలని, మండపాల నిర్వాహకులు పోలీసుల సూచనలు, సల హాలను తప్పకుండా పాటించాలన్నారు. అధికారుల సమన్వయంతో ఉత్సవాలు శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలన్నారు. మండపాల వద్ద ఎల్లవేళలా ఇద్దరు వాలంటరీలు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

## మెడికల్ షాప్‌ని ప్రారంభించిన ఎమ్మెల్యే గండ్ర



**విశ్వంభర, భూపాలపల్లి:** భూపాలపల్లి నియోజకవర్గ పరిధి రేగొండ మండల కేంద్రంలో యజమాని బండారి శ్రీనివాస్ ఆహ్వానం మేరకు లక్ష్మి వినాయక మెడికల్ షాప్ ప్రారంభో త్సవానికి ముఖ్యఅతిథిగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గుటోజు కిష్టయ్య, మండల అధ్యక్షులు ఇప్పకాయల నరసయ్య, నాయకులు మైస భిక్షపతి, మేకల భిక్షపతి, కటకం సంపత్, కొలెపాక సాంబయ్య, ఏనుగు రవీందర్ రెడ్డి, బండి మల్లయ్య తదితరులు ఉన్నారు.

## కోలాట కళాకారుల సమస్యలను పరిష్కరించాలి

### ప్రజానాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్క వెంకటేశ్వర్లు



**విశ్వంభర,ఆత్మకూరు(ఎం):** కోలాట కళాకారుల పెండింగ్ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తెలంగాణ ప్రజానాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్క వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రవీంద్రభారతిలో కోలాట కళాకారులకు అందజేసిన ప్రశంసా పత్రాలను మండల కేంద్రంలో శుక్రవారం కళాకారులకు అందజేసి మాట్లాడుతూ.. కోలాట కళా కారులకు దేవాలయాల్లో కళా ప్రదర్శనకు అవకాశం ఇవ్వాలని, తెలంగాణలోని పుణ్యక్షేత్రమైన యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలలో కోలాట కళాకారులచే ప్రదర్శించే అవకాశాలు కల్పించాలని, కళాకారులకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను కేటాయించాలని కోరారు. కోలాట మహిళలకు వడ్డీ లేని రుణాలను అందజేయాలని, మండలంలోని కళాకారులకు వ్యవ సాయ భూమిని,నివాస గృహాలను కట్టించాలని కోరారు. వృద్ధాప్యంలో ఉన్న కళాకారులకు 1500 నుండి 3000 వరకు పెన్షన్ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఎన్నికల ముందు కళాకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కళాకారులకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని కోరారు. దుప్పెలి సరిత అధ్యక్షతన వీరమని, రేణుక,రాజమణి, లక్ష్మి, శ్రావణి, లక్ష్మి,కిష్టమ్మ, రేణుక, రామ నర్సమ్మ, మనెమ్మ తదితరులు పాల్గొన్నారు.

## పేద పిల్లలకు ఆర్థిక సాయం



**విశ్వంభర, రామన్నపేట:** తెలి, మలి ఉద్యమ నేత, ప్రజా సేవకుడు, బీఆర్ఎస్ మాజీ రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యులు డాక్టర్ చెరుకు సుధాకర్ 64వ జన్మదినం సందర్భంగా తెలంగాణ ఉద్యమ నేత, బీఆర్ఎస్ మాజీ జిల్లా ఉపాధ్యక్షుడు, సామాజిక కార్యకర్త ఎస్.కె చాంద్ రామన్నపేట పట్టణములోని సీపీఎస్ (బాలుర ప్రాథమిక పాఠశాల) పేద పిల్లలకు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏం సైదులు, డీ నరసింహ, సురేష్, స్నేహలత పాల్గొన్నారు.

## బోనాల ఉత్సవ కమిటీకి అభినందనలు

**విశ్వంభర, కద్లాల్:** కద్లాల్ గ్రామపంచాయతీ పరిధిలో శ్రీ పోచమ్మ అమ్మవారి దేవాలయం దగ్గర మాజీ సర్పంచ్ గూడూరు లక్ష్మీ నరసింహ్మ రెడ్డి దేవాలయ ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్తులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో నాలుగు రోజులపాటు జరిగిన బోనాల పండుగ సందర్భంగా పారిశుధ్య నిర్వహణలో ప్రతినిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ విధులు నిర్వహించిన గ్రామపంచాయతీ సిబ్బందికి, వివిధ శాఖల అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆనంద్, ఉత్సవ కమిటీ చైర్మన్ సత్యం సభ్యులు చెగురి రాములు, మాలె మల్లేష్ గౌడ్, పాలారి ఆంజనేయులు, హనుమా నాయక్, మూద బాలయ్య, నరేందర్ రెడ్డి, గుద్దేటి వెంకటేష్, లాయక్ అలీ తదితరులు పాల్గొన్నారు.

# రివర్స్ పాలిటిక్స్ నడుస్తున్నాయి

సమస్యలపై చర్చించేందుకు అసెంబ్లీ పెట్టు అని ప్రతిపక్షం అడగాలి..

సిఎం రేవంత్ సభ పెట్టి కేసీఆర్‌నీ అసెంబ్లీకి రా అని పిలిచే పరిస్థితి వచ్చింది.

రాహుల్ గాంధీ గురించి మాట్లాడే స్థాయి నీది కాదు హరీష్ ..

ఇంకోసారి మాట్లాడితే నా భాషలో సమాధానం ఇస్తా

కేసీఆర్, హరీష్ రావుల పై టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఫైర్



**విశ్వంభర, హైదరాబాద్:** బిఆర్ఎస్ పాలనలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఫామ్‌హౌజ్‌కే పరిమితమయ్యారని పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి విమర్శించారు. ప్రగతి భవన్‌లోకి ఎవరినీ రానివ్వకుండా సెక్రటేరియట్ ఆయన వెళ్లకుండా బాధ్యతారహితంగా వ్యవహరించారని మండిపడ్డారు. గాంధీ భవన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశం లో ఆయన మీడియాతో మాట్లాడుతూ గత పది సంవత్సరాల నుంచి రైతులను పట్టించుకోని కెసిఆర్, ఇప్పుడు ప్రజాక్షేత్రంలోనికి వస్తున్నాడని అనడం ఏంటని మండిపడ్డారు. బిఆర్ఎస్ పాలనలో రైతుల తరపున పోరాటం చేసింది కాంగ్రెస్ పార్టీ అని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే సచివాలయంలో సిఎం రేవంత్ రెడ్డి, మంత్రులు సమీక్షలు జరుపుతున్నారని ప్రశంసించారు. ప్రతిపక్ష హెూదాలో మాజీ సిఎం కెసిఆర్ సభకు రావాలని రేవంత్ రెడ్డి ఆహ్వానించారని, కానీ ఒక్కసారి మాత్రమే వచ్చారని, ఆయనకు ప్రజలపై ఎంత ప్రేమ ఉందో అర్థం అవుతుందని జగ్గారెడ్డి ధ్వజమెత్తారు. ప్రతిపక్ష నాయకుడి హెూదాలో ప్రజల నుంచి వచ్చే సలహాలు, సూచనలు ఇవ్వాలని పాలక పక్షం కోరినా కూడా పట్టించుకోలేదన్నారు. కెసిఆర్ మళ్లీ ప్రజాక్షేత్రంలోకి వస్తున్నారని బిఆర్ఎస్ నేతలు స్టేట్‌మెంట్లు ఇవ్వడం హాస్యాస్పదంగా ఉందని జగ్గారెడ్డి చురకలంటించారు. తెలంగాణలో రివర్స్ పాలిటిక్స్ నడుస్తున్నాయని జగ్గారెడ్డి పేర్కొన్నారు. బయట విలేకరుల సమావేశంలో మాట్లాడే కేసీఆర్ సభలోకి వచ్చి రుణమాఫీ గురించి మాట్లాడొచ్చు కదా? అని ప్రశ్నించారు. అసెంబ్లీ సమస్యలపై మాట్లాడాలని ప్రతిపక్ష నాయకుడు అడగాలి, కానీ, సిఎం అసెంబ్లీ పెట్టి ప్రతిపక్ష నాయకుడిని సభకు రావాలని పిలిచే పరిస్థితి వచ్చిందన్నారు. సిఎంగా ఉన్నప్పుడు కేసీఆర్ సచివాలయం రాలేదన్నారు. ప్రతిపక్ష నాయకుడిగా అసెంబ్లీకి రావడం లేదని జగ్గారెడ్డి ప్రశ్నించారు. నాయకులకు అపాయిం ట్‌మెంట్ ఇవ్వలేని పరిస్థితి అని, ఇప్పుడు ఆపరిస్థితి లేదన్నారు. హరీష్ రావు కు లెక్కలే రావని, ఫైనాన్స్ మినిస్టర్ ఎలా అయ్యాడో అని జగ్గారెడ్డి ప్రశ్నించారు. మేనమామ చెప్పింది రాయడమే హరీష్ రావు పని అని అన్నారు. రాహుల్ గాంధీ ని కొడంగల్ రా.. అని ప్రశ్నించే స్థాయి హరీష్ రావుది కాదన్నారు. సిద్దిపేటలో రైతులు లేరా అని ప్రశ్నించారు. మా స్టేట్ లీడర్స్ కొండద రెడ్డి, అన్వేష్ రెడ్డి లను సిద్దిపేట పంపిస్తాం ఏం చెప్పాలనుకుంటావో చెప్పుకో అని అన్నారు.రాహుల్ గాంధీ గురించి మళ్ళీ మాట్లాడితే నా భాషలో సమాధానం ఇస్తానని జగ్గారెడ్డి హెచ్చరించారు. ఇక రుణమాఫీపై తాము ఇచ్చిన మాట ప్రకారం 9 నెలల్లో చేశామన్నారు. రుణమాఫీ కోసం రూ.12 వేల కోట్లు నిధులు రెడీగా ఉన్నాయన్నారు. రైతులకు మేలు చేసేందుకు ప్రభుత్వం ఇంటింటి సర్వే చేస్తుందని సెప్టెంబర్ నెలాఖరు వరకు అందరికీ రుణ మాఫీ అయిపోతుందని జగ్గారెడ్డి పేర్కొన్నారు.

## ధన్యవాదములు తెలిపిన రాంపూర్ గ్రామస్తులు



**విశ్వంభర, వికారాబాద్:** వికారాబాద్ నియోజకవర్గంలోని మర్పల్లి మండలం రాంపూర్ గ్రామం ఇంతకు ముందు ఘనపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్నప్పుడు ఆ గ్రామాన్ని ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చెయ్యాలని అసెంబ్లీలో గళం వినిపించి నూతన గ్రామ పంచాయతీగా ఏర్పాటు చెయ్యటానికి కృషి చేసిన వికారాబాద్ జిల్లా బీఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్‌కు అందుకు సహకరించిన తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్, బీఆర్ ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌లకు శుక్రవారం మాజీ ఎమ్మెల్యే ఆనంద్‌ని కలిసిన మర్పల్లి గ్రామస్తులు ధన్యవాధాలు తెలియజేసారు. బీఆర్ఎస్ పార్టీ మర్పల్లి మండల అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, వైస్ ఎంపీపీ మోహన్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి మధు, బీఆర్ఎస్ పార్టీ ధరూర్ మండల అధ్యక్షుడు పట్లోళ్ల శ్రీకాంత్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

## నీటిపారుదల శాఖ పనులపై సమీక్షా సమావేశం




**విశ్వంభర, రామన్నపేట:** భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి నీటిపారుదల శాఖ పనులపై సమీక్ష సమావేశం కార్యక్రమంలో పాల్గొన్న గౌరవ తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి వర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి లతో కలిసి పాల్గొన నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం. ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మె ల్యే బీర్ల ఐలయ్య, భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, జిల్లా కలెక్టర్ హనుమంత్, అధికారులు, ఆయ నియెజకవర్గ పరిధిలోని రైతులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీరేశం మాట్లాడుతూ నకిరేకల్ నియోజకవర్గ పరిధిలోని బ్రహ్మణవెల్లంల ప్రాజెక్టు, పిల్లాయిపల్లి, ధర్మారెడ్డి, అయిటిపాముల లిఫ్ట్ ఇరిగేషన్ తదితర ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తిచేయాలని గౌరవ మంత్రులను కోరారు.

## మురుగునీరు రాకుండా తగుచర్యలు తీసుకోవాలి



**విశ్వంభర, వికారాబాద్:** శివసాగర్ ప్రాజెక్టులోకి మురుగునీరు రాకుండా తగు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం వికారాబాద్ మునిసిపల్ పరిధిలోని శివ సాగర్ ప్రాజెక్ట్ అనుసంధాన కాలువను, మార్కెట్ యార్డులో నిర్మిస్తున్న సమీకృత మార్కెటు దుకాణాల సముదాయాన్ని మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల రమేష్, కమిషనర్ జాకీర్ అహమ్మద్, సంబంధిత అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులతో మాట్లాడుతూ.. ప్రజల నిత్య అవసరాలకు వికారాబాద్ మునిసిపాలిటీకి తాగు నీటిని అందించే శివ సాగర్ ప్రాజెక్టులోకి మురుగు నీరు చేరి కలుషితం కాకుండా తగు చర్యలు చేపట్టాలన్నారు. భావితరాలకు ఎంతగానో ఉపయోగపడే ఇట్టి ప్రాజెక్టును కాపాడుకోవాల్సిన బాధ్యత ఎంతైనా అవసరమని ఆయన అన్నారు. పూడూరు మండల పరిధిలోని కొన్ని ప్రాంతాల్లోని గ్రామాల నుండి వచ్చే మురుగు నీరు ప్రాజెక్టు లోకి రావడం వల్ల జరిగే ప్రమాదాన్ని గుర్తించిన కలెక్టర్ మురుగు నీటిని కాలువల ద్వారా మళ్లించేందుకు చేపట్టాల్సిన పనులకు ప్రతిపాదనలు సమర్పించాలని కలెక్టర్ నీటిపారుదల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సుందర్ ను కలెక్టర్ ఆదేశించారు. ప్రాజెక్టులో పేరుకుపోయిన ప్లాస్టిక్, చెత్తాచెదారాన్ని తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని కమిషనర్ కు సూచించారు. మార్కెట్ యార్డులో నిర్మిస్తున్న సమీకృత మార్కెటును సందర్శించిన కలెక్టర్ సుదీర్ఘకాలంగా పెండింగ్ లో ఉన్న పనులను త్వరితగతిన చేపట్టి చిరు వ్యాపారులకు అందుబాటులోకి తీసుకురావాలని కలెక్టర్ తెలిపారు.

## రియల్‌మీ 13 సిరీస్ 5జీ విడుదల




**విశ్వంభర, బషీర్ బాగ్:** రియల్ మీ 13 ప్లస్ 5 జి అత్యధిక పనితీరుని అందించే మెడియా టెక్ డిమెన్సిటీ 7300 శక్తి కలిగిన 5జీ చిప్సెట్‌తో వస్తుందని రియల్ మీ ప్రకటించింది. అది 26 జిబి డైనమిక్ ఆర్ ఏ ఎం తో వస్తుందని పేర్కొంది. ఈ స్మార్ట్ ఫోన్ జి టి మోడ్ తో వస్తుందని, అది 90 ఎఫ్ పి ఎస్ వద్ద మెరుగైన గేమింగ్ అనుభవాన్ని అందిస్తుందని పేర్కొంది. 80డబ్ల్యూ ఆల్ట్రా చార్జ్, స్టెయిన్ లెస్ స్టీల్ వేపర్ కూలింగ్ మిషన్ తో వస్తాయని, ఇది 50 ఎం పి సోనీ ఎల్ వి టి- 600 కెమెరాని కలిగి ఉంటుందని వెల్లడించింది. మెరుగైన ఏ ఐ ఫీచర్స్ ని కలిగి ఉంటుందని, రియల్ మీ 13ప్లస్ 5జి లో 7.6 ఎంఎం ల చాలా సన్నగా ఉంటుందని, అది డెజలింగ్ విక్టరీ స్పీడ్ డిజైన్ తో వస్తుందని తెలిపింది.

## హైడ్రాతో డ్రామాలాడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం

### బీఆర్ఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూమోల్ల కృష్ణయ్య



**విశ్వంభర, వికారాబాద్ :** హైడ్రా కాంగ్రెస్ పార్టీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుండెల్లో గుణపాలు దించబోతుందని, బీఆర్ఎస్ పార్టీ, సీనియర్ నాయకులు, బీఆర్ఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూమోల్ల కృష్ణయ్య హెచ్చరించారు. రైతుల రుణమాఫీని, పక్కదారి పట్టించేందుకే హైడ్రా పేరుతో తెలంగాణలో డ్రామాలాడుతోందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై, ఇంత త్వరగా ప్రజల్లో వ్యతిరేకత వస్తుందని ఎవరు ఊహించలేరని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 6 గ్యారంటీలు, 420 హామీలను అమలు చేయడం మరిచిపోయి, గత బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని, ఆ పార్టీ చేపట్టిన అభివృద్ధి కార్యక్ర మాలను, విమర్శించడానికే వారి సమయం అంతా కేటాయిస్తున్నారని విమర్శించారు. హైడ్రా పేరుతో తెలంగాణలో కూలుస్తున్న భవనాలన్నింటికీ గతంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వమే, పర్మిషన్స్ ఇచ్చిన సంగతి మర్చిపోవద్దని గుర్తు చేశారు. హైడ్రా పేరుతో హైదరాబాద్‌లో ఉన్న చెరువులు, కుంటల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ లల్లో ధనవంతుల భవనాలను కూల్చడం వల్ల తెలంగాణ ప్రజలకు గాని, కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి గాని, వచ్చే లాభమేమీ లేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ మంత్రుల, కాంగ్రెస్ పార్టీ ఎంపీల, ఇతర పెద్దల, భవనాలను ఎందుకు హైడ్రా కూల్చడం లేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైడ్రా కూల్చివేతలు ఆపి, ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ, తెలంగాణకు ప్రజలకు ఇచ్చిన 6 గ్యారంటీలు, 420 హామీలను, అమలు చేయడానికి పూనుకోవాలని సూచించారు. ప్రభుత్వం, రెండు లక్షల రుణమాఫీ, సగం మంది రైతులకే చేసిందని, ఇంకా మిగతా సగం మంది రైతులకు గూడ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు.

## పోలీస్ స్టేషన్ భవన నిర్మాణం కోసం భూమి పూజ



**విశ్వంభర, ఘట్కేసర్:** మేడ్చల్ జిల్లా, పోచారం ఐటీ కారిడల్ పోలీస్ స్టేషన్‌ను వెంకటాపురం గ్రామంలో నిర్మించడానికి కలెక్టర్ ఆదేశాల మేరకు కొర్రముల రెవెన్యూ పరిధిలో 808, 840. సర్వేనెంబర్ లో గల రెండు ఎకరాల భూమి ప్రొసిడింగ్ ఇవ్వడం పోచారం ఇన్ఫోసిస్ వారి సహకారంతో ఇక్కడ త్వరలో కొత్త పోలీస్ స్టేషన్ నిర్మాణం జరుగుతుందన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండేవిధంగా ఈ పోలీస్ స్టేషన్‌ను హైవేకి దగ్గరలో నిర్మిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ రాజు కొర్రముల గ్రామ మాజీ సర్పంచ్ ఓరుగంటి వెంకటేష్ గౌడ్, చౌదరిగుడా రెవెన్యూ ఆర్ఐ కావ్య, మాజీ గ్రామ సర్పంచ్ బైరు రాములు, మాజీ ఎంపీసీసీ రామారావు, నిరుడు శ్రీనివాస్ తదితరులు పాల్గున్నారు.


## ఆపదలో ఉన్న చిన్నారిని ఆదుకోవాలి

### కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి



**విశ్వంభర, కుత్బుల్లాపూర్:** నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రగతి నగర్ వాసులు ధనుంజయ్ 6 సంవత్సరాల కుమారు డు గత కొన్నిరోజులుగా కిడ్నీ వ్యాధితో బాధప డుతు చికిత్స చేయించుకోడానికి ఆర్థిక స్థోమత లేఖ ఇబ్బందుపడుతున్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డిని శుక్రవారం బాధితులు సంప్ర దించారు. వెంటనే హనుమంత్ రెడ్డి స్పందించి చిన్నారిని కాపాడాలనే ఉద్దేశంతో తనవంతుగా ఆర్థిక సాయం అందించారు. అనంతరం ఆయన మాట్లాడతూ.. కే.హెచ్.ఆర్ సేవాదళ్ సభ్యులు, నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు తమవంతు సాయం 9666685869 నెంబర్‌కు ఫోనే పే ద్వారా సాయం అందించగలరని కోరారు.

# ఎకో పార్కు ప్రాంతం పర్యాటకంగా అభివృద్ధి చెందాలి



**విశ్వంభర, అమరావతి:** ఎకో పార్కు ప్రాంతం పర్యాటకంగానూ అభివృద్ధి చెందాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. మంగళగిరి ఎయిమ్స్ వద్ద ఎకో పార్కులో ఏర్పాటు చేసిన వనమహోత్సవ కార్యక్రమంలో చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు.. వేప, రావి చెట్లను నాటారు. ప్రతి ఒక్కరూ ఏటా కనీసం రెండు మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. వనమహోత్సవం ఎంతో మహత్తరమైన కార్యక్రమమన్నారు. పచ్చదనం ఆవశ్యకతను విద్యార్థులంతా గ్రహించాలన్నారు. రాష్ట్రంలో పచ్చదనం 50శాతానికి పెరగాలన్నారు. తనకు ఎంతో ఇష్టమైన కార్యక్రమం వనమహోత్సవం అని చంద్రబాబు అన్నారు. ఒకప్పుడు ఇంకుడు గుంతలు తవ్వితే చాలా మంది ఎగతాళి చేశారు.. కానీ, భూగర్భ జలాలు పెరగాలంటే ఇంకుడు గుంతలు చాలా అవసరమన్నారు. పవన్ కల్యాణ్ వద్ద అటవీ, నరేగా శాఖలు ఉన్నాయి. రెండు శాఖల సాయంతో మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలన్నారు. బ్రహ్మంగారు నివసించిన రవ్వలకొండను కూడా తవ్వేశారు "అటవీ ప్రాంతం క్రమంగా తగ్గిపోతోంది. పర్యావరణంలో పెను మార్పులు వస్తున్నాయి. భూతాపం, కాలుష్యం బాగా పెరుగుతున్నాయి. పర్యావరణ పరిరక్షణపై అందరూ అవగాహన పెంచుకోవాలి. వైకాపా హయాంలో నదులు, చెరువులు, కొండలను ధ్వంసం చేశారు. బ్రహ్మంగారు నివసించిన రవ్వలకొండను కూడా తవ్వేశారు. వైకాపా హయాంలో వ్యవస్థలను నిర్వీర్యం చేశారు.మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఉద్యమంగా తీసుకెళ్తాం. హైదరాబాద్లో గుట్టలు, రాళ్లు ఉన్న ప్రాంతాల్లోనే మొక్కలు నాటాం. మిషన్ హరితాంధ్రప్రదేశ్కు 2014లోనే శ్రీకారం చుట్టాం. డ్రోన్స్తో సీడ్ బాల్స్ వేసే కార్యక్రమాలు చేపడతాం. అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో నగరవనాలు ఏర్పాటు చేస్తాం. జపాన్లోని మియావకీ విధానంలో పచ్చదనం పెంచుతాం" అని చంద్రబాబు తెలిపారు. పవన్ కల్యాణ్ మాట్లాడుతూ... సహజ అందాలతో వచ్చే అనుభూతి ఎంతో సంతృప్తి ఇస్తుందన్నారు. చెట్లు పెంచడాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని కోరారు. "దాదాపు కోటి మొక్కలు నాటే ప్రయత్నం శాఖాపరంగా చేస్తున్నాం. ప్రస్తుతం 29 శాతం ఉన్న పచ్చదనాన్ని 50శాతానికి తీసుకెళ్లే దిశగా కృషి చేస్తున్నాం. ఈ మహాయజ్ఞాన్ని సామాజిక బాధ్యతగా తీసుకొని ప్రతి ఒక్కరూ కలిసి రావాలి. గత ప్రభుత్వం ఇష్టారీతిన చెట్లు నరికేసింది. చెట్టుని కూల్చటం తేలిక.. పెంచటం కష్టమని ప్రతి ఒక్కరూ గ్రహించాలి. ఇవాళ నాటే ప్రతి మొక్క భావితరాల కోసమే. అడవి వాతావరణం పరిరక్షించుకుంటే తప్ప భవిష్యత్తు మనుగడ లేదు" అని పవన్ కల్యాణ్ అన్నారు.

## తండ్రి హత్యకేసులో ముగ్గురు పిల్లలకు యావజ్జీవశిక్ష

విశ్వంభర, హైదరాబాద్: కంటికి రెప్పలా కాపాడి పెంచి పోషించిన తండ్రిపై డబ్బుల కోసం కిరాతకంగా దాడి చేసి హత్యచేసిన కన్న కొడుకు, ఇద్దరు కూతుర్లకు యావజ్జీవ కారాగార జైలుశిక్ష రూ.5వేల జరిమానా విధిసూ రంగారెడ్డి జిల్లా 8వ అదనపు జిల్లా న్యాయమూర్తి యం. సతీష్కుమార్ తీర్పునిచ్చారు. అదనపు పీపీ మోతే గంగారెడ్డి కథనం ప్రకారం..రంగారెడ్డి జిల్లా బాలాపూర్ మండలం జిల్లెలగూడకు చెందిన మేడిపల్లి కృష్ణ(58)కు అయిదుగురు కూతుర్లు, కుమారుడు ఉన్నారు. ఇద్దరు కూతుర్లకు వివాహం అయింది. వాటర్ వర్క్సులో పనిచేసిన కృష్ణ రిటైర్మెంట్ కాగా తమకు డబ్బులు ఇవ్వాలని కొడుకు తరుణ్(24) కూతుర్లు అంజలి(25), ప్రియాంక(19) తండ్రితో గొడవపడగా ఇదే సమయంలో కొడుకు తరుణ్ ఐరన్రాడ్తో దాడి చేయగా తండ్రి అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మృతుడు సోదరుడు మీర్పేట్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో ప్రవేశపెట్టారు. సాక్షాధారాలను పరిశీలించిన న్యాయస్థానం నిందితులకు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది.

## అక్రమ నిర్మాణాల కూల్చివేతపై హైడ్రా వివరణ



**విశ్వంభర, హైదరాబాద్:** రాంనగర్లో అక్రమ నిర్మాణాలను కూల్చివేయడంపై హైడ్రా స్పందించింది.మురుగునీటి వ్యవస్థకు అడ్డుపడుతూ అక్రమ నిర్మాణాలు చేపట్టడం వల్లే రాంనగర్ మణెమ్మగల్లీలో ఆక్రమణలు కూల్చివేస్తున్నట్లు హైడ్రా కమిషనర్ రంగనాథ్ వెల్లడించారు. మణెమ్మ గల్లీ వద్ద ప్రజా రోడ్డుపై ఆక్రమణ జరిగిందని, హైడ్రా అధికారుల సమక్షంలో ముషీరాబాద్ సర్కిల్ డిప్యూటీ సిటీ ప్లానర్, రెవెన్యూ అధికారులతో స్థలాన్ని పరిశీలించినట్లు తెలిపారు. "పరిశీలనలో ఆక్రమణకు గురైన భూమి సర్వే నం.20, 21 వార్డు 155 బ్లాక్ ఏ జమిస్తాన్పూర్ గ్రామంలో ఉన్నట్లు గుర్తించాం. రెవెన్యూ రికార్డుల ప్రకారం ఉండాల్సిన భూమిలో కొందరు ప్రైవేటు వ్యక్తులు కల్లు కంపౌండ్, తాత్కాలిక షెడ్తోపాటు జీప్లస్ 2 అంతస్తుల భవనాన్ని అనుమతి లేకుండా నిర్మించారు. వాటి వల్ల మురుగునీటి వ్యవస్థకు ఇబ్బంది కలగడమే కాకుండా మణెమ్మ గల్లీ, రాంనగర్ వాసులు ప్రతి రోజు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అందువల్లే అనధికార నిర్మాణాలను తొలగించే ప్రక్రియ చేపట్టాం"అని కమిషనర్ తెలిపారు.

## హెచ్సీఏ అవినీతిపై సీఎం చర్యలు తీసుకోవాలి

### తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ ఆరోపణ

**విశ్వంభర, హైదరాబాద్:** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్సీఏ) లో భారీగా అవకతవకలు జరిగాయని తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గురువారెడ్డి ఆరోపించారు. బీసీసీఐ నిధులను హెచ్సీఏ దుర్వినియోగం చేసిందని.. విచారణ జరిపించి అసోసియేషన్ ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. "అజహరుద్దీన్ హయాంలో జరిగిన అవినీతి ఇప్పుడున్న జగన్మోహన్ హయాంలోనూ కొనసాగుతోంది. హెచ్సీఏ పరిధిలోని క్లబ్బులన్నీ అవినీతి మయంగా మారాయి. సుప్రీంకోర్టు తీర్పును, గ్రామీణ క్రికెట్ను పట్టించుకోట్లేదు. హెచ్సీఏపై తెలంగాణ ఏసీబీ, సీబీఐకి ఫిర్యాదు చేశాం. హెచ్సీఏ అవినీతి పై సీఎం రేవంత్రెడ్డి చర్యలు తీసుకోవాలి" అని కోరారు.

## ఆధ్యాత్మిక చింతనతో హైదరాబాద్ వచ్చా: రాబర్ట్ వాద్రా



విశ్వంభర, హైదరాబాద్: ప్రియాంకా గాంధీ భర్త రాబర్ట్ వాద్రా శుక్రవారం హైదరాబాద్లో పర్యటించారు. జూబ్లీహిల్స్ పెద్దమ్మగుడిని సందర్శించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆధ్యాత్మిక చింతనతో హైదరాబాద్కు వచ్చినట్లు చెప్పారు. తన పర్యటనలో రాజకీయం కోణం లేదని స్పష్టం చేశారు. దేశంలో మహిళల భద్రత ప్రధాన సమస్యగా మారిందన్నారు. తన భార్య, కుమార్తె భద్రతపై ఆందోళన కలుగుతోందని చెప్పారు. మహిళలతో ఎలా ప్రవర్తించాలో ఇళ్లల్లో నేర్పించాలని సూచించారు. వయనాడ్ నుంచి పోటీ చేయబోతున్న తన భార్య ప్రియాంకకు శుభాకాంక్షలు తెలిపారు.

## 'మీసేవ'లో మరో 9 సేవలు..

### ఇక నుంచి ఆ సర్టిఫికెట్లు ఆన్లైన్లోనే జారీ

**విశ్వంభర, హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 'మీసేవ'లో మరో 9 సేవలను చేర్చుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇన్నాళ్లుగా తాసిల్దార్ కార్యాలయంలో మాన్యువల్గా అందిస్తున్న సేవలను ఆన్లైన్లో అందుబాటులోకి తెస్తున్నట్టు సీసీఎల్ఏ కార్యాలయం ప్రకటించింది.కొత్తగా.. గ్యాప్ సర్టిఫికెట్, పౌరుల పేరు మార్పు, మైనార్టీ సర్టిఫికెట్, మరోసారి సర్టిఫికెట్ల జారీ (రీ ఇష్యూ), క్రిమిలేయర్, నాన్ క్రిమిలేయర్ సర్టిఫికెట్లు, మార్కెట్ విలువపై సర్టిఫైడ్ కాపీ, పాత రికార్డుల కాపీలు (ఖాస్రా/సెస్సాలా పహాణీ), 1బీ సర్టిఫైడ్ కాపీలు ఇకపై ఆన్లైన్లో మీసేవ ద్వారా అందజేయనున్నారు.


# ఎమ్మెల్సీ కవితపై దుష్ప్రచారం..

### చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్వీ ఫిర్యాదు



**విశ్వంభర, హైదరాబాద్ :** బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితపై సామాజిక మాధ్యమాలలో దుష్ప్రచారం చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ డీసీపీ దార కవితకు బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షులు తుంగబాలు ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా తుంగబాలు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన సోషల్ మీడియా, పార్టీ నాయకులు, అధికారిక ఖాతాలలో ఎమ్మెల్సీ కవిత ఫొటోలను మార్ఫింగ్ చేస్తూ, వారి కీర్తి ప్రతిష్ఠలకు భంగం కలిగించే విధంగా, అసభ్యకరంగా పోస్టులను పెడుతూ అవమానించారని పేర్కొన్నారు. కవిత ప్రతిష్ఠకు భంగం కలిగించే విధంగా పోస్టులు పెట్టిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, వారి ఖాతాలోని పోస్టులను తొలగించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి అసత్య ప్రచారాలు చేస్తే బీఆర్ఎస్వీ విద్యార్థి విభాగం చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు రంగినేని అభిలాష్, మేకల విద్యాసాగర్ పాల్గొన్నారు.

## మేడిగడ్డకు 1.75 లక్షల క్యూసెక్కుల నీరు



**విశ్వంభర, కాళేశ్వరం :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డ బరాజ్కు గోదావరి నుంచి 1.75 లక్షల క్యూసెక్కుల నీరు వస్తోంది. మొత్తం 85 గేట్ల ద్వారా నీటిని దిగువకు వదులుతున్నారు. అన్నారం బరాజ్కు మానేరు, కాల్వల ద్వారా 3500 క్యూసెక్కుల ప్రవాహం వస్తుండగా, మొత్తం 66 గేట్ల ద్వారా నీటిని విడుదల చేస్తున్నారు. అదేవిధంగా కాళేశ్వరం వద్ద గోదావరి ప్రవాహం తగ్గుతోంది. 1.75 లక్షల క్యూసెక్కులతో 85 మీటర్ల ఎత్తులో లక్ష్మి బరాజ్ వైపు పరుగులు తీస్తున్నాయి.

## ఏపీలో ఉద్యోగుల బదిలీల గడువు పొడిగించిన ప్రభుత్వం

**విశ్వంభర, అమరావతి:** ఉద్యోగుల బదిలీలు చేపట్టేందుకు మరో 15 రోజులపాటు గడువును పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు సెప్టెంబరు 15 వరకు బదిలీలపై నిషేధాన్ని ఎత్తివేస్తున్నట్టు ఆర్థికశాఖ ముఖ్య క ర్యదర్శి పీయూష్ కుమార్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సెప్టెంబరు 16 నుంచి బదిలీలపై మళ్లీ నిషేధం అమల్లోకి వస్తుందని స్పష్టం చేస్తూ ఆర్థికశాఖ ఉత్తర్వులు ఇచ్చింది. ఇప్పటికీ చాలా ప్రభుత్వశాఖలు బదిలీల విధివిధానాల్ని రూపొందించుకోకపోవటంతో గడువును పొడిగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. స్టాంపులు, రిజిస్ట్రేషన్లశాఖ, రెవెన్యూ, రహదారులు భవనాలు, రవాణాశాఖలకు చెందిన బదిలీ మార్గదర్శకాల్లో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. విధివిధానాల రూపకల్పలోనే వివిధ శాఖలు ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా గడువును పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

## సినీ నటి జత్వానీపై పోర్జరీ కేసులు పెట్టి

### ఇబ్బందులపాలు చేశారు: ఏపీ సీఎం చంద్రబాబు

**విశ్వంభర, అమరావతి :** వైసీపీ నాయకులు ముంబై సినీ నటి జత్వానీపై పోర్జరీ కేసులు పెట్టి ఇబ్బందులపాలు చేశారని ఏపీ సీఎం చంద్రబాబు ఆరోపించారు. ఈ ఘటనపై తొలిసారి స్పందించిన ఆయన వైఎస్ జగన్ను డ్రగ్ డాన్ ఫ్యాబ్లో ఎస్కోబార్గా పోల్చారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మంగళగిరి ఎయిమ్స్ ఆసుపత్రిలో మొక్కను నాటారు. ఈ సందర్భంగా సీఎం నటి జత్వానీ కేసు గురించి బహిరంగ సభలో మాట్లాడారు. బాధితులను రక్షించాల్సిన పోలీసులే ఆమెను బెదిరించి, చిత్రహింసలకు గురిచేసి అరెస్టు చేసి కస్టడీలో పెట్టారని ఆరోపించారు. వైసీపీ పాలనలో ప్రజలంతా భయపడ్డారని, కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో స్వేచ్ఛ వాతావరణం కనిపిస్తుందని అన్నారు. ఎస్కోబార్లాంటి వ్యక్తులు మళ్లీ అధికారంలోకి వస్తే రాష్ట్ర భవిష్యత్ సర్వనాశనం అవుతుందని పేర్కొన్నారు.

## బాధితులను పరామర్శించిన పుట్ట మధు



**విశ్వంభర, భూపాలపల్లి:** భూపాలపల్లి జిల్లా కాటారం మండలం బస్వాపూర్ గ్రామంలో బుధవారం అర్ధరాత్రి దొంగతనం జరిగిన పగడాల తిరుపతి ఇంటిని మంతిని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు పరిశీలించారు. అనంతరం దొంగల దాడిలో గాయపడి భూపాలపల్లి యోధ హాస్పటల్ లో చికిత్స పొందుతున్న తిరుపతి భార్య స్వర్ణలతను పరామర్శించి ధైర్యం చెప్పారు. పోలీసు ఉన్నతాధికారులతో మాట్లాడి దొంగలను త్వరగా పట్టుకోవాలని,పోలీస్ పెట్రోలింగ్ పెంచాలని సూచించారు.

## అదనపు ఎస్పీని కలిసిన జర్నలిస్టులు



**విశ్వంభర, భూపాలపల్లి:** భూపాలపల్లి జిల్లా అదనపు ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన బోనాల కిషన్ భూపాలపల్లి జిల్లా కేంద్రానికి చెందిన కాకతీయ ప్రెస్ క్లబ్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ.. పోలీసులు, జర్నలిస్టులు కలిసికట్టుగా పనిచేసి శాంతిభద్రతలను కాపాడాలని సూచించారు. ప్రజలకు పోలీసులకు మధ్య వారధిగా ఉండి ప్రజా సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. అదనపు ఎస్పీని కలిసిన వారిలో ఎడ్ల సంతోష్, బండ మోహన్, జల్ది రమేష్, సామంతుల శ్యామ్, సామల శ్రీనివాస్, గుమ్మడి రవీందర్, కడపాక రవి, వివేకానంద, సృజన్, దేవేందర్ తదితరులు.

## పాము కాటుకు ఎద్దు మృతి



**విశ్వంభర,నారాయణపూర్:** యాదాద్రి భువనగిరి జిల్లా నారాయణపూర్ మండలం మల్లారెడ్డిగూడెం గ్రామానికి చెందిన కుర్రీ బుచ్చయ్య తండ్రి తిరుపతయ్య వ్యవసాయం జీవనాధారంగా బతుకుతున్నాడు. బీద కుటుంబానికి బుచ్చయ్య ఎద్దు పాము కాటుతో మరణించింది. ప్రభుత్వం తరుపున ఆ బీద రైతు కుటుంబాన్ని ఆదుకోవాలని రైతు కోరుతున్నారు.

## సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలి



**విశ్వంభర, ఆమనగల్లు:** ఆమనగల్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో కుసుమ మాధురి ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లోని ప్రజలకు సీజనల్ వ్యాధులకు గురించి తెలియజేసి వాటి నివారణకు సూచనలు ఇవ్వాలని పరిశుద్ధ కార్యక్రమాలు నిర్వహించాలని గ్రామ కార్యదర్శులకు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు, పరీక్షిత్ అధికారులు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ఆసుపత్రిని పోలీసులు సద్వినియోగం చేసుకోవాలి




**విశ్వంభర, నాగర్ కర్నూల్:** జిల్లాలో విధినిర్వహణలో పనిచేస్తున్న పోలీసు కుటుంబ సభ్యులు జిల్లా కేంద్రంలో నూతనంగా పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన యూనిట్ ఆసుపత్రిని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి కోరారు. శుక్రవారం కలెక్టర్ బాదావత్ సంతోష్, జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్తో కలిసి ఆసుపత్రిని ప్రారంభించారు. ఈ సందర్భంగా పోలీస్ ఆసుపత్రికి చేరుకున్న వారికి పోలీసులు ఘన స్వాగతం పలికి పుష్పగుచ్చాలు అందించి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఒకే ఆస్పత్రి ఉన్నదని నేడు జిల్లా ఎస్పీ చొరవతో నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో ఆసుపత్రిని ఒక వైద్యుడిగా ప్రారంభించడం ఎంతో ఆనందాన్ని కలిగిస్తుందని తెలిపారు. కుటుంబ సభ్యులంతా ఓపిని పొంది సేవలు తీసుకోవాలని ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంగా జీవించడమే లక్ష్యంగా సాధన చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి స్వరాజ్యలక్ష్మి, డిఎస్పి శ్రీనివాస్ యాదవ్, కనకయ్య తోపాటు పోలీస్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



## కోల్‌కతా ఘటనపై మహిళల నిరసన లాకెట్ ఛటర్జీ సహా పలువురి అరెస్ట్

**కోల్‌కతా:** కోల్‌కతాలోని ఆర్జీ కర్ మెడికల్ కాలేజ్ ఆస్పత్రిలో ట్రైనీ డాక్టర్ హత్యాచార ఘటన దేశవ్యాప్తంగా పెనుదుమారం రేపిన సంగతి తెలిసిందే. ఈ ఘటనకు వ్యతిరేకంగా కోల్‌కతాలో విపక్షాలు, మహిళా, ప్రజా సంఘాల నిరసన ప్రదర్శనలు కొనసాగుతున్నాయి. హత్యాచార బాధితురాలికి న్యాయం చేయాలని కోరుతూ బీజేపీ మహిళా మోర్చా శుక్రవారం కోల్‌కతా వీధుల్లో నిరసన ప్రదర్శనలు చేపట్టడంతో ఉద్రిక్తత నెలకొంది. ఈ ఘటనలో పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీకి వ్యతిరేకంగా విపక్షాల నిరసనల నేపథ్యంలో నగరమంతటా పెద్దసంఖ్యలో పోలీస్ బలగాలను మోహరించారు. ఇక బీజేపీ మహిళా మోర్చా నిరసనల సందర్భంగా ఆ పార్టీ నేత లాకెట్ ఛటర్జీ సహా పలువురు నేతలు, మహిళలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మరోవైపు మహిళలపై హత్యాచార ఘటనలను నియంత్రించేందుకు ఈ తరహా నేరాలపై ఉక్కుపాదం మోపేలా కఠిన చట్టాలు తీసుకురావాలని ప్రధాని నరేంద్ర మోదీని కోరుతూ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ శుక్రవారం మరో లేఖ రాశారు. దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో మహిళలపై నేరాలు పెచ్చుమీరుతున్నాయని మోదీకి రాసిన లేఖలో దీదీ ఆందోళన వ్యక్తం చేశారు.

## నేను గెలిస్తే ఉచిత ఐవీఎఫ్ చికిత్స: ట్రంప్



**మిషిగన్:** రెండోసారి అధ్యక్ష పదవి కోసం పోటీ పడుతున్న రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి, మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. తాను గెలిస్తే మహిళలకు ఉచిత ఐవీఎఫ్ చికిత్సను అందించాలనుకుంటున్నట్లు తెలిపారు. దీన్ని ఎలా అమలు చేయనున్నారు? నిధులను ఎలా సమకూరుస్తారనే వివరాలను మాత్రం వెల్లడించలేదు. "ట్రంప్ పాలనలో ఐవీఎఫ్ చికిత్సకు సంబంధించిన అన్ని ఖర్చులను ప్రభుత్వమే చెల్లిస్తుంది. లేదా మీ బీమా కంపెనీ తప్పనిసరిగా చెల్లించాల్సి ఉంటుంది" అని మిషిగన్ గురువారం జరిగిన ఓ కార్యక్రమంలో ప్రకటించారు.

ఐవీఎఫ్ చికిత్స అత్యంత ఖర్చుతో కూడుకొన్నది. అమెరికాలో ఒక దఫాకు పదివేల డాలర్ల వరకు ఖర్చవుతుందని అంచనా. ఈ చికిత్స ఫలవంతమయ్యే అవకాశాలు తక్కువగా ఉన్నందున బహుళ దఫాల్లో తీసుకోవాల్సి రావొచ్చు. 1973లో రో వర్సెస్ వేడ్ కేసులో అనివార్య పరిస్థితుల్లో గర్భవిచ్ఛిత్తి చేయించుకునే హక్కు మహిళలకు ఉందని అమెరికా సుప్రీంకోర్టు తీర్పు వెలువరించింది. అదే అత్యున్నత న్యాయస్థానం ఆ తీర్పును కొట్టివేస్తూ గత ఏడాది మరో తీర్పు చెప్పింది. ఈ నేపథ్యంలో గర్భవిచ్ఛిత్తి విధానంపై ట్రంప్ కొంతకాలంగా భిన్నస్వరాలు వినిపించారు. చివరకు ఈ అంశాన్ని రాష్ట్రాలకు వదిలేయాలని ప్రతిపాదించారు. దీంతో ఈ విషయంపై ట్రంప్ను ఉద్దేశించి డెమోక్రాట్లు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ తరుణంలో తాజా ప్రకటన రావడం గమనార్హం.

## బీహార్ డీజీపీగా సీనియర్ ఐపీఎస్ అధికారి అలోక్ రాజ్



**పాట్నా:** బీహార్ డీజీపీగా సీనియర్ ఐపీఎస్ అధికారి అలోక్‌రాజ్ నియమితులయ్యారు. ఆయన 1989 బ్యాచ్ ఐపీఎస్ అధికారి. ప్రస్తుతం ఆయన బీహార్ పోలీస్ విభాగంలో విజిలెన్స్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో డీజీగా పనిచేస్తున్నారు. అలోక్ రాజ్ 2025 డిసెంబర్ 31 వరకు డీజీపీ పదవిలో కొనసాగనున్నారు. గతంలో అలోక్ రాజ్‌కు పిల్లనిచ్చిన మామ డీఎన్ సహాయ్ కూడా బీహార్ డీజీపీగా పనిచేశారు. లాలూ ప్రసాద్ యాదవ్ హయాంలో ఆయన డీజీపీగా బాధ్యతలు నిర్వర్తించారు. అలోక్‌రాజ్‌కు సంగీతం అంటే చాలా ఇష్టం. ఆయన పాడిన చాలా పాటలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఆయన పలు మ్యూజిక్ ఆల్బమ్‌లను కూడా నిర్మించారు.

## ఆఫ్రికా దేశాల్లో ఆరు నెలల్లో మంకీపాక్స్ వ్యాప్తి ఆగిపోవచ్చు


### ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనా



**జెనీవా:** ప్రాణాంతక మంకీపాక్స్ వ్యాప్తి పలు దేశాలను కలవరపెడుతోంది. ముఖ్యంగా ఆఫ్రికా దేశాల్లో దీని తీవ్రత ఎక్కువగా ఉంది. అయితే, వచ్చే ఆరు నెలల్లో దీని వ్యాప్తి ఆగిపోవచ్చని ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనా వేసింది. ఇందుకు సంబంధించిన వ్యాక్సిన్లు మరికొన్ని రోజుల్లోనే కాంగోకు చేరుకోనున్నట్లు తెలిపింది. కాంగోలో ఎంపాక్స్ వ్యాప్తి ఆందోళనకర రీతిలో ఉన్నట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఇప్పటికే 18వేల అనుమానిత కేసులు, 926 మరణాలు సంభవించాయి. కొత్తరకం కేసులు ఇప్పటివరకు 258-నమోదైనట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించింది. ఆఫ్రికాలోని బురుండి, రువాండా, కెన్యా, ఉగాండాతోపాటు స్వీడన్, థాయ్లాండ్ దేశాల్లోనూ ఈ కేసులు వెలుగు చూశాయి.

## బీజేపీలో చేరిన చంపై సోరెన్

**రాంచీ:** జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి, జేఎంఎం మాజీ నేత చంపై సోరెన్ భారతీయ జనతా పార్టీలో చేరారు. శుక్రవారం మధ్యాహ్నం కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ సమక్షంలో కమలం పార్టీలో చేరారు. చంపై సోరెన్‌కు జార్ఖండ్ బీజేపీ అధ్యక్షుడు బాబులాల్ మరాండీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రాంచీలో జరిగిన ఈ కార్యక్రమానికి అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ వర్మ తదితరులు హాజరయ్యారు. కాగా, సొంతపార్టీపై చంపై సోరెన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ.. జేఎంఎంకు ఇటీవలే రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ప్రాథమిక సభ్యత్వానికి, పార్టీలో అన్ని పదవులకు రాజీనామా చేసినట్లు లేఖ విడుదల చేశారు. ఆ తర్వాత తాను బీజేపీలో చేరనున్నట్లు ప్రకటించారు. పార్టీ తనకు ఏ బాధ్యతలు అప్పగించినా నిర్వర్తిస్తానని అన్నారు. గిరిజనుల సంక్షేమంతో పాటు జార్ఖండ్ ప్రజల అభివృద్ధికి పాటుపడతామని చెప్పారు. బంగ్లాదేశ్ చొరబాట్లతో ప్రమాదంలో పడిన గిరిజనులకు బాసటగా నిలుస్తామని స్పష్టం చేశారు. తాను ఎంతో కష్టపడి ఈస్థాయికి చేరుకున్నానని, జార్ఖండ్ అభివృద్ధితో పాటు గిరిజనుల ఉనికిని కాపాడేందుకే తాను కాషాయ పార్టీలో చేరుతున్నానని చంపై సోరెన్ వెల్లడించారు.



# మోదీజీ.. మీ నుంచి బదులు రాలేదు

## ప్రధానికి మరో లేఖ రాసిన దీదీ




**కోల్‌కతా :** పశ్చిమబెంగాల్లోని జూనియర్ వైద్యురాలిపై హత్యాచార ఘటన దేశవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించిన నేపథ్యంలో సీఎం మమతా బెనర్జీ ప్రధాని నరేంద్ర మోదీకి మరో లేఖ రాశారు. హత్యాచార ఘటనలకు పాల్పడేవారిని శిక్షించేందుకు కఠినచట్టం తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే నిర్దిష్ట కాలపరిమితిలో కేసుల్ని పరిష్కరించేలా ఆ చట్టం ఉండాలని మరోసారి తన లేఖలో అభ్యర్థించారు. "ఈ సున్నిత అంశంపై మీనుంచి ఎలాంటి సమాధానం అందలేదు" అని పేర్కొన్నారు. తాను రాసిన లేఖపై ప్రధాని నుంచి నేరుగా సమాధానం రాకపోవడంపై విచారం వ్యక్తంచేశారు. మహిళా శిశుసంక్షేమశాఖ నుంచి బదులు వచ్చిందని చెప్పిన ఆమె.. సమస్య తీవ్రత దృష్ట్యా ఆ సాధారణ సమాధానం సరిపోదన్నారు. హత్యాచార ఘటనపై వారం రోజుల క్రితం మోదీకి దీదీ తొలిసారి లేఖ రాశారు. "దేశంలో మహిళలపై జరుగుతోన్న అత్యాచార ఘటనలను మీ దృష్టికి తీసుకురావాలనుకొంటున్నా. అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం.. దేశవ్యాప్తంగా రోజుకు దాదాపు 90 అత్యాచార ఘటనలు జరుగుతుండటం భయానక పరిస్థితిని సూచిస్తోంది. ఇలాంటి చర్యలు సమాజం, దేశం విశ్వాసాన్ని దెబ్బతీస్తాయి.

ఈ దురాగతాలకు ముగింపు పలకడం ద్వారా మహిళలు తాము సురక్షితంగా, భద్రంగా ఉన్నామని భావించేలా చేయడం మనందరి కర్తవ్యం. ఘోరమైన నేరాలకు పాల్పడేవారిని కఠినంగా శిక్షించేలా చట్టాలు తీసుకురావాల్సిన అవసరం ఉంది. సత్వర న్యాయం జరగాలంటే ఈ కేసుల విచారణ 15 రోజుల్లో పూర్తి చేయాలి" అని పేర్కొన్నారు. ఇదిలాఉంటే.. దేశంలో మహిళలపై జరుగుతోన్న అఘాయిత్యాలపై ఇదివరకు మోదీ స్పందిస్తూ.. "మహిళల భద్రత ఎంతో ముఖ్యమైనది. మహిళలపై నేరాలు క్షమించరానివని ప్రతీ రాష్ట్రానికి చెబుతున్నా. నేరస్థులు ఎవరైనా సరే.. వారిని విడిచిపెట్టే ప్రసక్తే లేదు. మహిళలపై నేరాలకు పాల్పడేవారిని కఠినంగా శిక్షించేందుకు చట్టాలను మరింత పటిష్ఠపరుస్తున్నాం" అని వెల్లడించారు. కోల్కతాలోని ఆర్జీ కర్ ఆస్పత్రిలో జూనియర్ వైద్యురాలిపై అత్యాచారం, హత్య వ్యవహారం, ఆ తర్వాత ఆస్పత్రిలో జరిగిన విధ్వంసం వంటి పరిణామాలతో మమతా బెనర్జీ సర్కార్పై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అసెంబ్లీలో ప్రత్యేక సెషన్కు రాష్ట్ర ప్రభుత్వం పిలుపునిచ్చింది. అత్యాచారాల నిరోధకానికి కొత్త బిల్లు తీసుకురాబోతున్నట్లు తెలిపింది.

మంకీపాక్స్ వ్యాప్తిపై ఆందోళన వ్యక్తం చేసిన ప్రపంచ ఆరోగ్య సంస్థ.. అంతర్జాతీయ అత్యయిక స్థితిగా ఇటీవల ప్రకటించింది. ఈ క్రమంలోనే తీవ్ర ప్రభావం ఉన్న కాంగోకు తక్షణమే 2.3లక్షల వ్యాక్సిన్ డోసులను పంపించేందుకు ఏర్పాట్లు చేసింది. అయితే, గత రెండు వారాలుగా వ్యాధి వేగంగా వ్యాప్తి చెందుతున్నప్పటికీ మరణాలు మాత్రం తక్కువగానే ఉన్నట్లు డబ్ల్యూహెచ్వో చీఫ్ టెడ్రోస్ అధనోమ్ పేర్కొన్నారు. రానున్న ఆరు నెలల్లో దీని వ్యాప్తి ఆగిపోవచ్చని భావిస్తున్నామన్నారు.

## నేను గెలిస్తే కేబినెట్లోకి రిపబ్లికన్ పార్టీ వ్యక్తి

### కమలా హారిస్



**సవన్నా:** అమెరికన్ ప్రజలు రిపబ్లికన్ అధ్యక్ష అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ను ఓడించడానికి సిద్ధంగా ఉన్నారని ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ అన్నారు. దేశం కోసం కొత్త మార్గాన్ని నిర్దేశించాలని నిర్ణయించుకున్నారన్నారు. అధ్యక్ష అభ్యర్థిగా ఖరారైన తర్వాత ఆమె తొలిసారి ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. అక్రమ వలసలపై కఠినంగా వ్యవహరిస్తానని కమలా హారిస్ ప్రకటించారు. చమురు, సహజవాయువు వెలికితీతకు మద్దతునిస్తానని వెల్లడించారు. సుదీర్ఘకాలంగా తాను అవలంబిస్తున్న ఉదారవాద విలువలను మాత్రం ఎట్టిపరిస్థితుల్లో వీడేది లేదని తేల్చి చెప్పారు. ఈసందర్భంగా ట్రంప్ పై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఆయన అమెరికన్లను, వారి శక్తిసామర్థ్యాలను తక్కువ చేసే అజెండాతో పని చేస్తున్నారని ఆరోపించారు. దేశాన్ని విభజిస్తున్నారని విమర్శించారు. ఈ విధానాలను తిప్పికొట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. తాను అధికారంలోకి వస్తే కేబినెట్లోకి రిపబ్లికన్ను తీసుకుంటానని హారిస్ ప్రకటించడం గమనార్హం. ఇదే ఇంటర్వ్యూలో ఆమెతోపాటు ఉపాధ్యక్ష అభ్యర్థి టిమ్ వాజ్ సైతం పాల్గొన్నారు. చమురు వెలికితీత, వలసవిధానం విషయంలో తనపై వస్తున్న విమర్శలను ఆమె కొట్టిపారేశారు. ఒకప్పుడు చమురు వెలికితీతను తప్పుబట్టారని.. అక్రమ వలసలపై ఉదారంగా వ్యవహరించారనడంలో వాస్తవం లేదని చెప్పుకొచ్చారు. అధ్యక్షురాలిగా తాను ఎట్టిపరిస్థితుల్లో చమురు వెలికితీతను నిషేధించబోనని స్పష్టంచేశారు. తద్వారా శిలాజ ఇంధనాలు అధికంగా ఉన్న పెన్సిల్వేనియా రాష్ట్రం వివాదానికి ముగింపు పలికారు. అధ్యక్ష ఎన్నికల ఫలితాలను నిర్ధరించే కీలక రాష్ట్రాల్లో ఇదొకటి కావడం గమనార్హం. గాజాలో కాల్పుల విరమణ ఒప్పందానికి రావాలని ఆమె ఆకాంక్షించారు. మిత్ర దేశమైన ఇజ్రాయెల్ విషయంలో అధ్యక్షుడు బైడెన్ విధానాలనే తాను కొనసాగిస్తానని హామీ ఇచ్చారు.

## పట్టాలపైకి మరో మూడు వందే భారత్ రైళ్లు



**ఢిల్లీ:** దేశంలో వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్ల జోరు రోజురోజుకూ పెరుగుతోంది. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన ఈ సెమీ హైస్పీడ్ రైలు సర్వీసులను కేంద్ర ప్రభుత్వం ప్రయాణికులకు మరింత చేరువ చేస్తోంది. దేశవ్యాప్తంగా ఇప్పటివరకు మొత్తం 51 రైళ్లు పట్టాలెక్కాయి. అవి వేర్వేరు రాష్ట్రాలు/నగరాల మధ్య పరుగులు పెడుతున్నాయి. సాధారణ రైళ్లల్లో ఇప్పటి వరకు లేని కొన్ని ప్రత్యేకతలు, వేగం.. వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌లో ఉండటంవల్ల వాటికి డిమాండ్ పెరుగుతోంది. ఆక్యుపెన్సీ రేషియో భారీగా ఉంటోంది. సాధారణ రైళ్లతో పోల్చుకుంటే టికెట్ ధర అధికమే అయినప్పటికీ త్వరితగతిన గమ్యస్థానాలకు చేరడానికి ప్రయాణికులు వందే భారత్‌ను ఆశ్రయిస్తున్నారు. ఈ క్రమంలో కొత్తగా మరో మూడు వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు పట్టాలెక్కబోతున్నాయి. అందులో చెన్నై ఎగ్మూర్ నుంచి నాగర్ కోయిల్ మధ్య రాకపోకలు సాగించే ఎక్స్‌ప్రెస్ ఒకటి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శనివారం ఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ రూపంలో ఈ రైలును జెండా ఊపి ప్రారంభించనున్నారు. చెన్నై ఎగ్మూర్‌నాగర్ కోయిల్ మధ్య దూరం 724 కిలో మీటర్లు. ఈ దూరాన్ని వందే భారత్ ఎక్స్‌ప్రెస్ తొమ్మిది గంటల వ్యవధిలో చేరుకుంటుంది. ఈ రైలుకు సంబంధించిన షెడ్యూల్‌ను ఇదివరకే రైల్వే అధికారులు విడుదల చేశారు. తెల్లవారు జామున 5 గంటలకు ఎగ్మూర్ నుంచి బయలుదేరే ఈ ఎక్స్‌ప్రెస్.. 5:23 నిమిషాలకు తాంబరం చేరుకుంటుంది. విల్లుపురం 6:52, తిరుచ్చి ఉదయం 8:55, దిండిగల్ 9:53, మధురై 10:38, కోవిల్‌పట్టి 11:35, తిరునెల్వేలి మధ్యాహ్నం 12:30, నాగర్ కోయిల్ 1:50 నిమిషాలకు చేరుకుంటుంది. అదే రోజు మధ్యాహ్నం 2: 20 నిమిషాలకు మళ్లీ ఎగ్మూర్‌కు తిరుగుముఖం పడుతుందీ రైలు. తిరునెల్వేలి 3:18, కోవిల్‌పట్టి 3:58, మధురై సాయంత్రం 5:03, దిండిగల్ 5:48, తిరుచ్చి 6:45, విల్లుపురం రాత్రి: 8:53, తాంబరం10:28, ఎగ్మూర్ 11 గంటలకు చేరుకుంటుంది.

ఈ రైలుతోపాటే మధురై బెంగళూరు కంటోన్మెంట్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌ను కూడా మోదీ ప్రారంభిస్తారు. మంగళవారం మినహా మిగిలిన అన్ని రోజులు తెల్లవారు జామున 5: 15 నిమిషాలకు మధురై నుంచి బయలుదేరే ఈ ఎక్స్‌ప్రెస్ మధ్యాహ్నం ఒంటిగంటకు బెంగళూరు కంటోన్మెంట్‌కు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో మధ్యాహ్నం 1:30 నిమిషాలకు బెంగళూరు కంటోన్మెంట్ నుంచి బయలుదేరి రాత్రి 9:45 నిమిషాలకు మధురై చేరుకుంటుంది. దిండిగల్, తిరుచ్చి, కరూర్, నమక్కల్, సేలం, కృష్ణరాజపురం మీదుగా ఈ రైలు రాకపోకలు సాగిస్తుంది.

## ముస్లిం ఎమ్మెల్యేలకు శుక్రవారం నమాజ్ విరామం రద్దు

### అస్సాం అసెంబ్లీ నిర్ణయం



**గౌహతి:** ముస్లిం శాసనసభ్యులకు ప్రతి శుక్రవారం నమాజ్ కోసం రెండు గంటలు విరామం ఇచ్చే దశాబ్దాల నాటి నిబంధనను రద్దు చేయాలని అస్సాం అసెంబ్లీ నిర్ణయించింది. ఇతర రోజుల మాదిరిగానే శుక్రవారం కూడా సభా కార్యకలాపాలను కొనసాగించాలని అసెంబ్లీ రూల్స్ కమిటీ శుక్రవారం తీర్మానం చేసింది. అయితే దీనిపై ప్రతిపక్షాలు మండిపడ్డాయి. ముస్లిం ఎమ్మెల్యేలు ప్రార్థనలకు హాజరయ్యేందుకు వీలుగా ఇప్పటి వరకు ప్రతి శుక్రవారం అస్సాం అసెంబ్లీ రెండు గంటలు వాయిదా పడేది. శుక్రవారం ఉదయం 11 గంటలకు సభను వాయిదా వేసేవారు. ముస్లిం సభ్యుల నమాజ్ అనంతరం లంచ్ సెషన్ తర్వాత అసెంబ్లీ కార్యకలాపాలు తిరిగి ప్రారంభమయ్యేవి. కాగా, మతపరమైన ప్రయోజనాల కోసం ఎలాంటి వాయిదా లేకుండా ఇతర రోజుల మాదిరిగానే శుక్రవారం రోజు కూడా సభా కార్యకలాపాలు కొనసాగడంపై స్పీకర్ బిస్వజిత్ డైమరీ దృష్టి సారించినట్లు అస్సాం అసెంబ్లీ కార్యాలయం పేర్కొంది. రాజ్యాంగంలోని లౌకిక స్వభావాన్ని దృష్టిలో ఉంచుకుని శుక్రవారాల్లో ఏ విధమైన వాయిదా లేకుండా అస్సాం అసెంబ్లీ కార్యకలాపాలను నిర్వహించాలని స్పీకర్ ప్రతిపాదించినట్లు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.

మరోవైపు అస్సాం సీఎం హిమంత బిస్వా శర్మ ఈ నిర్ణయంపై స్పందించారు. ముస్లిం ఎమ్మెల్యేల నమాజ్ కోసం రెండు గంటల విరామాన్ని తొలగించడం ద్వారా అస్సాం అసెంబ్లీ ఉత్పాదకతకు ప్రాధాన్యత లభిస్తుందని తెలిపారు. అలాగే వలస పాలనకు సంబంధించిన మరో చిహ్నం తొలగిందని అన్నారు. 1937లో ముస్లిం లీగ్‌కు చెందిన సయ్యద్ సాదుల్లా ఈ పద్ధతిని ప్రవేశపెట్టినట్లు ఎక్స్ పోస్ట్‌లో పేర్కొన్నారు.

## వరుసగా నాలుగోసారి విజయం మాదే

### ప్రధాని మోదీ




**ముంబయి:** 2029 లోక్‌సభ ఎన్నికల్లో వరుసగా నాలుగోసారి విజయం సాధించి రికార్డు సృష్టిస్తామని ప్రధాని మోదీ ధీమా వ్యక్తం చేశారు. ఇటీవల లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ పూర్తి మెజార్టీ సాధించలేదని, దాంతో తాను ప్రజాదరణ కోల్పోయానని కొందరు రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారని అన్నారు. గ్లోబల్ ఫిన్టిక్ ఫెస్ట్లో పాల్గొన్న మోదీ.. 2029 ఎన్నికల్లో మళ్లీ విజయం సాధిస్తామని పేర్కొన్నారు. "ఇది ఐదో గ్లోబల్ ఫిన్టిక్ ఫెస్ట్. 2029లో జరిగే సమావేశాలకూ వస్తాను. గతంలో భారత్కు వచ్చే విదేశీ అతిథులు ఇక్కడి సంస్కృతిక వైవిధ్యాన్ని చూసి ఆశ్చర్యపోయేవారు. కానీ, ప్రస్తుతం మాత్రం ఫిన్టిక్ పురోగతి చూసి ఆశ్చర్యపడుతున్నారు" అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా విపక్షాలపైనా ప్రధాని మోదీ విరుచుకుపడ్డారు. గ్రామాల్లో ఇంటర్నెట్, విద్యుత్ కనెక్షన్లు లేవని, దేశ పురోగతి గురించి అనేక మంది అనుమానాలు వ్యక్తం చేస్తున్నారని మండిపడ్డారు. అయినప్పటికీ.. గత దశాబ్ది కాలంలో భారత్ గణనీయ పురోగతి సాధించిందని అన్నారు. 2014, 2019 లోక్‌సభ ఎన్నికల్లో భాజపా పూర్తి మెజార్టీ సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. కానీ, ఇటీవల ఎన్నికల్లో (2024) మాత్రం మెజార్టీ మార్కును (272 సీట్లు) సాధించలేకపోయింది. దీంతో ఎన్డీఏ భాగస్వామ్యపక్షాలతో కలిసి భాజపా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. వచ్చే లోక్‌సభ ఎన్నికలు ఏప్రిల్‌మే 2029లో జరగనున్నాయి.

## వేగంగా ఎదుగుతున్న ఎకానమీల్లో ముందున్న భారత్ : రాజ్‌నాథ్ సింగ్

2014కు ముందు బలహీనంగా ఉన్న ఐదు ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా ఉన్న భారత్ ఇప్పుడు అద్భుత ఐదు ఎకానమీల్లో ఒకటిగా ఎదిగిందని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ప్రస్తుతం ప్రపంచంలోనే భారత్ అత్యంత వేగంగా ఎదుగుతున్న ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా నిలిచిందని చెప్పారు. తిరువనంతపురంలో శుక్రవారం మనోరమ న్యూస్ కాంక్లేవ్ 2024 సదస్సులో ఆయన మాట్లాడారు. భారత ఆర్థిక వ్యవస్థ అసాధారణ మార్పులకు వేదికగా నిలిచిందని అన్నారు. దేశంలో సులభతర వాణిజ్యం కోసం ప్రభుత్వం ఎన్నో చర్యలు చేపట్టిందని వివరించారు. ప్రభుత్వ చొరవతో గతంలో పర్యావరణ క్లియరెన్స్ రావాలంటే 600 రోజులు పట్టగా ఇప్పుడది కేవలం 75 రోజుల్లోనే సాధ్యమవుతున్నదని చెప్పారు. దేశంలో సులభతర వాణిజ్య ప్రక్రియ బహుముఖంగా మెరుగైందని తెలిపారు. 5జీ ప్రవేశపెట్టడంలో దేశ పురోగతిని రాజ్‌నాథ్ సింగ్ వివరిస్తూ దేశంలో 5జీ పురోగతిని టెలికాం కంపెనీ ఎరిక్సన్ వైస్ ప్రెసిడెంట్ కూడా ప్రశంసించారని చెప్పారు. పలు ఐరోపా దేశాల కంటే ఈ విషయంలో భారత్ ముందున్నదని తెలిపారని వివరించారు. గ్లోబల్ ర్యాంకింగ్స్‌లో భారత ఆర్థిక వ్యవస్థ మెరుగైన పనితీరు కనబరుస్తున్నదని, ఇప్పుడు భారత్ దేశంలోనే ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉందని, 2027 నాటికి ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరిస్తుందని చెప్పారు. ప్రపంచంలోనే భారత్ ప్రస్తుతం మొబైల్ ఫోన్ల తయారీలో రెండో స్థానంలో ఉందని వెల్లడించారు.

## సీఎం రేవంత్ హైడ్రా పేరిట గ్లాడియేటర్ గేమ్స్ ఆడుతున్నాడు..

### మండిపడ్డ పటోళ్ల కార్తీక్ రెడ్డి

విశ్వంభర, హైదరాబాద్ : హైడ్రా పేరిట సీఎం రేవంత్ రెడ్డి గ్లాడియేటర్ గేమ్స్ ఆడుతున్నాడని బీఆర్ఎస్ నాయకుడు పటోళ్ల కార్తీక్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో పటోళ్ల కార్తీక్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. చెరువులను సంరక్షించాలనే స్పష్టత ప్రభుత్వానికి గానీ, హైడ్రాకు గానీ లేదు. ఈ రాష్ట్ర ప్రభుత్వం రెండు నెలల క్రితం ఎల్ఆర్ఎస్ స్కీం తీసుకొచ్చింది. పాత రంగారెడ్డి జిల్లాలో చెరువుల్లో లే అవుట్లు వేయడం జరిగింది. ఈ చెరువుల్లో వేసిన లేఅవుట్లకు ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ కింద ఇప్పటికి రెగ్యులరైజ్ చేస్తుంది. రామాంతాపూర్ చెరువులో ఉన్న లే అవుట్లకు ఈ రోజుకు కూడా డబ్బులు తీసుకుని ఎల్ఆర్ఎస్ ప్రాసెస్ చేస్తున్నారు. మరి ఈ ప్రభుత్వానికి ఎక్కడ స్పష్టత ఉంది. ఈ ద్వంద్వ వైఖరి ఏంటి..? మీరు ఎల్ఆర్ఎస్ డబ్బులను తీసుకుని, ఆ ప్లాట్లను క్రమబద్ధీకరిస్తున్నట్టే కదా..? మరి దీనిపై ప్రభుత్వం దగ్గర సమాధానం ఉందా..? అని కార్తీక్ రెడ్డి ప్రశ్నించారు. ఈ డ్రామాను చూస్తుంటే.. పదిహేను ఏండ్ల కింద వచ్చిన గ్లాడియేటర్ అనే సినిమా గుర్తుకు వచ్చింది. ఆ సినిమాలో కొందరు రోమ్ చక్రవర్తి వద్దకు వెళ్లి పరిస్థితులు బాగాలేవు. ఆకలి చావులు ఉన్నాయి. రోగాలతో లక్షలాది మంది చనిపోతున్నారు. పొరుగు దేశం వాళ్లు యుద్ధానికి వస్తున్నారు.. దీన్ని కాపాడాలని చెప్పినప్పుడు రోమ్ చక్రవర్తి మంచి సలహాల ఇస్తాడట. గ్లాడియేటర్ గేమ్స్ ఆడుదాం అన్నాడట. ఈ ఆట ద్వారా ప్రజల దృష్టిని మరల్చొచ్చు. గ్లాడియేటర్ ఆటలో అటెన్షన్ డైవర్ట్ చేయొచ్చని చెప్పాడట. అదే ఇవాళ కనిపిస్తుంది. తెలంగాణ గ్రామాల్లో పరిస్థితి ఘోరంగా ఉంది. ప్రజలు రుణమాఫీ, రైతుబంధు లాంటి సమస్యలు మర్చిపోవాలని గ్లాడియేటర్ గేమ్స్ ఆడుతున్నాడు. తెలంగాణలో ఉన్న బీజేపీ ఎంపీలు కాంగ్రెస్ పార్టీకి బీ టీంలాగా మాట్లాడుతున్నారు. రేవంత్ రెడ్డి హైడ్రా మీద శభాష్ అంటూ కితాబులు ఇస్తున్నారని పటోళ్ల కార్తీక్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు



## స్మగ్లర్లు అడవుల్లో అడుగుపెడితే..

# అదే వారికి చివరి రోజు

### ఏపీ సీఎం చంద్రబాబు హెచ్చరిక

**విశ్వంభర, అమరావతి :** ఏపీలో అడవులు నరికితే కఠిన చర్యలు తీసుకుంటామని స్మగ్లర్లను ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. అడవుల్లో అడుగుపెడితే అదే వారికి చివరిరోజు అవుతుంది. జాగ్రత్త అంటూ హెచ్చరించారు. వన మహోత్సవం కార్యాక్రమంలో భాగంగా శుక్రవారం మంగళగిరిలోని ఎకో పార్కులో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో కలిసి మొక్కలు నాటారు.ఇకపై స్మగ్లర్ల ఆటలు సాగనివ్వమని వెల్లడించారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో నదులు, చెరువులు, కొండలు ధ్వంసానికి గురయ్యాయని ఏపీ సీఎం చంద్రబాబు ఆరోపించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ పచ్చదనం ఆవశ్యకతను విద్యార్థులంతా గ్రహించాలని సూచించారు. మొక్కలు పెంచుతాం.. చెట్లు కొట్టనివ్వం .. ఇదే మా విధానమని ప్రకటించారు.రాబోయే రోజుల్లో రాష్ట్రంలో 50 శాతం పచ్చదనం పెరగాలని అన్నారు. మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఉద్యమంగా తీసుకెళ్తామని, భవిష్యత్‌లో విద్యుదుత్పత్తిలో కాలుష్యం ఉండబోదని తెలిపారు. పర్యావరణ సమతుత్యం కోసం అందరూ పాటుపడాలని , జీవ వైవిధ్యానికి మన రాష్ట్రం చిరునామా కావాలని పేర్కొన్నారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ వన మహోత్సవంలో కోటి మొక్కలు నాటుతామని, చెట్టు పెంచడాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని కోరారు. ఎక్కడ ఖాళీ స్థలం ఉన్నా అక్కడ మొక్కలు పెంచాలని కోరారు. కోనసీమలో కొబ్బరి చెట్టును పెద్దకొడుకుగా చూసుకుంటారని అన్నారు.

## గర్ల్స్ హాస్టల్‌లో సీక్రెట్ కెమెరాల ఉదంతంపై ఏపీ ప్రభుత్వం సీరియస్..

### చంద్రబాబు, నారా లోకేశ్ కీలక ఆదేశాలు

**విశ్వంభర, అమరావతి:** కృష్ణా జిల్లాలోని గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కాలేజీలో రహస్య కెమెరాలు ఉన్నాయని విద్యార్థులు చేపట్టిన ఆందోళన ఉద్రికత్తకు దారితీసింది. ఈ నేపథ్యంలో ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు విచారణకు ఆదేశించారు. హాస్టల్‌లో రహస్య కెమెరాలు ఉన్నాయనే విద్యార్థినుల ఆందోళనపై విచారణ జరపాలని ఆదేశించారు. తక్షణమే జిల్లా మంత్రి కొల్లు రవీంద్రతో పాటు జిల్లా కలెక్టర్, ఎస్పీలను ఘటనాస్థలికి వెళ్లాలని ఆదేశించారు. ఈ క్రమంలో దర్యాప్తును వేగవంతం చేసిన పోలీసులు ఘటనాస్థలికి వెళ్లి విద్యార్థుల స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. ఓ యవతి సహకారంతో వాష్‌రూమ్‌లో సీక్రెట్ కెమెరాలు పెట్టారని విద్యార్థులు వివరించారు. ఈ సందర్భంగా ఎస్పీ గంగాధర్ మీడియాతో మాట్లాడుతూ.. ఇంజనీరింగ్ కాలేజీలో ఘటన దురదృష్టకరమని అన్నారు. ఈ ఘటనపై విచారణ కొనసాగుతుందని తెలిపారు. అనుమానితుడి నుంచి ల్యాప్‌టాప్‌లు, ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. నేరానికి పాల్పడితే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ఇలాంటి ఘటనలు జరగకుండా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

**కఠిన చర్యలు తప్పవు : హోంమంత్రి అనిత**

గుడ్లవల్లేరు కాలేజీ ఘటనపై హోంమంత్రి అనిత తీవ్రంగా స్పందించారు. అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. దోషులు, బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

**వేధింపులు లేకుండా యాజమాన్యాలు చర్యలు తీసుకోవాలి : నారా లోకేశ్**

ఇంజనీరింగ్ కాలేజీలో విద్యార్థినుల ఆందోళనపై ఏపీ మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. హిడెన్ కెమెరాల ఆరోపణలపై విచారణకు ఆదేశించారు. విచారణలో తప్పు చేశారని తేలితే దోషులు, బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కాలేజీల్లో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా తచర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు ఆదేశాలిచ్చారు. కాలేజీలో ర్యాగింగ్, వేధింపులు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని యాజమాన్యాలకు సూచించారు.

## తిరుమలను హరిత ప్రాంతంగా తీర్చిదిద్దుతాం: టీటీడీ ఈవో

**తిరుమల:** తిరుమలలో పచ్చదనాన్ని పెంపొందించడమే టీటీడీ లక్ష్యమని టీటీడీ ఈవోజె శ్యామలరావు అన్నారు. తిరుమలను హరిత ప్రాంతంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. టీటీడీ అటవీ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన వన మహోత్సవంలో అడిషనల్ ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరితో కలిసి పద్మావతి విశ్రాంతి భవనంలో మొక్కను నాటారు.ఈ సందర్భంగా ఈవో మీడియాతో మాట్లాడుతూ.. టీటీడీ ఫారెస్ట్ పరిధిలో 2వేలు, రిజర్వ్ ఫారెస్ట్ ఏరియాలో మొత్తం రూ. 12 వేల మొక్కలు నాటనున్నట్లు తెలిపారు. తిరుమలలో 'సీడ్ బౌల్ కాన్సెప్ట్' అడ్వాన్స్ టెక్నాలజీతో ప్లాంటేషన్ కార్యక్రమం శాశ్వతంగా జరుపుతున్నామని వివరించారు. . టీటీడీకి భారీ ఆయుర్వేద కళాశాల, ఆసుపత్రి కూడా ఉండడం వల్ల ఈ సంస్థలకు అవసరమైన ఔషధ మొక్కలను పెంచేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపడుతామని వెల్లడించారు.టీటీడీ ఫారెస్ట్ పరిధిలోకి వచ్చే వందలాది మను సంపంగి , శాండల్‌వుడ్ , సీతా అశోకమొక్కలను నాటింది. ఈ కార్యక్రమంలో టీటీడీ డిప్యూటీ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ శ్రీనివాసులు, డీఈవోలు భాస్కర్, ఆశాజ్యోతి, హెల్త్ ఆఫీసర్ మధుసూదన్ ప్రసాద్, ఇతర అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.

# పర్యాటకులను ఆకట్టుకునేందుకు కొత్త పాలసీలు




(మొదటి పేజీ తరువాయి)

పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిష్టియానా, ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ డోబ్రియల్ తో పాటు వివిధ విభాగాల ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

**విడివిడిగా పాలసీలను రూపొందించాలని నిర్ణయం..**

టెంపుల్ టూరిజం, ఎకో టూరిజం, హెల్త్ టూరిజం అభివృద్ధికి విడివిడిగా పాలసీలను రూపొందించాలని నిర్ణయం తీసుకున్నారు. తెలంగాణలో ఉన్న ప్రాచీన ఆలయాలు, చారిత్రక స్థలాలతో పాటు అటవీ ప్రాంతాలు, వైద్య సదుపాయాలన్నింటినీ పర్యాటకులను ఆకట్టుకునేలా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. రవాణాతో పాటు వసతి, పర్యాటకులకు అవసరమైన అన్ని సదుపాయలు ఉండేలా కొత్త టూరిజం ప్యాకేజీలుండాలని చెప్పారు. కవ్వాల్, అమ్రాబాద్ అటవీ ప్రాంతాల్లో సఫారీలను ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని, కొన్ని చోట్ల రాత్రి విడిది ఉండే కాటేజీలను నిర్మించాలన్నారు. పర్యాటకానికి అనువైన ప్రాంతాలన్నీ గుర్తించి, వేటిని ముందుగా అభివృద్ధి చేయాలనేది టూరిజం, దేవాదాయ, అటవీ శాఖ అధికారులు కలిసికట్టుగా నిర్ణయించాలని చెప్పారు.

**నిర్మించి వదిలేస్తే సరిపోదు..**

కేవలం మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తే సరిపోదని, హరిత హోటళ్లు, వసతి గృహలు నిర్మించి వదిలేస్తే సరిపోదని, నిరంతరం వీటి నిర్వహణ మెరుగ్గా ఉంటేనే పర్యాటకులను ఆకర్షిస్తాయని సీఎం అధికారులను అప్రమత్తం చేశారు. అందుకే కొత్తగా చేపట్టే ప్రాజెక్టులన్నింటినీ ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంతో చేపట్టాలని సూచించారు. అటు ఉద్యోగాల కల్పనతో పాటు రాష్ట్ర అభివృద్ధికి ఉపయోగపడేలా టూరిజం అభివృద్ధి జరగాలని సీఎం స్పష్టం చేశారు.

**వెయ్యి ఎకరాల విస్తీర్ణంలో కొత్త జూ పార్క్..**

హైదరాబాద్ బయట దాదాపు వెయ్యి ఎకరాల విస్తీర్ణంలో కొత్త జూ పార్క్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. వివిధ ప్రాంతాల నుంచి జంతువులు, పక్షులను తీసుకువచ్చి కొత్త జూ పార్క్ లో ఉంచాలని, అర్బన్ ఫారెస్టీని అభివృద్ధి చేయాలని చెప్పారు. జామ్ నగర్ లో అనంత్ అంబానీ 3 వేల ఎకరాల్లో వనతార వన్యప్రాణి సంరక్షణ కేంద్రాన్ని నెలకొల్పిన విషయాన్ని ప్రస్తావించారు. అలా ముందుకు వచ్చే పారిశ్రామిక వేత్తలు, సంస్థలను కూడా ఆహ్వానించాలని ముఖ్యమంత్రి చెప్పారు.

**200 ఎకరాల ప్రభుత్వ భూములను హెల్త్ టూరిజం అభివృద్ధికి వినియోగించాలి..**

అనంతగిరి ప్రాంతంలో అద్భుతమైన ప్రకృతి అటవీ సంపద ఉందని, అక్కడున్న 200 ఎకరాల ప్రభుత్వ భూములను హెల్త్ టూరిజం అభివృద్ధికి వినియోగించాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. బెంగుళూరులోని జిందాల్ నేచర్ క్యూర్ ఇన్స్టిట్యూట్ తరహాలో నేచర్ వెల్ నెస్ సెంటర్ అక్కడ ఏర్పాటు చేయాలని చ ర్చించా రు. వెల్ నెస్ సెంటర్ ఏర్పాటుకు జిందాల్ ప్రతినిధులు ఆసక్తిగా ఉంటే సంప్రదింపులు జరపాలని, ప్రకృతి వైద్య రంగంలో పేరొందిన ప్రముఖ సంస్థలను ఆహ్వానించాలని అధికారులకు సూచించారు.

**టీటీడీ తరహాలో యాదగిరిగుట్ట టెంపుల్ బోర్డు...**

తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు తరహాలో యాదగిరిగుట్ట టెంపుల్ బోర్డు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. అచ్చంగా టీటీడీ అనుసరించిన తరహాలోనే బోర్డుకు స్వయం ప్రతిపత్తి, విధి విధానాలు ఉండేలా అవసరమైతే చట్ట సవరణ చేయాలని ఆదేశించారు. యాదగిరిగుట్ట ఆలయ రాజ గోపురానికి బంగారు తాపడం పనులను ప్రారంభించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. యాదగిరిగుట్ట ఆలయ అభివృద్ధి పనులు చాలావరకు అర్థంతరంగా ఉన్నాయని సీఎం అభిప్రాయపడ్డారు. అలా ఆగిపోవడానికి వీల్లేదని, ఇప్పటివరకు ఏమేం అభివృద్ధి పనులు జరిగాయి.. ఇంకా ఏమేం అసంపూర్తిగా ఉన్నాయనే వివరాలతో వారం రోజుల్లో సమగ్ర నివేదికను అందించాలని ఆదేశించారు. అక్కడికి వచ్చే భక్తుల సౌకర్యాలు, విడిది చేసేందుకు కాటేజీలు నిర్మాణాలకు దాతలు, కార్పొరేట్ సంస్థల సహకారం తీసుకోవాలన్నారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని అద్భుతంగా యాదగిరిగుట్టను తీర్చిదిద్దాలని చెప్పారు. ప్రస్తుతం కీసర గుట్టపై ఉన్న రామలింగేశ్వర ఆలయాన్ని అద్భుతంగా పునర్నిర్మించాలని ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకున్నారు. ములుగు జిల్లాలోని రామప్ప ఆలయానికి ప్రతిరూపంగా.. అచ్చం అదే నమూనాతో కీసరగుట్ట ఆలయాన్ని నిర్మించాలని చెప్పారు. అక్కడ ఉపయోగించిన శ్యాండ్ బాక్స్ టెక్నాలజీ జోలికి వెళ్లవద్దని.. ఇప్పుడున్న అధునాతన టెక్నాలజీతో రామప్ప ఆలయ ఆకృతిలో యథాతథంగా కీసర ఆలయం పునర్మిర్మాణం చేపట్టాలని సూచించారు.

**హెల్త్ సిటీలో హెల్త్ టూరిజంను అభివృద్ధి చేయాలి..**

హైదరాబాద్ ఫోర్త్ సిటీలో వెయ్యి ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్న హెల్త్ సిటీలో హెల్త్ టూరిజంను అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఇక్కడ తమ సెంటర్లు నెలకొల్పేందుకు ముందుకు వచ్చే సంస్థలకు ప్రభుత్వం తగిన ప్రోత్సాహకాలు ఉండేలా కొత్త పాలసీ తయారు చేయాలని చెప్పారు. వివిధ దేశాల నుంచి వచ్చే వారికి వైద్య సేవలందించే వన్ స్టాప్ సొల్యూషన్ ప్యాకేజీలు రూపొందించాలని చెప్పారు. ఆన్ లైన్ లోనే అన్ని సేవల వివరాలను అందుబాటులో ఉంచాలని, నేరుగా ఎయిర్ పోర్ట్ నుంచి హాస్పిటల్ కు వెళ్లి, డాక్టర్ల అపాయింట్ మెంట్, ట్రీట్మెంట్ తీసుకునేలా సదుపాయాలన్నీ ఉండాలని సూచించారు. దేశంలోనే అందరి దృష్టిని ఆకర్షించేలా హైదరాబాద్ ను మెడికల్ టూరిజం హబ్ గా తీర్చిదిద్దాలని అన్నారు.




# అసలేం జరుగుతుంది?

- చెత్తాచెదారాన్ని చూసి మున్సిపల్ పీఎస్ ఆగ్రహం
- శానిటేషన్ పై అశ్రద్ధ వహిస్తే కఠిన చర్యలే
- జల్ పల్లి మున్సిపాల్టీలో మున్సిపల్ పీఎస్ పర్యటన
- గుర్రం చెరువు సీసీ రోడ్డును వెంటనే పూర్తి చేయాలని ఆదేశం

**విశ్వంభర హైదరాబాద్:** గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని చార్మినార్ జోన్ లో శుక్రవారం ఆకస్మికంగా పర్యటించిన మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిషోర్ అధికారులపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్ని సార్లు చెప్పినా శానిటేషన్ పనులపై నిర్లక్ష్యంగా వ్యవహారిస్తున్నారంటూ సౌత్ జోన్ జోనల్ కమిషనర్ వెంకన్న, చాంద్రాణగుట్ట డిప్యూటీ కమిషనర్ సురేందర్ పై వాట్ హ్యాపెన్నింగ్ అంటూ తీవ్ర స్థాయిలో అసహనాన్ని వ్యక్తం చేశారు. వర్షాకాల నేపథ్యంలో శానిటేషన్, దోమల నివారణ వంటి విధులపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిషోర్ అధికారులకు అల్టిమేటం జారీ చేశారు. శుక్రవారం జల్ పల్లి మున్సిపాల్టీ పరిధిలో హెచ్ఎండీఏ నిధులు దాదాపు రూ. కోటి 25 లక్షలతో గార్డెన్ ఫంక్షన్ హాల్ నుంచి గుర్రం చెరువు వరకు నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలను ఖచ్చితంగా పాటిస్తూ వీలైనంత త్వరగా పనులు పూర్తిచేయాలని మున్సిపల్ కమిషనర్ వాణి, ఉప కార్యనిర్వహక ఇంజనీర్ వెంకన్న లకు సూచించారు. అనంతరం చాంద్రాయణ గుట్ట జోనల్ పరిధి గుర్రం చెరువు రోడ్డు ను ప్రిన్సిపల్ సెక్రటరీ పశీలించారు. ఇక్కడ ఇష్టారాజ్యంగా పడి ఉన్న ఇరిగేషన్ విభాగానికి చెందిన పైప్ లను, నిరుపయోగంగా ఉన్న మురుగుదొడ్లను పరిశీలించారు. వాటిని వెంటనే తొలగించాలని సౌత్ జోన్ జోనల్ కమిషనర్ వెంకన్న, ద్రాయణగుట్ట డిప్యూటి కమిషనర్ సురేందర్ లను అదేశించారు. చెత్త చెదారం , వ్యర్థాలు ఉండడంతో ముఖ్య కార్యదర్శి అధికారుల పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే రోడ్డు గుండా ఎంతో ప్రాముఖ్యత ఉన్న బాలాపూర్ గణేష్ డి నిమజ్జన ఊరేగింపు జరగనుండగా పారిశుద్ధ్యం, పరిశుభ్రత పై ఇంత నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదన్నారు. రెండు రోజుల్లోగా బాలా పూర్ ఎక్స్ రోడ్డు నుండి డీఆర్డీఓ వెళ్లే రోడ్డు మార్గం తో పాటు బాలాపూర్ గణేష్ డి నిమజ్జన ఊరేగింపు మార్గంలో పారిశుద్ధ్యం, పరిశుభ్రత నెలకొనేలా చూడాలన్నారు. ఈ మార్గంలో పెండింగ్ లోనున్న సీసీ, బిటి రోడ్డు నిర్మాణ పనులను మిషన్ మోడ్ లో చేపట్టి పూర్తి చేయాలన్నారు. శాశ్వత వీధి దీపాలను ఏర్పాటు చేయాలన్నారు. నిమజ్జన ఊరేగింపు సజావుగా జరిగేలా అవసరమైన ఏర్పాట్లను సంబంధిత మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలించాలని డీసీపీ సునీత కు సూచించారు.



## భారత న్యాయవ్యవస్థపై నాకు అత్యంత విశ్వాసం ఉంది

**విశ్వంభర ,తెలంగాణ బ్యూరో**

భారత న్యాయవ్యవస్థపై తనకు అత్యంత విశ్వాసం ఉందని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు.ఢిల్లీ మద్యం కేసులో భారాస ఎమ్మెల్సీ కవితకు మంజూరైన బెయిల్‌కు సంబంధించి ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. దీనిపై స్పందించిన రేవంత్.. శుక్రవారం 'ఎక్స్' వేదికగా పోస్టు పెట్టారు. ''నా వ్యాఖ్యలు న్యాయవ్యవస్థను ప్రశ్నిస్తున్నట్లుగా కొందరు ఆపాదించారు. పత్రికల్లో వచ్చిన వార్తలపై బేషరతుగా విచారం వ్యక్తం చేస్తున్నా. న్యాయవ్యవస్థ, దాని స్వతంత్రత పట్ల నాకు అపార గౌరవం, విశ్వాసం ఉన్నాయి. రాజ్యాంగం, దాని విలువలను విశ్వసించే నేను.. ఎన్నటికీ న్యాయవ్యవస్థను అత్యున్నతమైనదిగా భావిస్తూనే ఉంటా'' అని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.ఢిల్లీ మద్యం కేసులో భారాస ఎమ్మెల్సీ కవితకు మంజూరైన బెయిల్‌కు సంబంధించి సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. 'ముఖ్యమంత్రి ప్రకటనలను ఈ రోజు పత్రికల్లో చదివాం. బాధ్యతాయుతమైన ముఖ్యమంత్రి చేయాల్సిన వ్యాఖ్యలేనా అవి? మేం రాజకీయపార్టీలను సంప్రదించో.. లేక రాజకీయాంశాల ఆధారంగానో ఉత్తర్వులిస్తామా?' అని ధర్మాసనం తీవ్రంగా ప్రశ్నించింది. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి తన వ్యాఖ్యలపై తాజాగా స్పష్టతనిచ్చారు.

## నోటీసులు లేకుండా పేదల ఇళ్లు కూల్చడమేంటి?

### మాజీ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్

**విశ్వంభర ,తెలంగాణ బ్యూరో :** సీఎం రేవంత్‌రెడ్డి సొంత జిల్లాలో పేదలు, దివ్యాంగుల ఇళ్లు కూల్చడమేంటని అధికారులను మాజీ మంత్రి, భారాస నేత శ్రీనివాస్‌గౌడ్ ప్రశ్నించారు. నోటీసులు లేకుండా ఎలా కూలుస్తారని నిలదీశారు. తెలంగాణ భవన్‌లో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ''డబ్బు ఉన్న వాళ్లకు ఎన్ని నోటీసులైనా ఇస్తారు కదా? దివ్యాంగులకు సంబంధించిన ఇళ్లను ఎందుకు కూల్చారు? వాళ్లపై మీ ప్రతాపమా?పేదలు, ధనికులకు న్యాయం ఒకవిధంగా ఉండదా? ఇదేనా కాంగ్రెస్ మార్పు పాలన? బాధితులకు ఇళ్లు కట్టించి ఇవ్వాలి. లేదంటే కచ్చితంగా న్యాయపోరాటం చేస్తాను. దీనిపై మానవ హక్కుల సంఘం సుమోటోగా కేసు నమోదు చేయాలి'' అని శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు.




# తెలంగాణ ఇంటర్ ఫస్టియర్ ప్రవేశాలకు మరోమారు గడువు పెంపు

**విశ్వంభర ,తెలంగాణ బ్యూరో :**

రాష్ట్రంలోని జూనియర్ కాలేజీల్లో 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి ప్రవేశాలకు ఇంటర్మీడియట్ బోర్డు మరోసారి గడువు పొడిగిస్తూ శుక్రవారం ప్రకటన వెలువరించింది. ఇప్పటివకే పలుమార్లు ప్రవేశాల గడువు పొడిగించిన ఇంటర్ బోర్డు.. తాజాగా సెప్టెంబర్ 7వ తేదీ వరకు ఇంటర్ ఫస్టియర్‌లో ప్రవేశాలకు గడువు పొడిగించినట్లు ప్రకటించింది. ఇదే చివరి అవకాశమని, అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని అధికారులు తెలిపారు. ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో ప్రవేశం పొందాలనుకునే విద్యార్థులు ఇంటర్‌నెట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న పదో తరగతి మార్క్స్ మెమో, ఆధార్ కార్డు తప్పనిసరిగా దరఖాస్తుకు జతపరచాల్సి ఉంటుంది. ప్రొవిజినల్ అడ్మిషన్ పూర్తయ్యాక.. తప్పనిసరిగా ఒరిజినల్ మెమోతో పాటు టీసీ సమర్పించాల్సి ఉంటుంది. ఇప్పటికే ఇంటర్మీడియట్ బోర్డు గుర్తింపు పొందిన జూనియర్ కాలేజీల జాబితాను ఇంటర్మీడియట్ వెబ్‌సైట్‌లో పొందుపరిచిన సంగతి తెలిసిందే. ఆ జాబితా ఆధారంగా విద్యార్థులు అడ్మిషన్లు పొందొచ్చు.

**టీజీ పీఈసెట్ 2024 సెకండ్ ఫేజ్ షెడ్యూల్ విడుదల..**

రాష్ట్రంలోని ఫిజికల్ ఎడ్యుకేషన్ కాలేజీల్లో ప్రవేశాల ప్రక్రియకు కౌన్సెలింగ్ కొనసాగుతోంది. టీజీ పీఈసెట్ -2024 ప్రవేశాలకు సంబంధించి ఇప్పటికే ఫస్ట్ ఫేజ్ కౌన్సెలింగ్ పూర్తికాగా.. సెకండ్, ఫైనల్ ఫేజ్ షెడ్యూల్ తాజాగా విడుదలైంది. బీపీఈడీ, యూజీ డీపీఈడీ కోర్సుల్లో చేరాలనుకునే అభ్యర్థులు ఆగస్టు 31వ తేదీ నుంచి సెప్టెంబర్ 3వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవల్సి ఉంటుంది. ఈ తేదీల్లోనే సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కూడా జరుగుతుంది. వెబ్ ఆప్షన్లకు అర్హత సాధించిన అభ్యర్థుల జాబితాను సెప్టెంబర్ 3వ తేదీన ప్రకటిస్తారు. సెప్టెంబర్ 4, 5 తేదీల్లో వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవచ్చు. సెప్టెంబర్ 6వ తేదీన వెబ్ ఆప్షన్లను ఎడిట్‌కు అవకాశం ఇస్తారు. సెప్టెంబర్ 8న సీట్ల కేటాయింపు ఉంటుంది. సెకండ్ ఫేజ్‌లో సీట్లు పొందిన అభ్యర్థులు అలాట్‌మెంట్ ఆర్డర్, ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకుని సీట్లు పొందిన కాలేజీల్లో సెప్టెంబర్ 9 నుంచి 12వ తేదీలోపు రిపోర్టు చేయాలని పేర్కొంది

**తెలంగాణలో ఇంజినీరింగ్‌లో ప్రవేశాలకు స్పాట్ అడ్మిషన్లు ప్రారంభం...**

తెలంగాణ ఈఏపీసెట్)2024 ఉత్తీర్ణత కాకున్నా స్పాట్ అడ్మిషన్ల ద్వారా బీటెక్ కోర్సుల్లో చేరేందుకు ఆగస్టు 30 నుంచి సెప్టెంబరు 2వ తేదీ వరకు రాష్ట్రంలోని యూనివర్సిటీలు/ప్రభుత్వ ఇంజినీరింగ్ కాలేజీల్లో మిగిలిన సీట్లకు ప్రవేశాలు కల్పిస్తున్నారు. మొదట కౌన్సెలింగ్‌కు వచ్చిన అభ్యర్థులకు మాత్రమే ప్రాధాన్యం ఉంటుంది. అయితే ఈఏపీసెట్‌లో ఉత్తీర్ణత కానివారికి ఫీజు రీయింబర్స్‌మెంట్ రాదు. మొత్తం రుసుము అభ్యర్థులే చెల్లించుకోవాలి. హైదరాబాద్ జేఎన్‌టీయూ, ఉస్మానియా ఇంజినీరింగ్ కళాశాల, కోస్గి ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలతో పాటు, ప్రైవేటు కాలేజీల్లో మిగిలి ఉన్న సీట్లను స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నారు.



## యూఎస్ ఓపెన్ అల్కరాజ్కు షాక్.. వరల్డ్ 74వ ర్యాంకర్ చేతిలో ఓటమి



**విశ్వంభర (క్రీడా విభాగం):** టెన్నిస్ టాప్ ప్లేయర్ కార్లోస్ అల్కరాజ్కు యూఎస్ ఓపెన్లో చుక్కెదురైంది. ఇటీవలే ఒలింపిక్స్లో రజత పతకం సాధించిన ఈ స్పెయిన్ ఆటగాడు యూఎస్ ఓపెన్ నుంచి ఔటయ్యాడు. రెండో రౌండ్లో నెదర్లాండ్స్ టెన్నిస్ ప్లేయర్ బోటిక్ వాని చేతిలో అల్కరాజ్ ఓడిపోయాడు. ప్రపంచ నంబర్ 74వ ర్యాంకర్ అయిన బోటిక్ 6-1, 7-5, 6-4 వరుస సెట్లతో అల్కరాజ్ను మట్టి కరిపించాడు. దాదాపు 2 గంటల 19 నిమిషాల్లోనే బోటిక్ విజయం సాధించాడు. దీంతో ఒకే సీజన్లో ఫ్రెంచ్ ఓపెన్, వింబుల్డన్, యూఎస్ ఓపెన్ విజేతగా నిలిచే అవకాశాన్ని అల్కరాజ్ కోల్పోయాడు. ప్రస్తుతం అల్కరాజ్ ప్రపంచంలోనే మూడో ర్యాంకర్.

**నవోమి ఒసాకా ఓటమి...**

యూఎస్ ఓపెన్లో సంచలనాలు నమోదవుతున్నాయి. పురుషుల విభాగంలో అల్కరాజ్ ఓడిపోగా.. మహిళా టెన్నిస్ స్టార్ నవోమి ఒసాకా కూడా పరాజయం చవిచూసింది. రెండుసార్లు ఛాంపియన్ అయిన ఒసాకాను చెక్ రిపబ్లిక కు చెందిన కరోలినా ముచోవ 6-3, 7-6 (7/5) తేడాతో ఒసాకాపై విజయం సాధించింది. తొలి సెట్ను త్వరగానే కోల్పోయిన ఒసాకా.. రెండో సెట్లో మాత్రం తీవ్రంగా పోరాడింది. కానీ, కరోలినా కీలక సమయంలో బ్రేక్ సాధించి ముందడుగు వేసింది.

## ప్రీతి పాల్ సంచలనం.. కాంస్యంతో చరిత్ర తిరగరాసింది




**విశ్వంభర (క్రీడా విభాగం):** పారిలింపిక్స్లో భారత క్రీడాకారులు పతకాల వేట కొనసాగిస్తున్నారు. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో పారా షూటర్లు అవనీ లేఖరా పసిడితో గర్జించగా మోనా అగర్వాల్ కంచు మోత మోగించింది. వీళ్ల స్ఫూర్తితో అథ్లెట్ ప్రీతి పాల్ సంచలనం సృష్టించింది. ట్రాక్ విభాగంలో దేశానికి తొలి పతకం సాధించి పెట్టింది.శుక్రవారం జరిగిన మహిళల 100 మీటర్ల టీ35 ఫైనల్లో ప్రీతి కాంస్యం పతకం కొల్లగొట్టింది. దాంతో, పారిస్ పారిలింపిక్స్లో భారత్ ఖాతాలో మూడో పతకం చేరింది. 100 మీటర్ల ఫైనల్లో ప్రీతి చిరుతలా పరుగెత్తింది. 14.21 సెకన్లలో లక్ష్యాన్ని చేరుకున్న ఆమె మూడో స్థానంతో కాంస్యం ముద్దాడింది.






## అదరగొట్టిన అమ్మాయిలు

- పారాలింపిక్స్ షూటింగ్లో అవనికి గోల్డ్, మోనాకు కాంస్యం

**పారిస్:** పారిస్ వేదికగా జరుగుతున్న పారిలింపిక్స్లో భారత షూటర్లు పతక గర్జన చేశారు. మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఫైనల్లో అవనీ లేఖరా పసిడి పతకం కొల్లగొట్టింది. రికార్డు స్కోర్తో చరిత్ర సృష్టించిన ఆమె దేశానికి తొలి పతకం అందించింది. టోక్యో పారిలింపిక్స్లోనూ స్వర్ణం సాధించిన ఆమెకు ఇది రెండో గోల్డ్ మెడల్. ఇక ఇదే పోటీల్లో భారత పారా షూటర్ మోనా అగర్వాల్ కాంస్య పతకంతో మెరిసింది.పారాలింపిక్స్లో భారత్ స్వర్ణంతో పతకాల ఖాతా తెరిచింది. అది కూడా షూటర్ల తరఫున దేశం తొలి పతకం అందుకుంది. శుక్రవారం జరిగిన మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ క్వాలిఫికేషన్ రౌండ్లో అవని లెఖారా, మోనాల గురి అదిరింది. అవని రెండో స్థానంలో నిలువగా, మోనా అగర్వాల్ ఐదోస్థానం సాధించింది. దాంతో ఇద్దరూ ఫైనల్లోకి దూసుకెళ్లారు.

## విండీస్ కెప్టెన్గా మాథ్యూస్



**విశ్వంభర (క్రీడా విభాగం):** మహిళల టీ20 ప్రపంచ కప్ వేదిక ఖరారు కావడంతో అన్ని దేశాలు స్క్వాడ్ను ప్రకటిస్తున్నాయి. ఇప్పటికే భారత్, పాకిస్థాన్, ఇంగ్లండ్, ఆస్ట్రేలియాలు తమ వరల్డ్ కప్ బృందాన్ని వెల్లడించాయి. తాజాగా వెస్టిండీస్ క్రికెట్ బోర్డు సైతం పొట్టి వరల్డ్ కప్ కోసం 15 మందితో కూడిన సైన్యాన్ని ప్రకటించింది. వెటరన్ ఆల్రౌండర్ హీలీ మాథ్యూస్ కెప్టెన్గా ఎంపికవ్వగా.. ఈమధ్యే వీడ్కోలు నిర్ణయం వెనక్కి తీసుకున్న డియోండ్ర డాటిన్కు సెలెక్టర్లు అవకాశమిచ్చారు.ఈసారి అనుభవజ్ఞులతో, యువరక్తంతో కలగలసిన బృందాన్ని ఎంపిక చేశామని విండీస్ క్రికెట్ అధ్యక్షుడు కిశోర్ షాల్లో తెలిపాడు. 'వరల్డ్ కప్ కోసం అనుభవజ్ఞులైన సీనియర్లతో పాటు యువకెరటాలను ఎంపిక చేశాం. స్క్వాడ్లో కొందరి వయసు 19 ఏండ్లు మాత్రమే. అందుకని పటిష్ఠమైన స్క్వాడ్ను సెలెక్ట్ చేసినందుకు చాలా సంతోషంగా ఉన్నాను' అని వెల్లడించాడు.

## బంగ్లాదేశ్ను తక్కువగా అంచనా వేయొద్దు

**రోహిత్ను హెచ్చరించిన భజ్జీ, రైనా**

**విశ్వంభర (క్రీడా విభాగం):** సెప్టెంబరులో భారత్-బంగ్లాదేశ్ జట్ల మధ్య రెండు టెస్టుల సిరీస్ జరగనుంది. ఈ క్రమంలో కెప్టెన్ రోహిత్ శర్మను మాజీ క్రికెటర్లు సున్నితంగా హెచ్చరించారు. టెస్ట్ సిరీస్లో బంగ్లా ఆటగాళ్లు భారత్ ను దెబ్బతీసే అవకాశం ఉందని.. వారిని తక్కువగా అంచనా వేయడానికి లేదని మాజీ ఆటగాళ్లు సురేశ్ రైనా, హర్భజన్ సింగ్ వ్యాఖ్యానించారు."ఎన్ని రాజకీయ గందరగోళాలు ఉన్నప్పటికీ బంగ్లాదేశ్ తమ ఆత్మవిశ్వాసాన్ని మాత్రం కోల్పోదు. గతవారం రావల్పిండిలో జరిగిన తొలి టెస్టోనే పాకిస్థాన్పై సంచలన విజయాన్ని నమోదు చేసింది. భారత అగ్రశ్రేణి ఆటగాళ్లు దులీప్ ట్రోఫీని ఆడటం బీసీసీఐ తీసుకున్న ఒక మంచి నిర్ణయం. సుదీర్ఘ ఫార్మాట్లో క్రికెట్ ఆడినప్పుడు మీకు చాలా విషయాలు తెలుస్తాయి. బంగ్లాదేశ్ను తేలికగా తీసుకునే అవకాశమే లేదు. ఎందుకంటే వారికి స్పిన్నర్లతో పాటు ఎంతోకాలం నుంచి మంచి ప్రదర్శనలు ఇస్తున్న అనుభవం కలిగిన ఆటగాళ్లు ఉన్నారు. ఆస్ట్రేలియా పర్యటనకు ఈ సిరీస్ చక్కటి మ్యాచ్ ప్రాక్టీస్ అవుతుంది" అని రైనా అనడంతో దానిని హర్భజన్ కూడా సమర్థించాడు. కాగా, బంగ్లాదేశ్తో జరిగే రెండు టెస్టులకు చెన్నై, కాన్పూర్ వేదికలు కానున్నాయి. ఇక్కడ పిచ్ సాధారణంగా స్పిన్నర్లకు అనుకూలంగా ఉంటుంది. బంగ్లాదేశ్లో లో అద్భుత ప్రదర్శనలు ఇచ్చే స్పిన్నర్లు ఉన్నారు.



దాంతో ఇది ఆసక్తికరమైన సిరీస్ గా మారే అవకాశం ఉంది. అక్టోబర్ 16 నుంచి నవంబర్ 5 వరకు న్యూజిలాండ్ తో మూడు టెస్టుల సిరీస్ జరగనుంది.

---

### కంపెనీలు ఒకదానికొకటి

## మద్దతుగా నిలవాలి

**పీయూశ్ గోయల్**

**ఢిల్లీ:** భారతదేశ కంపెనీలు ఒకదాని వస్తువులు మరొకటి కొనుగోలు చేస్తూ మద్దతుగా నిలవాలని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూశ్ గోయల్ పేర్కొన్నారు. దీని వల్ల కరోనా మహమ్మారి వంటి అవాంతరాలను ఎదుర్కోవచ్చన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన వ్యాపారవేత్తలను ఉద్దేశించి మాట్లాడారు. భారతదేశాన్ని బ్రాండ్గా మార్చేందుకు కంపెనీలు ఒకదానికొకటి సహకరించుకోవాలన్నారు. పరిశ్రమలు అంతర్జాతీయ వ్యాపారవేత్తలతో పాటు ఒకరికొకరు భాగస్వాములవ్వాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. దేశంలో ఇటీవల ఆమోదించిన 12 పారిశ్రామిక టౌన్షిప్లో వ్యాపార అవకాశాలను పరిశీలించాలని ఇండియా ఇంక్కు సూచించారు. 2047 నాటికి దేశ అభివృద్ధిలో తయారీ రంగం కీలక పాత్ర పోషిస్తుందన్నారు. అయితే గత 20 ఏళ్లుగా తయారీ రంగం 15- 20 శాతం జీడీపీ వృద్ధి రేటు మాత్రమే కలిగి ఉందన్నారు. దేశ జీడీపీ పెరుగుతున్నప్పటికీ.. తయారీ రంగం అదే స్థాయిలో ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ఒక కోణంలో ఆ స్థాయిని నిలబెట్టుకోవడం మంచిదే అయినప్పటికీ.. 1.4 బిలియన్ల జనాభా కలిగిన దేశం, ప్రతిభ, నైపుణ్యాలతో కళాశాలల నుంచి బయటకు వచ్చే యువతీ, యువకులకు దేశం చాలా ఇవ్వగలదని తాను భావిస్తున్నట్లు గోయల్ వెల్లడించారు.




## మరోసారి రికార్డ్ గరిష్ఠాలకు సూచీలు

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం మరో జీవిత కాల రికార్డు నమోదు చేశాయి. అన్ని సెక్టార్ల షేర్లకు ఇన్వెస్టర్ల నుంచి కొనుగోలు మద్దతు లభించడంతో బీఎస్ఈ ఇండెక్స్ సెన్సెక్స్ 231.16 పాయింట్ల లబ్ధితో 82,365.77 పాయింట్ల వద్ద ముగిసింది. ఇంట్రాడే ట్రేడింగ్ లో సెన్సెక్స్ 82,637.03 పాయింట్ల ఆల్ టైం గరిష్ఠ స్థాయికి దూసుకెళ్లింది. బీఎస్ఈ బాటలోనే ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ సైతం ఇంట్రాడే ట్రేడింగ్ లో 25,268.35 పాయింట్ల ఆల్ టైం గరిష్ట స్థాయికి దూసుకెళ్లి, మార్కెట్ల ట్రేడింగ్ ముగిసే సమయానికి 83.95 పాయింట్ల లాభంతో 25,235.90 పాయింట్ల వద్ద స్థిర పడింది. నిఫ్టీ-50లో 41 స్టాక్స్ లాభాలతో ముగిశాయి. సిప్లా, బజాజ్ ఫైనాన్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, దివిస్ ల్యాబ్స్, ఎన్టీపీసీ తదితర షేర్లు 2.23 శాతం లాభ పడ్డాయి. మరోవైపు బీఎస్ఈ-30 ఇండెక్సులో 21 స్టాక్స్ వృద్ధి చెందాయి. వాటిలో బజాజ్ ఫైనాన్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, భారతీ ఎయిర్ టెల్, ఎన్టీపీసీ లాభ పడ్డాయి. కానీ నిఫ్టీ మిడ్ క్యాప్, స్మాల్ క్యాప్ రెండో సెషన్ లోనూ నష్టపోయాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ 0.68 శాతం, స్మాల్ క్యాప్ 0.48 శాతం నష్టపోయాయి. బుల్ పరుగులతో నిఫ్టీ ఐటీ 0.46 శాతం, ఫార్మా ఇండెక్సు 1.48 శాతం లబ్ధితో రికార్డు గరిష్టానికి చేరాయి. బ్యాంకు నిఫ్టీ, నిఫ్టీ పీఎస్యూ బ్యాంకు, నిఫ్టీ ఆటో ఇండెక్స్ రెండో రోజు వరుసగా లాభ పడ్డాయి. నిఫ్టీ రియాల్టీ రెండు సెషన్ల నష్టాలను బ్రేక్ చేసింది. ప్రిస్టేజ్, ఫోనిక్స్ మిల్స్, ఒబెరాయి రియాల్టీ 1.83 శాతం లబ్ధితో దూసుకెళ్లాయి. ఇక ఫారెక్స్ మార్కెట్లో అమెరికా డాలర్ మీద రూపాయి మారకం విలువ 83.8725 వద్ద ముగిసింది. మరోవైపు, శుక్రవారం పేటీఎం షేర్ ఇంట్రాడేలో ఆరు నెలల గరిష్ఠ స్థాయి రూ.631లకు చేరుకుంది. ట్రేడింగ్ ముగిసే నాటికి ఎన్ఎస్ఈలో పేటీఎం షేర్ 12.70 శాతం లాభంతో రూ.624.90 వద్ద స్థిర పడింది. ఆర్బీఐ ఆంక్షల నేపథ్యంలో ఈ ఏడాది తొమ్మిదో తేదీన పేటీఎం షేర్ 52 వారాల కనిష్ఠ స్థాయి రూ. 310లకు పతనమైంది. పేటీఎం పేమెంట్ సర్వీసెస్ లిమిటెడ్ లో పెట్టుబడులకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో శుక్రవారం పేటీఎం షేర్ పుంజుకున్నది.



## టెక్ కంపెనీల్లో ఆగని కొలువుల కోత

### ఆగస్టులోనూ వందలాది ఉద్యోగులపై వేటు

**విశ్వంభర (బిజినెస్):** టెక్ కంపెనీల్లో లేఆఫ్‌లు కొనసాగుతుండటంతో టెకీల్లో గుబులు రేపుతోంది. యాపిల్, మైక్రోసాఫ్ట్, గూగుల్ సహా పలు టెక్ దిగ్గజాలు 2024లోనూ లేఆఫ్స్‌ను కొనసాగిస్తున్నాయి. వ్యయ నియంత్రణ చర్యలు, ఏఐపై ఫోకస్, కొవిడ్ అనంతరం మార్కెట్ సర్దుబాట్ల కారణంగా కంపెనీలు కొలువుల కోతకు తెగబడుతున్నాయి. ఇక ఈ ఏడాది ఆగస్ట్ నాటికి లేఆఫ్స్ కారణంగా ఏకంగా 1,36,000 మంది కొలువులు కోల్పోవడం ఆందోళన రేకెత్తిస్తోంది.2022, 2023లో టెక్ కంపెనీలు గణనీయంగా సిబ్బంది సంఖ్యను కుదిస్తే ఈ ఏడాది సైతం కొలువుల కోత తప్పడం లేదు. లేఆఫ్స్ ట్రాకర్ లేఆఫ్స్.ఎఫ్‌వైఐ డేటా ప్రకారం ఆగస్ట్ 30 నాటికి 422 కంపెనీలు 1,36,782 మంది ఉద్యోగులను విధుల నుంచి తొలగించాయి. ఆగస్ట్ నెలలో వందలాది ఉద్యోగులపై టెక్ కంపెనీలు వేటు వేశాయి. ఇక ఈ ఏడాది యాపిల్ సహా గొప్రొ, సోనోస్, సిస్కో, డెల్, ఇంటెల్, మైక్రోసాఫ్ట్ గూగుల్ సహా పలు టెక్ కంపెనీలు ఉద్యోగుల కుదింపును ప్రకటించాయి. ఇక వ్యయ నియంత్రణ చర్యలు, ఏఐపై దృష్టి మళ్లింపు, పునర్వ్యవస్థీకరణ ప్రణాళికలతో టెక్ కంపెనీలు ఉద్యోగుల సంఖ్యను తగ్గించే దిశగా చర్యలు చేపట్టడంతో ఈ ఏడాదిలోనూ లేఆఫ్స్ కొనసాగుతున్నాయి. కొలువుల కోత కొనసాగడంతో పాటు క్యాంపస్ రిక్రూట్‌మెంట్లు తగ్గడంతో ఫ్రెషర్లు ఆందోళన చెందుతున్నారు. క్యాంపస్ ప్లేస్‌మెంట్లు కళ తప్పడం ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లను కలవరపరుస్తోంది.

## సెప్టెంబర్ 1 నుంచి తగ్గనున్న గ్యాస్ సిలిండర్ ధర..!

**ఢిల్లీ:** వచ్చే నెల 1న ప్రభుత్వం సామాన్యులకు శుభవార్త చెప్పబోతోంది. గ్యాస్ సిలిండర్ ధరలతోపాటు పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించనున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు జాతీయ మీడియాలో వార్తలు వస్తున్నాయి. సెప్టెంబర్ 1 నుంచి ఇంటి అవసరాలకు వినియోగించే డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ ధర రూ.50.. వాణిజ్య సిలిండర్ల ధర రూ.60 నుంచి రూ.70 వరకు తగ్గుతుందని నేషనల్ మీడియా కథనాలు స్పష్టం చేస్తున్నాయి.ఆగస్టులో బిజినెస్-గ్రేడ్ ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ల ధర రూ.8.50 పెరిగింది, జూలైలో రూ.30 తగ్గింది. గతేడాది రాఖీ, ఈ ఏడాది మహిళా దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం డొమెస్టిక్ ఎల్పీజీ సిలిండర్ ధరను రూ.300 తగ్గించింది. ఇప్పుడు దాని ధర మరో రూ.50 తగ్గితే.. రూ.760కే అందుబాటులోకి వస్తుంది. పీఎం ఉజ్వల యోజ కింద రాయితీ పొందేవారు రూ.460కే సిలిండర్ని ఇంటికి తీసుకెళ్లవచ్చు. గ్యాస్ సిలిండర్ రేట్లతోపాటు పెట్రోల్, డీజిల్ ధరలు కూడా తగ్గనున్నట్లు సమాచారం. పెట్రోల్ లీటర్పై రూ.6, డీజిల్ లీటర్పై రూ.5 వరకు తగ్గనున్నట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి. ప్రస్తుతం దేశంలో పెట్రోల్ ధర లీటర్ రూ.100 దాటగా.. డీజిల్ ధర రూ.90 దాటింది. అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు రేట్లు తక్కువగా ఉండటంవల్లే కేంద్రం ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

## ఆర్థిక కష్టాల్లో స్పైస్ జెట్

**సిబ్బందికి మూడు నెలలు జీతం కట్**

**ముంబయి:** చౌకధరలకే విమానయాన్ని అందిస్తున్న స్పైస్ జెట్ (Spice Jet) పీకల్లోతు ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయింది. దీంతో ఖర్చులను తగ్గించుకోవడంపై దృష్టిసారించింది. ఇందులో భాగంగా ఇప్పటికే విమాన సర్వీసులను తగ్గించుకున్న సంస్థ.. తాజా మరో కీలక నిర్ణయం తీసుకున్నది. మూడు నెలల పాటు ఉద్యోగులకు జీతాలు ఇవ్వకూడదని నిర్ణయించింది. నిధుల లేమి కారణంగా 150 మంది క్యాబిన్ సిబ్బందిని మూడు నెలల పాటు సెలవులపై పంపించనుంది. ఈ కాలంలో వారికి మూడు నెలల పాటు వేతనాలు చెల్లించేదిలేదని తెలిపింది. సంస్థ దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ఈమేరకు నిర్ణయం తీసుకున్నామని అధికారులు వెల్లడించారు. ఇప్పటికే స్పైస్ జెట్పై పౌర విమానయాన నియంత్రణ సంస్థ డైరెక్టరేట్ జనరల్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) నిఘా పెడుతున్నట్లు ప్రకటించింది. స్పైస్ జెట్ ఆపరేషన్స్ సజావుగా సాగేందుకు స్పాట్ చెక్స్, రాత్రి వేళ నిఘా పెంచుతున్నట్లు తెలిపింది. ఆర్థిక పరంగా





ఒత్తిళ్ల నేపథ్యంలో స్పైస్ జెట్ విమాన సర్వీసులను రద్దు చేస్తున్న నేపథ్యంలో ఈ నెల 7,8 తేదీల్లో సంస్థ ఇంజినీరింగ్ వసతులపై నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో కొన్ని లోపాలు కనిపించినట్లు డీజీసీఏ తెలిపింది.

స్పైస్ జెట్ గత రికార్డుతోపాటు ఈ నెలలో నిర్వహించిన ప్రత్యేక తనిఖీ నేపథ్యంలో ఆ సంస్థ కార్యకలాపాలపై తక్షణం నిఘా పెంచుతున్నట్లు డీజీసీఏ వివరించింది. దీని ప్రకారం పలు దఫాలు స్పాట్ చెక్స్, రాత్రి వేళ నిఘా చర్యలు పెరుగుతాయి. స్పైస్ జెట్ విమాన సర్వీసులు సురక్షితంగా సాగేందుకే తాము ఈ చర్య తీసుకుంటున్నట్లు డీజీసీఏ గురువారం ఓ ప్రకటనలో తెలిపింది.

# కొత్త ఎనర్జీతో కల్కి-2 పార్ట్

## మరో ఆరు నెలల్లో షూటింగ్ ప్రారంభిస్తాం

పాన్ ఇండియా నటుడు ప్రభాస్ కథానాయకుడిగా నాగ్అశ్విన్ దర్శకత్వంలో రూపొందిన తాజా బ్లాక్ బస్టర్ 'కల్కి'. వైజయంతి మూవీస్ బ్యానర్‌లో వచ్చిన ఈ చిత్రం జూన్ 27న విడుదలై సూపర్‌హిట్ అందుకోవడమే కాకుండా.. ప్రపంచవ్యాప్తంగా దాదాపు రూ.1300 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టి రికార్డులను సృష్టించింది. ఇదిలావుంటే ఈ సినిమాకు సీక్వెల్ ఉందని నాగ్ అశ్విన్ ప్రకటించిన విషయం తెలిసిందే. సీక్వెల్‌ను అయితే ప్రకటించారు కానీ ఎప్పుడు మొదలుపెట్టనున్నారు అనేది మాత్రం వెల్లడించలేదు. అయితే తాజాగా కల్కి 2 సినిమా షూటింగ్‌కు సంబంధించి ఇంట్రెస్టింగ్ అప్‌డేట్‌ను పంచుకున్నారు నిర్మాతలు స్వప్నదత్, ప్రియాంకదత్‌లు. వీరిద్దరూ.. మాస్కో ఇంటర్నేషనల్ ఫిల్మ్ వీక్‌లో పాల్గొని అక్కడి మీడియాకు ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ క్రమంలోనే మూవీ అప్‌డేట్‌ను పంచుకున్నారు. ఈ మూవీ షూటింగ్ అప్‌డేట్‌పై నిర్మాత ప్రియంకా దత్ మాట్లాడుతూ.. కల్కి 2 షూటింగ్ మరో ఆరు నెలల్లో మొదలు పెట్టనున్నట్లు చెప్పారు. ఒక్కసారి మూవీ షూటింగ్ స్టార్ట్ అయితే వరుస అప్‌డేట్‌లను ఇస్తాం అని తెలిపారు. స్వప్నా దత్ మాట్లాడుతూ.. మొదటి పార్ట్ కంటే ఈ మూవీ కోసం ఎక్కువగా ఇంట్రెస్ట్‌గా ఉన్నాం. కల్కి నుంచి చాలా నేర్చుకున్నాం. కొత్త ఎనర్జీతో కల్కి 2ను మొదలుపెట్టబోతున్నాం అంటూ చెప్పుకొచ్చింది.





# నటుడు నితిన్ భార్య కోసం షూటింగ్‌కు సెలవు

యంగ్ హీరో నితిన్ సక్సెస్, ఫెయిల్యూర్స్ తో సంబంధం లేకుండా సినిమాలు చేసుకుంటూ వెళ్తున్నాడు. చివరిగా నితిన్ మాచర్ల నియోజకవర్గం మూవీతో ప్రేక్షకుల ముందుకి వచ్చారు. ఈ సినిమా డిజాస్టర్ అయ్యింది. కమర్షియల్ యాక్షన్ జోనర్ లో వచ్చిన ఈ చిత్రం ప్రేక్షకులని నిరాశ పరిచింది. నితిన్ చివరిగా భీష్మ మూవీతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్నాడు. అవుట్ అండ్ అవుట్ కామెడీ అండ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ గా ఆ చిత్రం వెంకీ కుడుముల దర్శకత్వంలో వచ్చింది. మరల ఇప్పుడు వెంకీ కుడుముల దర్శకత్వంలో నితిన్ రాబిన్ హుడ్ అనే మూవీ చేస్తున్నాడు. ఇది కూడా కామెడీ అండ్ యాక్షన్ ఎంట్టంల్గ÷నర్ గానే ఉండబోతోంది. శ్రీలీల ఈ చిత్రంలో నితిన్ కి జోడీగా నటిస్తోంది. దీంతో పాటుగా దిల్ రాజు బ్యానర్ లో వేణు శ్రీరామ్ దర్శకత్వంలో తమ్ముడు మూవీ నితిన్ చేస్తున్నాడు. ఈ మూవీ షూటింగ్ ప్రస్తుతం జరుగుతోంది. మారేడుమిల్లిలో కీలక సన్నివేశాలు తెరకెక్కిస్తున్నారంట. కాంతారా ఫేమ్ సప్తమి గౌడ ఈ చిత్రంలో హీరోయిన్ గా నటిస్తోంది. ఇదిలా ఉంటే నితిన్ ఇప్పుడు ఈ సినిమాల షూటింగ్స్ నుంచి రెండు నెలలు బ్రేక్ తీసుకోవాలని అనుకుంటున్నారంట. నితిన్ 2020లో షాలిని కందుకూరిని వివాహం చేసుకున్నారు. ఇద్దరిది ప్రేమ వివాహం. ఇద్దరు కూడా ప్రస్తుతం హ్యాపీ లైఫ్ లీడ్ చేస్తున్నారు. కొంతకాలం క్రితం షాలిని గర్భవతి అయ్యిందంట. ఆమెకి సెప్టెంబర్ లో డెలివరీ డేట్ ఇచ్చారంట. దీంతో రెండు నెలల పాటు భార్యతో స్పెండ్ చేసేందుకు నితిన్ షూటింగ్స్ కి బ్రేక్ ఇవ్వాలని అనుకుంటున్నారంట. రాబిన్ హుడ్ సినిమాని డిసెంబర్ 20న రిలీజ్ చేస్తున్నట్లు మైత్రీ మూవీ మేకర్స్ ఇప్పటికే ప్రకటించారు. తమ్ముడు మూవీని కూడా వీలైనంత వేగంగా ప్రేక్షకుల ముందుకి తీసుకురావాలని అనుకుంటున్నారు. మరి రెండు నెలల పాటు షూటింగ్స్ కి నితిన్ బ్రేక్ ఇస్తే అనుకున్న ప్రకారం వాటిని రిలీజ్ చేయడం కుదురుతుందా అనే ప్రశ్న ఇప్పుడు వినిపిస్తోంది. తమ్ముడు సినిమా షూటింగ్ ఆల్ మోస్ట్ చివరి దశకి వచ్చేసిందని టాక్ వినిపిస్తోంది. రాబిన్ హుడ్ మూవీని ఈ ఏడాదిలో రిలీజ్ చేయడం కష్టం కావచ్చేమో అనే ప్రచారం నడుస్తోంది. డిసెంబర్ లో దిల్ రాజు ప్రొడక్షన్ నుంచి గేమ్ చేంజర్ ప్రేక్షకుల ముందుకి రానున్న నేపథ్యంలో తమ్ముడు చిత్రాన్ని వచ్చే ఏడాదిలోనే ప్లాన్ చేసే ఛాన్స్ ఉందని టాలీవుడ్ వర్గాలలో వినిపిస్తోంది.


# పాట రాసాను.. పాడాను అంటున్న ఫరియా

శ్రీసింహా హీరోగా రానున్న చిత్రం 'మత్తు వదలరా 2' రితేశ్ రానా దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ కామెడీ ఎంటర్‌టైనర్‌లో ఫరియా అబ్దుల్లా కీలక పాత్రలో కనిపించనున్నారు. సెప్టెంబర్ 13న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకురానుంది. ఈనేపథ్యంలో తాజాగా దీని టీజర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఈసందర్భంగా మీడియాతో మూవీ టీమ్ ముచ్చటించింది. 'నేను వర్క్ చేసిన టీమ్‌లలో ఇది బెస్ట్. షూటింగ్ చాలా సరదగా జరిగింది. ఈ సినిమా కోసం నేను ఓ పాట రాశాను. దాన్ని నేనే పాడి కొరియోగ్రఫీ చేశాను. కొత్తగా ఉంటుంది. ఎంజాయ్ చేస్తారు' అని ఫరియా అన్నారు. 'మత్తు వదలరా'తో నేను ఇండస్ట్రీకి వచ్చాను. 5 ఏళ్ల తర్వాత దాని సీక్వెల్‌కు వర్క్ చేయడం చాలా ఆనందంగా ఉంది. ఇలాంటి సినిమాలు తక్కువగా వస్తుంటాయి. ఫస్ట్ పార్ట్‌కు థియేటర్‌లోనే కాకుండా ఓటీటీలోనూ మంచి ఆదరణ లభించింది. దీని సీక్వెల్‌ను అలానే ఆదరిస్తారని ఆశిస్తున్నా' అని కాలభైరవ చెప్పారు. మొదటిభాగం అంచనాలకు మించి విజయం సాధించిందని శ్రీసింహా ఆనందం వ్యక్తంచేశారు.



# ఐశ్వర్యతో ఆన్‌స్క్రీన్ బాగా ఉంటుంది: విక్రమ్

విక్రమ్ నటించిన తాజా చిత్రం 'తంగలాన్' సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో బాలీవుడ్ నటి ఐశ్వర్యరాయ్ తో వర్కింగ్ గురించి విక్రమ్ స్పందించారు. ఆమె తనకు మంచి మిత్రురాలన్నారు. ఆమె కంటే ఎక్కువగా అభిషేక్ బచ్చన్‌తోనే తనకు మంచి అనుబంధం ఉందని చెప్పారు. తమ కాంబోలో వచ్చిన రెండు చిత్రాల్లోనూ ముగింపు బాధాకరంగా ఉంటుందని ఆయన తెలిపారు. 'అభిషేక్ బచ్చన్ నాకు క్లోజ్ ఫ్రెండ్. దానివల్ల ఆయన కుటుంబసభ్యులతోనూ నాకు మంచి అనుబంధం ఉంది. ఐశ్వర్యరాయ్ మంచి మిత్రురాలు. ఆమె గొప్ప నటి. మా మధ్య చక్కని ఆన్‌స్క్రీన్ కెమిస్ట్రీ ఉంది. సినీప్రియులు దానిని ఆస్వాదిస్తుంటారు. ఇప్పటివరకూ మా కాంబోలో 'రావన్', 'పొన్నియిన్ సెల్వన్' చిత్రాలు వచ్చాయి. ఆయా చిత్రాల్లో మా పాత్రల ప్రేమకథకు సరైన ముగింపు ఉండదు. రెండు చిత్రాల్లోనూ ఆమె వేరే వ్యక్తి భార్యగా కనిపిస్తారు. చివరకు నా పాత్ర మృతి చెందుతుంది. అది ఫ్యాన్స్‌ను బాధకు గురిచేస్తుంది. ఇదే విషయంపై దర్శకుడు మణిరత్నంను నేను రిక్వెస్ట్ చేశా. మా ఇద్దరి పాత్రలకు సంతోషకరమైన ముగింపు ఇచ్చేలా ఒకే ఒక్క సినిమా చేయమని అడిగా. దానివల్ల అభిమానులు ఆనందపడతారని చెప్పా' అని విక్రమ్ తెలిపారు. విక్రమ్ - అభిషేక్ బచ్చన్ - ఐశ్వర్యరాయ్ కాంబోలో తెరకెక్కిన తొలి చిత్రం 'రావన్' మణిరత్నం దర్శకత్వం వహించారు. ఈ సినిమా క్లైమాక్స్‌లో విక్రమ్ పాత్ర మృతి చెందుతుంది. ఇదే కాంబోలో ఇటీవల వచ్చిన చిత్రం 'పొన్నియిన్ సెల్వన్' చోళుల వైభవం, ఆ సామ్రాజ్య పతనానికి కారణమైన విషయాలను తెలియజేస్తూ దీనిని రూపొందించారు. ఇందులో ఆదిత్య కరికాలన్‌గా విక్రమ్, నందినిగా ఐశ్వర్యరాయ్ నటించారు. ఇద్దరూ ప్రేమించుకున్నప్పటికీ అనివార్య కారణాల వల్ల నందిని మరో వ్యక్తిని పెళ్లాడాల్సి వస్తుంది. ఆదిత్య కరికాలన్ పాత్ర మృతితో ఈ సినిమా ముగుస్తుంది. 'తంగలాన్' విషయానికి వస్తే.. ఆగస్టు 15న ఈ చిత్రం దక్షిణాదిలో విడుదలై మంచి టాక్ సొంతం చేసుకుంది. ఈనేపథ్యంలోనే శుక్రవారం దీనిని హిందీలో విడుదల చేశారు.



# ఆ వ్యాఖ్యలు పుష్పను ఉద్దేశించి కాదు

## పవన్ వ్యాఖ్యలపై నిర్మాత రవిశంకర్ క్లారిటీ

ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ గత నెల బెంగళూరు పర్యటనలో ఉన్నప్పుడు అడవుల నరికివేతపై సంచలన వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. ఇంతకుముందు సినిమాల్లో హీరోలు అడవులని కాపాడేవారు. కానీ ఈరోజుల్లో గొడ్డళ్లు పట్టుకొని, స్మగ్లింగ్ చేయడం అడవులను నరికివేయడం హీరోయిజం అయిపోయింది. నేను ఆ పరిశ్రమలో ఉన్నానని అలోచించుకుంటే అప్పుడప్పుడు బాధగా అనిపిస్తుంటుంది. ఇలాంటివి తగ్గి మళ్లీ అడవుల ప్రాముఖ్యత తెలిసేలా సినిమాలు రావాలని పవన్ కళ్యాణ్ చెప్పారు. అయితే పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలు అల్లు అర్జున్‌ను ఉద్దేశించి చేసినవే అంటూ నెటిజన్లు కామెంట్లు పెట్టారు.



అల్లు అర్జున్ నటిస్తున్న పుష్ప సినిమాలో గొడ్డళ్లు పట్టుకొని, స్మగ్లింగ్ చేయడం అడవులను నరికివేయడం లాంటివి ఉండడంతో కావాలని వ్యాఖ్యలు చేస్తున్నాడని అల్లు ఫ్యాన్స్ పవన్‌పై విమర్శలు గుప్పించారు. ఇదిలావుంటే తాజాగా ఈ వివాదంపై ఉస్తాద్ భగత్ సింగ్ నిర్మాత రవిశంకర్ క్లారిటీ ఇచ్చాడు. పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలు అల్లు అర్జున్ ? 'పుష్ప 2'ను ఉద్దేశించి కాదని క్లారిటీ ఇచ్చారు. పవన్ అలా ఎప్పుడు మాట్లాడరని.. మెగా ఫ్యామిలీ అంతా ఒక్కటే అని చెబుతాడని చెప్పుకొచ్చాడు. ఇక ఉస్తాద్ భగత్ సింగ్ సినిమా గురించి మాట్లాడుతూ.. ఈ మధ్యే పవన్ కల్యాణ్‌ను కలిశాను. త్వరలోనే 'ఉస్తాద్ భగత్‌సింగ్' షూటింగ్ ప్రారంభిస్తాం. వచ్చే ఏడాది జనవరి నాటికి షూటింగ్ పూర్తి చేయాలి అనుకుంటున్నాం. సెప్టెంబర్ 2 పవన్ బర్త్‌డే నాడు ఓ సర్‌ప్రైజ్ కచ్చితంగా ఉండబోతుంది అంటూ రవి శంకర్ చెప్పుకొచ్చాడు.

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com